సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 353

శనివారం 14-3-2020

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

నిర్బంధం నుంచి ఫరూక్ విడుదల

ఒమర్, మెహబూబాలనూ విడుదల చేయాలన్న మాజీ సీఎం - 5లో

కోవిడ్ కోస్టర్

భారీ నష్టాల నుంచి భారీ లాభాల్లోకి సూచీల యూ-టర్న్ - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

● మధ్యప్రదేశ్‌లో బలపరీక్ష

విశ్వాస పరీక్షకు సిద్ధం

కాంగ్రెస్‌కు చెందిన 22 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం సంక్షోభంలో పడింది. విశ్వాస పరీక్షకు సిద్ధంగా ఉన్నామంటూ సీఎం కమల్‌నాథ్ తెలిపారు. గవర్నర్ లాల్జీ టాండన్‌ని కలసి ఓ లేఖ అందజేశారు. తమ ఎమ్మెల్యేలను బీజేపీ నిర్బంధంలో ఉంచి బేరసారాలాడుతోందని ఆరోపించారు.

- 5లో

● సార్క్ దేశాలకు మోదీ పిలుపు

ఉమ్మడిగా పోరాడదాం

కోవిడ్ కట్టడికి కలసికట్టుగా పోరాటం చేద్దామని ప్రధాని నరేంద్ర మోదీ సార్క్ దేశాలకు పిలుపునిచ్చారు. ఇందుకోసం సభ్య దేశాలు ఉమ్మడిగా బలమైన వ్యూహాన్ని రచించాలని ప్రతిపాదించారు. అవసరమైతే సభ్యదేశాల అధినేతలందరూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించుకొని ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని మోదీ శుక్రవారం ట్వీట్ చేశారు.

- 5లో

క్రికెట్‌కు కరోనా ఎఫెక్ట్



- మార్చి 29న ప్రారంభం కావాల్సిన ఐపీఎల్ వాయిదా. ఏప్రిల్ 15 వరకు మ్యాచ్‌లు నిర్వహించరాదని బీసీసీఐ నిర్ణయం
- భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌లో భాగంగా జరగాల్సిన రెండు వన్డేలు రద్దు
- శ్రీలంకతో 2 టెస్టులు ఆడేందుకు వచ్చిన ఇంగ్లండ్ పర్యటనను రద్దు చేసుకొని స్వదేశానికి పయనం.

పూర్తి వివరాలు - స్పోర్ట్స్‌లో

● విమెన్ ఫ్రెండ్లీ పోలీస్...

షీ ఐ మాధవి

'జరిగిందంతా నాతో చెప్పడం మీకు ఇబ్బందిగా ఉంటే మా లేడీ కానిస్టేబుల్‌తో షేర్ చేసుకోవచ్చు' అని చెప్తాడు లైంగిక బాధితురాలితో ఓ ఎస్సై. 'సెక్షన్ 375' సినిమాలోని దృశ్యమిది. నిజంగా కూడా పోలీస్ శాఖలో ఇలా ఆలోచించే వాళ్లుంటే బాగుండు అనిపిస్తుంది. లేరు అనడానిక్కూడా లేదు.. ఉన్నారు. కొంత మంది. వాళ్లలో వాసంశెట్టి మాధవి ఒకరు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సీఐగా పనిచేస్తున్నారు.

- ఫ్యామిలీలో

7 దేశాలతో హైరిస్క్

అక్కడి నుంచి వచ్చే వారంతా ప్రత్యేక ఐసోలేషన్‌కు తరలింపు

వికారాబాద్ జిల్లా అనంతగిరిలోని హరిత రిసార్ట్‌లో ఏర్పాట్లు

14 రోజులపాటు నిరంతర వైద్య పర్యవేక్షణ..

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్

దేశంలో కోవిడ్ వైరస్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చైనా, ఇటలీ, ఇరాన్, ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, దక్షిణ కొరియా దేశాల్లో కోవిడ్ వైరస్ తీవ్రత దృష్ట్యా ఆ దేశాలను అత్యంత ప్రమాదకరమైన, హైరిస్క్ దేశాలుగా పరిగణించింది. ఆ ఏడు దేశాల నుంచి ఎవరొచ్చినా, వారికి కోవిడ్ లక్షణాలు ఉన్నా లేకున్నా ప్రత్యేకంగా ఐసోలేషన్‌లో ఉంచాలని శుక్రవారం నిర్ణయించింది. ఆ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నేరుగా వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో నడిచే హరిత వ్యాలీ వ్యూ రిసార్ట్‌కు తరలించనుంది. ఈ విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఆయా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు అవసరమైన ఆహారం, ఇతర వసతులను సైతం రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేయనుంది. వారిని 14 రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వైరస్ లేదని నిర్ధారణ అయ్యాక ఇళ్లకు పంపనుంది. ఒకవేళ ఎవరికైనా కోవిడ్ లక్షణాలుంటే తక్షణమే గాంధీ లేదా ఇతర నిర్ణీత ప్రభుత్వ కోవిడ్ చికిత్స అందించే చోటుకు పంపనుంది. ఇప్పటికే ఏ దేశం నుంచైనా హైదరాబాద్ చేరుకున్న

మిగతా 2వ పేజీలో ▶

కోవిడ్‌ను జయించాడు

- గాంధీ ఆస్పత్రి నుంచి వైరస్ బాధితుడి డిశ్చార్జి
- 13 రోజులపాటు చికిత్స పొందిన యువకుడు
- తాజా పరీక్షల్లో వైరస్ లేదని తేలడంతో ఇంటికి..

14 లో

భారత్‌లో రెండో మరణం

- ఢిల్లీలో కోవిడ్-19తో మృతి చెందిన మహిళ
- దేశవ్యాప్తంగా 82 కేసుల నిర్ధారణ
- బెంగళూరు షట్‌డౌన్.. మాల్స్, థియేటర్స్‌ను మూసేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

- 5లో

ఆస్తి పన్ను, విద్యుత్ చార్జీలు..

పెంచక తప్పదు

పల్లె ప్రగతిపై స్వల్పకాలిక చర్చలో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్

స్థానిక సంస్థలు మనుగడ సాగించాలంటే పన్నులు పెంచక తప్పదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను పెంచి తీరుతామని ప్రకటించారు. పన్నులు పెంచబోమని చందమామ కథలు చెప్పబోమని, పన్ను కట్టే సామర్థ్యం ఉన్న వారిపైనే భారం మోపుతామన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం పల్లె ప్రగతి కార్యక్రమంపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించిన సీఎం కేసీఆర్ పల్లెలు, పట్టణాల అభివృద్ధిపై ప్రభుత్వ దృక్పథాన్ని వివరించారు. పంచాయతీరాజ్ చట్టం అమలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్ల విధులు, కలెక్టర్లకు ఉన్న అధికారాల గురించి మాట్లాడారు. ఆస్తి పన్నుతోపాటు విద్యుత్ చార్జీలు కూడా పెంచనున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

'గత పాలకులు రాజకీయం చేసి పంచాయతీరాజ్, సహకార రంగాలను ఉరితీశారు. గ్రామీణులను ఏకీకృతం కాకుండా గ్రూపులుగా విడగొట్టారు. పంచాయతీ వ్యవస్థను

మిగతా 2వ పేజీలో ▶

- కట్టగలిగే వారిపైనే ఆస్తి పన్ను భారం వేస్తాం
- దళితులు, గిరిజనులకు రూపాయి కూడా పెంచం
- గత పాలకులు పంచాయతీ, సహకార రంగాలను ఉరితీశారు
- ఎమ్మెల్యేల జీతాలు కోత పెట్టి, పస్తులుండయినా పంచాయతీలను కాపాడుకుంటాం
- 100 శాతం పన్నులు వసూలు చేయని సర్పంచ్, కార్యదర్శులపై చర్యలు





కోవిడ్ టెర్రర్
ఎందెందు వెతికినా.. అందందే

థాయిలాండ్‌లో

జెఎఫ్‌కె ఎయిర్‌పోర్టు, న్యూయార్క్

లండన్ ట్రైన్

ఇరాన్ కేబినెట్ భేటీ

మాల్స్ ఖాళీ...

కువైట్‌లో కోవిడ్ పరీక్షల కోసం


ఫ్రిజులు ఫుల్

కోవిడ్ టెర్రర్ ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోంది.. చాలా దేశాల్లో స్కూళ్లు, కాలేజీలు, వర్సిటీలు మూతపడ్డాయి.. అటు ప్రయాణాలపై ఆంక్షలు విధించారు.. నిన్నమొన్నటి దాకా కిటకిటలాడిన పర్యాటక ప్రదేశాలు, విమానాశ్రయాలు ఇప్పుడు బోసిపోయి కనిపిస్తున్నాయి. యూరోప్ దేశాల్లో ఎప్పుడేం మూత పడతాయన్న భయంతో జనం సూపర్‌మార్కెట్లకు పరుగులు తీస్తున్నారు. వాటర్ బాటిల్ నుంచి టాయిలెట్ రోల్ వరకూ ఇలా భారీ స్థాయిలో నిత్యావసరాలు కొనుక్కొని.. ఇళ్లగా సూపర్‌మార్కెట్లు మారుస్తున్నారు.. ఇక థాయ్‌లాండ్‌లోని లోప్‌బురిలో పర్యాటకుల రాక.. వారిచ్చే ఆహారం లేకపోవడంతో వందలాది కోతులు ఆహారం కోసం రోడ్ల మీద పడ్డ దృశ్యాలు వైరల్‌గా మారాయి.. కోవిడ్ ఎఫెక్ట్ ఎలా ఉందంటే...

నల్లమల పర్యాటకానికి రూ.56.84 కోట్లు

పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: నల్లమలలో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అక్కడ ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు అవకాశముందని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. మల్లెల తీర్థం వెళ్లడానికి రహదారి నిర్మించాల్సి ఉన్నా.. అటవీ చట్టాలు ప్రతిబంధకంగా ఉన్నాయన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. నల్లమల పర్యాటకాభివృద్ధికి రూ.56.84 కోట్లు మంజూరు చేశామని, ఇందులో అక్క మహాదేవి గుహలకు రూ.1.25 కోట్లు, కడలివనం కోసం రూ.11.04 లక్షలు, ఈగలపెంటకు రూ.25.94 కోట్లు, ఫర్హాబాద్‌కు రూ.13.81 కోట్లు, మల్లెల తీర్థానికి రూ.5.35 కోట్లు, ఉమామహేశ్వర దేవాలయానికి రూ.10.35 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.

ఓవర్‌సీస్ విద్యానిధికి ఆర్థిక సాయం పెంచం

కొప్పుల ఈశ్వర్

ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఓవర్‌సీస్ విద్యానిధి పథకం కింద ఆర్థిక సాయం పెంచే యోచన లేదని ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టంచేశారు. అలాగే సీఎం ఓవర్‌సీస్ విద్యానిధి కింద నిర్దేశించిన కోటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలేదని, దీంతో కొత్తగా పెంచాల్సిన ఆవశ్యకత లేదన్నారు. సభ్యులు షకీల్ అమీర్ మహ్మద్, మెతుకు అనంద్, స్టీఫెన్‌సన్‌లు అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు.

లాభాల బాట పడితే కొత్త డిపోల మాట

పువ్వాడ అజయ్

ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని, ఇదే ఒరవడిని కొనసాగిస్తే కొత్త డిపోలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గత మూడు నెలలుగా అనేక సంస్కరణలు తీసుకురావడంతో ఆర్టీసీ క్రమంగా లాభాల్లోకి వస్తోందని, నిర్వహణావ్యయం తగ్గించడానికి ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్సుల స్థానంలో 1,334 అద్దెబస్సులను ప్రవేశపెడుతామన్నారు. ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసాలను తొలగించడానికి ఇటీవల చార్జీలను పెంచామని నష్టాలనుంచి గట్టెక్కామని చెప్పారు.

వక్ఫ్‌బోర్డును రద్దు చేయండి

వక్ఫ్ బోర్డులో అక్రమాలపై అక్బరుద్దీన్ మండిపాటు

సాక్షి, హైదరాబాద్: 'ముస్లింలకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం లేదు. వారి అభ్యున్నతికి కావాల్సినంత మొత్తం భరించేంత ఆస్తి వక్ఫ్ వద్దే ఉంది. కానీ ఆ వక్ఫ్ సంపదను కొందరు దోచుకుంటున్నా పట్టించుకోవట్లేదు. వక్ఫ్ బోర్డును కొనసాగించాలంటే నిజాయితీ ఉన్న వారిని బాధ్యులుగా పెట్టండి.. లేదంటే వక్ఫ్ బోర్డునే రద్దు చేయండి'అని శుక్రవారం అసెంబ్లీలో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. 'ముస్లింలకు రంజాన్ వేళ ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆ పేరుతో ఖర్చు చేసే మొత్తాన్ని మైనారిటీల్లోని అనాథల సంక్షేమం కోసం ఖర్చు చేయండి. దాన్ని గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇవ్వండి'అని చెప్పారు. మైనారిటీల అభ్యున్నతికి మరే రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందని, అందుకే మజ్లిస్ పార్టీ ఆయనకు మద్దతు తెలుపుతోందన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు మేలు జరుగుతున్న 54 అంశాలను ప్రస్తావించారు. ఈ ప్రభుత్వానికి అండగా ఉంటూనే, అవసరమైన విషయాల్లో నిలదీసేందుకూ వెనకాడబోమని తేల్చిచెప్పారు. వక్ఫ్‌బోర్డులో జరుగుతున్న లోపాలపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. కనీస అర్హతలు కూడా లేనివారికి పదోన్నతులు కల్పిస్తూ భారీ ఎత్తున జీతాల రూపంలో ప్రజా ధనాన్ని చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. పదో తరగతి చదివిన వారిని ఏకంగా సహాయ కార్యదర్శి పోస్టులో కూర్చోబెట్టారని, వారికి రూ.లక్ష చొప్పున జీతాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. మూడో తరగతి మాత్రమే చదివిన ఓ వ్యక్తిని ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించారని, ఆయనకు రూ.54 వేల జీతం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో సీబీఐతో లేదా సీఐడీతో లేదా హైకోర్టు విశ్రాంత జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 1999లో తొలిసారి ఎమ్మెల్యే అయినప్పటి నుంచి వక్ఫ్ అక్రమాల గురించి గొంతెత్తుతున్నా పట్టించుకోవట్లేదని, తన జుట్టు నెరుస్తున్నా మార్పు లేదని అసహనం వ్యక్తం చేశారు. వక్ఫ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరారు.

పరిమితికి లోబడే అప్పులు

- ఇసుక, రాజీవ్ స్వగృహ, దిల్ భూములు అమ్మి ఆదాయం పెంచుతాం
- ఇప్పటికే 1.23 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ
- మండలిలో బడ్జెట్‌పై చర్చకు ఆర్థిక మంత్రి హరీశ్ సమాధానం
- ఉద్యోగులకు తక్షణమే ఐఆర్ ప్రకటించాలన్న జీవన్‌రెడ్డి
- ఉపాధ్యాయుల అరెస్ట్‌లకు నిరసనగా నర్సిరెడ్డి వాకౌట్

హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అప్పులు కేంద్ర నిబంధనల పరిమితికి లోబడే ఉన్నాయని ఆర్థిక మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితులకు లోబడే రాష్ట్రం అప్పులు చేసిందని, ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి ఇటీవల పార్లమెంట్‌లో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారని తెలిపారు. రాష్ట్ర జీఎస్‌డీపీని దృష్టిలో పెట్టుకుంటే 25 శాతం వరకు అప్పులు తీసుకునే అవకాశమున్నా, రాష్ట్రం మాత్రం 21.3 శాతమే అప్పులు చేసిందన్నారు. దేశంలో 24 రాష్ట్రాలు ఎఫ్ఆర్‌బీఎంకు మించి అప్పులు చేశాయని, అప్పుల్లో రాష్ట్రం దిగువ నుంచి ఆరో స్థానంలో ఉందని వెల్లడించారు. శుక్రవారం శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చకు హరీశ్ సమాధానమిచ్చారు. బడ్జెట్ ప్రజలకు ఆశాజనకంగా ఉంటే, ప్రతిపక్షాలకు మాత్రం నిరాశాజనకంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అంతర్గత వనరులను పెంపొందించుకుంటూ, దుబారాను తగ్గిస్తామన్నారు. ముఖ్యంగా ఇసుక అమ్మకాలు, దిల్ భూములు, హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహాలను అమ్మడం ద్వారా ఆదాయాన్ని పెంచుకుంటామన్నారు.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి: టి.జీవన్‌రెడ్డి, కాంగ్రెస్

ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఉద్యోగులకు పీఆర్‌సీ ఆలస్యమవుతున్న నేపథ్యంలో తక్షణమే 27 శాతం ఐఆర్ ప్రకటించాలి. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో కొత్త రేషన్ దుకాణాలను మంజూరు చేయాలి. రూ.50 వేల రుణాలు తీసుకున్న రైతులకు రెండు విడతలుగా రుణమాఫీ చేయాలి. రేషన్ ద్వారా చక్కెర, పామాయిల్ పంపిణీ చేయాలి'అని కోరారు.

ఉపాధ్యాయుల అరెస్ట్‌లకు నిరసనగా నర్సిరెడ్డి వాకౌట్..

అనంతరం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల పీఆర్‌సీ ప్రకటించకపోవడం విచారకరమన్నారు. దీనిపై నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఉపాధ్యాయుల అరెస్ట్‌లపై మంత్రి ప్రకటన చేయాలని కోరారు. ప్రకటన చేయనందుకు నిరసనగా ఆయన మండలి నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు సైతం ఉద్యోగులకు పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని కోరారు.

రూ.9,033 కోట్లు రావాలి...

కేంద్రం నుంచి కోతలే తప్ప వచ్చిన నిధులేమీ లేవని, ఫిబ్రవరి నెలకు సంబంధించి జీఎస్టీ బకాయిలు రూ.9,033 కోట్లు రావాలని, 14వ ఆర్థిక సంఘం నిధులు సైతం రూ.395 కోట్లు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 1.50 లక్షల ఉద్యోగాల భర్తీకి అనుమతిచ్చామని, ఇందులో 1.23 లక్షలను భర్తీ చేశామని, ఇవన్నీ రెగ్యులర్ ఉద్యోగాలేనని స్పష్టం చేశారు. మరో 27వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఉద్యోగులకు పీఆర్‌సీపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని, దానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. మండల, జిల్లా పరిషత్‌లకు సైతం గ్రామపంచాయతీల తరహాలో నిధులు కేటాయిస్తామన్నారు. ఇప్పటికే నిర్మాణం మొదలు పెట్టిన 2.72 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తూనే కొత్తగా మరో లక్ష ఇళ్లను లబ్ధిదారుల సొంత స్థలాల్లో కట్టించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

పల్లెల అభివృద్ధికి నడుం బిగించారు

- మరో గాంధీగా కేసీఆర్..

సాక్షి, హైదరాబాద్: పల్లెల ప్రగతి కోసం మహాత్మాగాంధీ కన్న కలలను నిజం చేస్తూ సీఎం కేసీఆర్ గ్రామాల సమగ్రాభివృద్ధికి నడుం బిగించారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశంసించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మహాత్ముడి తర్వాత మరో గాంధీగా మారారని కొనియాడారు. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి అని బలంగా నమ్మి గ్రామ స్వరాజ్య స్థాపనకు గాంధీ కలలు కన్నారని, అయితే అప్పటి ప్రభుత్వాలు ఆయన కలలు, ఆదర్శాలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఇన్నేళ్ల తర్వాత తెలంగాణ గ్రామాలను ఆదర్శ పల్లెలుగా మార్చడంతో పాటు స్వయం సమృద్ధిని సాధించే దిశలో కేసీఆర్ వినూత్నమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజల గురించి ఇంతగా ఆలోచించే సీఎంను చూడలేదని ఎర్రబెల్లి పేర్కొన్నారు. శుక్రవారం శాసనమండలిలో పల్లెప్రగతిపై స్వల్ప వ్యవధి చర్చకు ఎర్రబెల్లి సమాధానమిస్తూ.. 150 మంది జనాభా ఉన్న గ్రామాలకు కూడా ప్రభుత్వం ఏడాదికి రూ.5 లక్షల గ్రాంట్‌ను విడుదల చేస్తుందని చెప్పారు. గ్రామాలు బాగుపడాలనే ధ్యేయంతో నిరంతర కార్యక్రమంగా కొనసాగిస్తున్న పల్లెప్రగతి కార్యక్రమానికి నిధుల కొరత లేదని అన్నారు.

నిధుల్లేక సర్పంచ్‌ల గోస: భట్టి

సాక్షి, హైదరాబాద్: పల్లె ప్రగతి లక్ష్యం మంచిదే అయినా.. క్షేత్రస్థాయిలో సర్పంచ్‌లు సమస్యలు ఎదుర్కొంటున్నారని శాసనసభ కాంగ్రెస్ పక్ష నేత మల్లు భట్టు విక్రమార్క అభిప్రాయపడ్డారు. నిధుల కొరతతో సతమతమతున్న పంచాయతీలపై ట్రాక్టర్లు, ట్యాంకర్లు, ట్రాలీలతో ప్రభుత్వం భారం మోపుతోందని విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీలో పల్లెప్రగతిపై నిర్వహించిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు కేటాయిస్తున్న నిధుల్లో దాదాపు మొత్తం నిధులు వీటి కొనుగోలు, మల్టీ పర్పస్ వర్కర్ల జీతాలకే ఖర్చవుతున్నాయన్నారు. మేజర్ పంచాయతీల్లో ఇలాంటి పరిస్థితి ఉంటే.. చిన్న పంచాయతీల్లో ట్రాక్టర్ల కొనుగోలుకు నిధుల్లేక, బ్యాంకు గ్యారెంటీగా స్థానిక సర్పంచ్, కార్యదర్శులేగాకుండా అవసరమైతే ఎంపీవో, ఎంపీడీవోలు కూడా ఇస్తున్నారని, వాయిదాలు కట్టకపోతే జీతాలు కట్ అయ్యే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నిధుల కేటాయింపు జరుపుతున్నప్పటికీ, విడుదల చేస్తున్న నిధులన్నీ సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ నిర్వహణకు సరిపోతుందని, అభివృద్ధికి నిధుల్లేకుండా.. పల్లె ప్రగతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలకు రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలకు కేంద్రం విడుదల చేస్తున్న ఉపాధి హామీ పథకం నిధులను వాడుకుంటోందన్నారు.

ఆస్తి పన్ను, విద్యుత్ చార్జీలు.. పెంచక తప్పదు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వీర్యం చేశారు. బోరుబావులను పూడ్చే పరిస్థితి లేదు. బోరుబావిలో పిల్లలు పడితే.. టీవీలు గగ్గోలు పెడితే ఇక్కడి నుంచి చూడటం తప్ప ఏం చేయలేని దౌర్భాగ్య పరిస్థితి ఉండేది. ఇదో పంచాయతీరాజ్ వ్యవస్థనా? పెంటకుప్పలా తయారైంది. కరోనా, గిరోనా ఎందుకు వస్తోంది. ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థగా మారిస్తే రోగాలు దరికి చేరవు. సర్పంచ్‌ను పొద్దున తీసేస్తే మధ్యాహ్నానికల్లా ఎమ్మెల్యేను పట్టుకొని కలెక్టర్ ఎదురుగా కూర్చొని వెకిలినవ్వు నవ్వే పరిస్థితి ఉంది. వంద శాతం ఆస్తిపన్ను వసూలు కావాల్సిందే. పన్ను వసూలు చేయకపోతే సర్పంచ్, కార్యదర్శులను ఉద్యోగం నుంచి తీసేస్తాం. నిందించినంత మాత్రాన, విమర్శించినంత మాత్రాన వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. పంచాయతీరాజ్ చట్టాన్ని నిక్కచ్చిగా అమలు చేస్తాం. ఇందులో శషభిషల్లేవ్.

విశ్వసనీయత ఉండాలి..

విద్యుత్ చార్జీల పెంపు తప్పనిసరి...

విద్యుత్ చార్జీలు పెంచుతాం. సంస్థను కాపాడుకునేందుకు ఇది తప్పనిసరి. దళితులు, గిరిజనులకు 101 యూనిట్ల పరిధిలో మాత్రం చార్జీలు పెంచం. కొంత ఆస్తి పన్ను కూడా పెంచబోతున్నాం. మాకు ఆ ధైర్యం ఉంది. పన్నులు ఓట్ల కోసం భయపడం. ఉన్నది ఉన్నట్లు చెబుతాం. ఎన్నికల్లో ఏది పడితే అది చెబితే ఓట్లు రావు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని ఏక కాలంలో చేస్తానని హామీ ఇచ్చింది. మేం రూ. లక్షలోపు రుణాలను విడతలవారీగా చేస్తామని చెప్పాం. ఓటర్లు మావైపు మొగ్గు చూపారు. ప్రజల్లో విశ్వసనీయత ఉండాలి. అంతేతప్ప ఓట్ల కోసం ఎంతకైనా దిగజారుతాం అనుకోవడం తప్పు. వితండ వాదాలు వద్దు. పంచ రంగులు చూపొద్దు.

మొక్కలు ఎండితే బాధ్యత కౌన్సిలర్లదే..

ప్రేమ, భయం లేకపోతే అభివృద్ధి జరగదు. లంచాలకు మరిగిన కొందరు సిబ్బందితో మన మెందుకు బాధలు, నిందలు పడాలి? గత ప్రభుత్వాల దుర్మార్గాలు అంతాఇంత కాదు. హెచ్‌టీ లైన్ల కింద ఇళ్లకు ఎలా అనుమతులిస్తారు? అందుకే లేఅవుట్ల అనుమతుల అధికారాలను కలెక్టర్లకు కట్టబెట్టాం. దీనిపై కాంగ్రెస్ సభ్యుడు భట్టి విక్రమార్క స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హక్కులు కాలరాసినట్లు గగ్గోలు పెట్టారు. గిలిగింతలు, చక్కిలిగింతలు పెడితే ఫలితాలు రావు. 24 గంటలు విద్యుత్ ఇస్తున్న రాష్ట్రం మనది. ఎవరి పరిధిలో వారు సక్రమంగా పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. హరితహారం కింద నాటిన మొక్కల్లో 86 శాతం మొక్కలు బతికాయి. వార్డుల్లో మొక్కల సంరక్షణ బాధ్యత కౌన్సిలర్లది. వార్డుల బాధ్యత వారు చూసుకోకపోతే వేరే వారు ఎందుకు చూసుకుంటారు?

కుల, మతరహిత శ్మశానవాటికలు నిర్మిస్తున్నాం...

చనిపోయిన వాళ్లను సంస్కారహితంగా పంపడం మన సమాజం సంస్కారం. ఒడిశాలో ఒకాయన 20 కిలోమీటర్లు సైకిల్‌పై భార్య శవాన్ని మోసుకెళ్లిండు. భూమి లేని వాళ్లు ఎక్కడ అంత్యక్రియలు చేసుకోవాలి? ఆ బాధ మనకే ఎదురైతే ఎంత కుమిలిపోతం? అందుకే అన్ని గ్రామాల్లో దహనవాటికలు, వైకుంఠధామాలు తయారవుతున్నాయి. కుల, మతరహిత సామూహిక శ్మశానవాటికలను చూడబోతున్నాం. ఇందుకోసం రూ. 10 కోట్లు కానీ రూ. 20 కోట్లు కానీ ఎంత అవసరమైతే అంత ఇస్తాం.

షెడ్యూల్ ఏరియాలు కావడంతో...

మణుగూరు, పాల్వంచ, ఆసిఫాబాద్, భద్రాచలం వంటి ఏజెన్సీ ప్రాంత మున్సిపాలిటీలు షెడ్యూల్డ్ ఏరియాలుగా ఉండటంతో అక్కడ ఎన్నికల నిర్వహణ సాధ్యంకావట్లేదు. ఈ అంశం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. కేంద్రం నుంచి ఆమోదముద్ర లభించిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తాం.

ఎర్రబెల్లి టాప్ పెర్ఫార్మర్..

టాప్ పెర్ఫార్మింగ్ మినిస్టర్‌గా మా అంతర్గత సర్వేలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు అవార్డు వచ్చింది. ఆయన పల్లె ప్రగతి కోసం తీవ్రంగా శ్రమించారు.

నిధుల విషయంలో వెనక్కు తగ్గం..

15వ ఆర్థిక సంఘం నిధుల ఖరారులో కేంద్రం వైఖరి విచిత్రంగా ఉంది. ఐదేళ్లకు తగ్గట్లు ప్రణాళిక చేయకుండా ఈ ఏడాది అది కూడా మధ్యంతర నివేదిక ఆధారంగా రాష్ట్రానికి రూ. 1,847 కోట్లు కేటాయించింది. అందులోనూ 5-10 శాతం నిధులను మండల, జెడ్పీలకు ఇవ్వాలి. కేంద్ర నిధులకు సమానంగా రూ. 1,847 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. దీన్ని బడ్జెట్‌లో కూడా పెట్టాం. అవసరమైతే ఎమ్మెల్యేల జీతాలు ఆపైనా.. మేం పస్తులుండైనా పంచాయతీలకు నిధులిస్తాం తప్ప వెనక్కిపోం. కొత్త పంచాయతీల్లో త్వరలోనే రేషన్ షాపులను కూడా ప్రారంభించబోతున్నాం. జనాభా ప్రాతిపదికన అన్ని పంచాయతీలకు సమృద్ధిగా నిధులిస్తున్నాం. ట్రాక్టర్లు, ట్రాలీ, ట్యాంకర్ ఒకసారి వ్యయమే. దానిపై కాంగ్రెస్ సభ్యుల రాద్ధాంతం బాగోలేదు. ట్రాక్టర్లు కొనాలని నేనే చెప్పా. 106 జనాభా ఉన్న గ్రామానికి కూడా ట్రాక్టర్ కొనాలని నిర్ణయించాం. మంచైనా.. చెడైనా నేనే బాధ్యత తీసుకుంటా. ఎన్ని అదనపు నిధులైనా ఇస్తాం. సత్తుపల్లి నియోజకవర్గ సర్పంచ్‌లకు అభినందనలు. వర్ధన్నపేట నియోజకవర్గం దేవరన్నపేట పంచాయతీలో కామిడి నర్సింహరెడ్డి రూ. 25 కోట్లను విరాళంగా ఇచ్చారు. హుస్నాబాద్ సెగ్మెంట్ గట్ల నర్సింగాపూర్ గ్రామంలో గుండవరపు భాస్కర్‌రావు రూ. 3 కోట్లను, నల్లగొండలో కంచర్ల కృష్ణారెడ్డి కోటి రూపాయలను గ్రామాల అభివృద్ధికి విరాళంగా అందజేశారు. వారందరికీ చేతులెత్తి దండాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. డబ్బుకంటే వారి స్ఫూర్తి గొప్పది.

7దేశాలతో హైరిస్క్

▶ మొదటి పేజీ తరువాయి

వారు 14 రోజులపాటు ఇళ్లకే పరిమితమయ్యేలా చర్యలు చేపట్టిన ప్రభుత్వం... ఈ ఏడు దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను మాత్రం నేరుగా తమ పర్యవేక్షణలోనే ఉండేలా ఏర్పాట్లుచేసింది. ఇప్పటికే హరిత రిసార్టును శుభ్రం చేయించి వైద్య పరికరాలను సిద్ధం చేసింది. ఒకవేళ ఈ దేశాల నుంచి వచ్చే వారి సంఖ్య పెరిగినా, ఇతర దేశాల నుంచి వచ్చే వారిలో ఎవరికైనా అనుమానిత లక్షణాలున్నా వారిని ఐసోలేషన్‌లో ఉంచే విషయంలో సర్కారు అనేక ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తోంది. దూల పల్లిలోని ఫారెస్ట్ అకాడమీ వంటి ప్రభుత్వ శిక్షణ సంస్థలనూ ఐసోలేషన్ కేంద్రాలుగా ఎంపిక చేయాలని భావిస్తోంది. మరీ అవసరమైతే ఇప్పటికే పూర్తయిన దాదాపు 40 వేల డబుల్ బెడ్రూం ఇళ్లను కూడా వాడుకొనేలా ఏర్పాట్లు చేయాలనుకుంటోంది. కాగా, శుక్రవారమే 17 మంది విమాన ప్రయాణికులను ప్రత్యేక వాహనంలో హరిత రిసార్ట్‌కు తరలించినట్లు తెలుస్తోంది. మరోవైపు అనంతగిరి ప్రాంతంలో ఐసోలేషన్ ఏర్పాటుపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పర్యాటక కేంద్రమైన అనంతగిరిలో ఐసోలేషన్ కేంద్రంతో స్థానికంగా వైరస్ వ్యాపించే ప్రమాదం ఉందంటూ హరిత రిసార్ట్ వద్ద నిరసన చేపట్టారు.

ఇతర రాష్ట్రాలకు బస్సుల నిలిపివేత!

హైదరాబాద్ నుంచి ఇతర రాష్ట్రాలకు బస్సు సర్వీసులను నిలిపివేయాలని ఆర్టీసీకి వైద్య ఆరోగ్యశాఖ సూచించినట్లు తెలిసింది. ఇప్పటికే బెంగళూరు, చెన్నైలకు వెళ్లే బస్సులను సాధ్యమైనంత మేరకు తగ్గించాలని కోరినట్లు తెలియవచ్చింది. మరోవైపు రైలు ప్రయాణాలు కూడా సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రజలకు సూచించింది. కర్ణాటక, బిహార్ తదితర రాష్ట్రాల్లో తీసుకుంటున్న చర్యల మాదిరిగా తెలంగాణలోనూ తీసుకునే అవకాశాలపై వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు నిపుణులతో చర్చిస్తున్నాయి.

ఒక ప్రజాప్రతినిధి కుటుంబంలో ఇద్దరి శాంపిళ్ల సేకరణ...

ఇటీవల విదేశాల్లో పెళ్లికి వెళ్లొచ్చిన ఒక కీలక ప్రజాప్రతినిధి కుటుంబంలో ఇద్దరు సభ్యులకు విపరీతమైన జలుబు, ముక్కు కారడం వంటి లక్షణాలు కనిపించాయి. దీంతో ఆయన వైద్యాధికారులను సంప్రదించారు. ముందు జాగ్రత్తగా ఆ ఇద్దరి శాంపిళ్లను సేకరించి పరీక్షించినట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. సుదూర ప్రయాణం, అక్కడి వాతావరణం కారణంగా సాధారణ జలుబుగానే వైద్యులు నిర్ధారించినట్లు తెలిసింది.

కర్ణాటకవాసితో 34 మంది కాంటాక్ట్...

దేశంలో తొలి కోవిడ్ వైరస్ మృతుడు అయిన కర్ణాటకవాసితో 34 మంది అంతకుముందు సన్నిహితంగా మెలిగినట్లు వైద్య, ఆరోగ్య శాఖ నిర్ధారించింది. ఆ వ్యక్తితో కుటుంబ సభ్యులు, హైదరాబాద్‌లోని ఆయా ఆసుపత్రులకు చెందిన డాక్టర్లు, నర్సులు, అంబులెన్స్ డ్రైవర్లు సహా 34 మంది కాంటాక్ట్ అయినట్లు తేల్చింది. ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో కర్ణాటక వాసికి కాసేపు ఐసీయూలోనూ చికిత్స అందింది. కోవిడ్ లక్షణాలున్నాయని గుర్తించినా చివరి వరకు వైద్య ఆరోగ్యశాఖకు సమాచారం ఇవ్వకపోవడంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ 34 మందిలో 29 మందిని హోం ఐసోలేషన్‌లో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. వీరిలో ఇద్దరికి కోవిడ్ అనుమానిత లక్షణాలున్నాయన్న భావనతో శాంపిళ్లను సేకరించి నిర్ధారణ పరీక్షలకు పంపినట్లు సమాచారం. దీనిపై వైద్య ఆరోగ్య వర్గాలు స్పష్టతనివ్వడంలేదు. ఇంకా ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే తక్షణమే గాంధీ లేదా ఇతర కోవిడ్ ఐసోలేషన్ చికిత్స అందించే ఆసుపత్రులకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కోవిడ్ విస్తృతిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పరిస్థితిని తీవ్రంగా పరిగణించాలని కొందరు వైద్యాధికారులు సూచించినట్లు తెలిసింది. కాగా, శుక్రవారం నాటికి శంషాబాద్ విమానాశ్రయంలో 57,214 మందికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.

మరుంచకత్

శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన వింగ్స్ ఇండియా ప్రదర్శనలో డ్రైవర్ లేకుండా నడిచే అటానమస్ బగ్గీలో ప్రయాణిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఫిక్కీ ప్రెసిడెంట్ సంగీతారెడ్డి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చెర్మన్ అరవింద్ సింగ్

త్వరలో వరంగల్ ఎయిర్‌పోర్ట్

- 6 విమానాశ్రయాల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాష్ట్రంలో ఆరు విమానాశ్రయాల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు శుక్రవారం వెల్లడించారు. అందరికీ విమాన యోగం కల్పించాలన్న సంకల్పంతో పాత విమానాశ్రయాల పునరుద్ధరణతోపాటు కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మారుమూల ప్రాంతాలను అనుసంధానించేందుకు హెలిపోర్ట్స్ అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్‌లోని జక్రాన్‌పల్లి, మహబూబ్‌నగర్ జిల్లా అడక్కల్ మండలం గుదిబండ వద్ద కొత్త విమానాశ్రయాల ఏర్పాటుతో పాటు వరంగల్ సమీపంలోని మామునూరు, పెద్దపల్లి జిల్లాలోని బసంతనగర్, ఆదిలాబాద్ వద్ద ఉన్న విమానాశ్రయాల పునరుద్ధరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వింగ్స్ ఇండియా ప్రదర్శన, సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 'రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను కన్సల్టెంట్‌గా నియమించాం. వరంగల్ విమానాశ్రయం త్వరితగతిన కార్యరూపంలోకి వచ్చేందుకు అన్ని శాఖలతో కలిసి పని చేస్తున్నాం. ఇది అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ప్రాంతీయ విమానయాన రంగానికి ఊతమిస్తుంది. అలాగే మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ హబ్‌కు తోడ్పాటు లభిస్తుంది. ఉడాన్ పథకంలో భాగంగా వరంగల్ విమానాశ్రయాన్ని జత చేయాలని కేంద్రాన్ని కోరాం'అని వివరించారు. కాగా, భారత్‌లో తొలి అటానమస్ బగ్గీని ఆవిష్కరించిన అనంతరం అందులో కేటీఆర్ ప్రయాణించారు. డ్రైవర్ లేకుండానే ఈ వాహనం నడుస్తుంది.

కందుల కొనుగోలుకు నోడల్ ఎజెన్సీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రైతులు పండించిన కందులను మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి టీఎస్ మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించిందని వ్యవసాయ శాఖ కమిషనర్ జనార్దన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ రాష్ట్ర వ్యాప్తంగా 104 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. మార్కెట్ ధర మద్దతు ధర కన్నా తక్కువ ఉన్నందున మధ్య దళారులు మార్కెట్‌లో కందులు అమ్మే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నల్లగొండ, సూర్యాపేట కందుల కొనుగోలు కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు జరిపినట్లు తెలిపారు. పరిశీలన జరపకుండా పంట ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తేలితే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించిన సూర్యాపేట జిల్లా, చివ్వెంల ఏఈఓ ఎల్.సాయిప్రసాద్, నల్లగొండ జిల్లా జి.కె. అన్నారం ఏఈఓ కె.మానికలను సస్పెండ్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

గేట్ ఫలితాలు విడుదల

- టాప్ మార్కులు సాధించిన రాష్ట్ర విద్యార్థులు
- ఎన్ఐటీ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ఐఐటీలు, ఇతర జాతీయ స్థాయి ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో ఎంటెక్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయి. విద్యార్థులు వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఫలితాలను పొందవచ్చని గేట్ నిర్వహణ సంస్థ అయిన ఐఐటీ ఢిల్లీ తెలిపింది. గత నెల 1, 2, 8, 9 తేదీల్లో నిర్వహించిన ఈ పరీక్షలను రాసేందుకు దేశ వ్యాప్తంగా 8,58,890 మంది రిజిస్టర్ చేసుకోగా అందులో 6,85,088 (79.76 శాతం) మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 18.8 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు వెల్లడించింది. 100 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షలో అత్యధిక మార్కులను సాధించిన తెలుగు విద్యార్థులు టాప్ 30లో ఉన్నారు. జియో ఫిజిక్స్‌లో ఉపేంద్ర కుమార్ గుప్తా (83 మార్కులు), ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో నరహరిశెట్టి సాయి సందీప్ (82.33 మార్కులు), మెకానికల్ ఇంజనీరింగ్‌లో వికాస్ కుమార్ (86.88 మార్కులు), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో (ఈసీఈ) ఎ.పవన్‌కుమార్‌రెడ్డి (82 మార్కులు), ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో కె.భరత్ కుమార్ (81 మార్కులు), మైనింగ్ ఇంజనీరింగ్‌లో ప్రియాంశు మహేశ్వరి (73.33 మార్కులు) అత్యధిక మార్కులు సాధించారు. 25 సబ్జెక్టుల్లో నిర్వహించిన గేట్ స్కోర్‌కు మూడేళ్ల వ్యాలిడిటీ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో గేట్ స్కోర్ ఆధారంగా నియామకాల్లో ప్రాధాన్యం ఇస్తున్నారు. మరోవైపు గేట్ ఫలితాల్లో రాష్ట్ర విద్యార్థులతోపాటు వరంగల్ ఎన్ఐటీకి చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సాధించారు. సీఎస్ఈలో ఎన్ఐటీకి చెందిన అబ్బాస్ దాస్ గుప్తా జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు సాధించినట్లు వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ఎన్‌వీ రమణరావు తెలిపారు. ఎంఎంఈలో శశిధర్ గంగవరపు 30వ ర్యాంకు, దీప్ కార్తికేయ 181వ ర్యాంకు, ఈఈఈలో దినేశ్‌రెడ్డి 66వ ర్యాంకు, విష్ణుతేజ 179వ ర్యాంకు, సివిల్‌లో వివేక్ శ్రీవాత్సవ 110 ర్యాంకు, బయోటెక్‌లో దక్షిణ్ పమర్ 12వ ర్యాంకు సాధించినట్లు వివరించారు.

కానిస్టేబుల్ కిడ్నాప్, హత్య

సాక్షి, కొత్తగూడెం: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టులు తాజాగా విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్‌ని అపహరించి హత్య చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా అరగట్ట సమీపంలోని అడవుల్లో ఈ కానిస్టేబుల్‌ను మావోయిస్టులు హతమార్చారు. సుకుమా జిల్లా ఎస్పీ శలాబ్ సిన్హా మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ధ్రువీకరించారు. జిల్లా రిజర్వ్ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ను అరగట్ట వద్ద సొంత గ్రామంలోనే కిడ్నాప్ చేసి తీసుకెళ్లి మావోలు చంపారని తెలిపారు.

భద్రాద్రి జిల్లాలో ఐజీ పర్యటన..

ఇటు పోలీసులు మావోయిస్టుల వేట సాగిస్తూనే గ్రామాల్లో తనిఖీలు పెంచారు. ఇప్పటికే ఇద్దరు ఐపీఎస్ అధికారులు భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో ప్రత్యేక ఆపరేషన్లలో పాల్గొంటున్నారు. ఇల్లందు మండలం పరిధిలోని బాలాజీ నగర్, బోజ్జుయిగూడెం గ్రామ పంచాయతీలను శుక్రవారం ఐజీ స్టీఫెన్ రవీంద్ర సందర్శించారు. స్థానిక పోలీసులతో కలసి వచ్చిన ఆయన పల్లె ప్రగతి కార్యక్రమాలు, నర్సరీలు, డంపింగ్ యార్డ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓ వైపు మావోల కోసం కూంబింగ్ జరుగుతుండగానే.. పోలీసు ఉన్నతాధికారి గ్రామాల పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

అసెంబ్లీ ముట్టడిలో పాల్గొన్న ఉద్యోగులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ముట్టడి.. కట్టడి!

- ఎక్కడికక్కడే ఉద్యోగుల అరెస్టులు..
- వ్యూహాత్మకంగా ధర్నా చౌక్‌కు చేరుకున్న కొందరు
- సుమారు రెండు వేల మంది ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల అరెస్టు
- సాయంత్రం విడుదల

హైదరాబాద్: పీఆర్‌సీ హామీని అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమాన పనికి.. సమాన వేతనం వర్తింప చేయాలని, వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, పబ్లిక్ సెక్టార్, కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తంగా మారింది. తెలంగాణ వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. ఆందోళనకారులు అసెంబ్లీ వద్దకు చేరుకోకుండా ఎక్కడికక్కడే అరెస్ట్ చేసి ఆయా పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఇదే సమయంలో కొందరు ఉపాధ్యాయులు పోలీసుల కళ్లుగప్పి ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్దకు చేరుకున్నారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించారు. సుమారు రెండు వేల మంది ధర్నా చౌక్‌కు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పలువురు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరించారు. గోషామహల్, రాంగోపాల్‌పేట, నారాయణగూడ, ముషీరాబాద్, బోయిన్‌పల్లి, కార్ఖాన, గోపాలపురం, గాంధీనగర్, జూబ్లీహిల్స్ వంటి దాదాపు 14 పోలీస్ స్టేషన్లలో 2 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులను తరలించి, సాయంత్రం 6 గంటలకు విడిచిపెట్టారు. అరెస్టు చేసే సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుని.. కొందరు ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు సుమారు 1,500 మందిని తరలించారు. అరెస్టయిన వారిలో టీపీటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, జంగయ్య, ఎస్‌టీఎఫ్ సదానందగౌడ్, పర్వతరెడ్డి, వివిధ సంఘాల నాయకులున్నారు. అరెస్టు అయిన వారిని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్ పరామర్శించారు. ఉపాధ్యాయులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు సుధాకర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. కాగా, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యపై ప్రభుత్వ దమనకాండ పరిష్కారమార్గం కాదని, నిర్బంధాన్ని ప్రయోగించడం అప్రజాస్వమికమని ఉద్యోగ, ఉపాధ్యాయ, పబ్లిక్‌సెక్టార్, పెన్షనర్ల, కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది.

రాష్ట్రంలో నిరంకుశ పాలన..

2018లో పీఆర్‌సీ హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్.. అమలులో విఫలమయ్యారు. మా డిమాండ్ల సాధన కోసం చలో అసెంబ్లీకి పిలుపునిస్తే ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది.

– టీపీటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

చిన్న పంచాయతీలకు రూ.5 లక్షల నిధులు

పీఆర్ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: చిన్న గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. వార్షిక గ్రాంట్ రూ.5 లక్షల్లోపు ఉన్న పంచాయతీలకు అదనంగా రూ.5 లక్షల నిధులు కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామాల పరిశుభ్రత, పచ్చదనం ద్వారా పర్యావరణ సమతుల్యతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతిని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టడానికి ప్రతి నెలా రూ.339 కోట్లను విడుదల చేస్తోంది. జనాభా తలసరి ప్రాతిపదికన ఈ నిధులను కేటాయిస్తోంది. రెండేళ్ల క్రితం గ్రామ పంచాయతీల సంఖ్యను 8,692 నుంచి 12,751 పెంచిన ప్రభుత్వం.. తండాలు/గూడెంలను కొత్త జీపీలుగా మార్చింది. దీంతో కొన్ని పంచాయతీలకు వార్షిక గ్రాంట్ రూ.5 లక్షల్లోపే వస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా పంచాయతీల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని అదనంగా రూ.5 లక్షలను వార్షిక గ్రాంట్ రూపంలో అందించనుంది.

వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవం వాయిదా

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ ఈ నెల 18వ తేదీన నిర్వహించతలపెట్టిన నాలుగో స్నాతకోత్సవం వాయిదా పడింది. తదుపరి తేదీ త్వరలో ప్రకటిస్తామని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎస్. సుధీర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తదుపరి సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

శుక్రవారం అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుకు టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి కేకేతో పాటు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న దానం, పాషా ఖాద్రీ, తలసాని, కేటీఆర్

అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుకు టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి సురేశ్‌రెడ్డితో పాటు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న హరీశ్‌రావు తదితరులు

రాజ్యసభకు కేకే, సురేశ్‌రెడ్డి నామినేషన్లు

- టీఆర్ఎస్ అభ్యర్థుల పక్షాన నాలుగు సెట్లు దాఖలు
- నామినేషన్ పత్రాలపై టీఆర్ఎస్, ఎంఐఎం ఎమ్మెల్యేల సంతకాలు
- నామినేషన్‌కు ముందు గన్‌పార్క్ అమరుల స్థూపం వద్ద నివాళి
- అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో కేసీఆర్‌తో రాజ్యసభ సభ్యుల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కోటాలో ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాలకు శుక్రవారం నామినేషన్ల దాఖలు గడువు ముగిసింది.టీఆర్ఎస్ పక్షాన రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపికైన కె.కేశవరావు, కే.ఆర్.సురేశ్ రెడ్డి శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు వెంటరాగా అసెంబ్లీ ఆవరణలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుకు నామినేషన్ పత్రాలు అందజేశారు.టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల పక్షాన నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు కాగా, కేకే, సురేశ్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ పలువురు మంత్రులతో పాటు, టీఆర్ఎస్, ఏఐఎంఐఎం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. ఒక్కో సెట్‌పై పది మంది సభ్యుల వంతున సంతకాలు చేయాల్సి ఉండగా, ఒక్కో సెట్‌పై నలుగురు మంత్రులు, ఆరుగురు వంతున ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కవితతో పాటు పలువురు పార్టీ నేతలు, రాజ్యసభ అభ్యర్థుల కుటుంబీకులు, అసెంబ్లీకి తరలివచ్చారు. కేశవరావు కుమార్తె గద్వాల విజయలక్ష్మి, కుమారులు వెంకట్, విప్లవ్, సురేశ్ రెడ్డి సతీమణి పద్మజారెడ్డి అసెంబ్లీకి వచ్చిన వారిలో ఉన్నారు.

కేసీఆర్‌తో రాజ్యసభ సభ్యుల భేటీ..

నామినేషన్ల కార్యక్రమం పూర్తయిన తర్వాత పార్టీ రాజ్యసభ సభ్యులతో కలిసి పార్టీ అభ్యర్థులు కేకే, సురేశ్ రెడ్డి అసెంబ్లీ అవరణలోని సీఎం చాంబర్‌లో పార్టీ అధినేత కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్ ఉన్నారు. నామినేషన్ల కార్యక్రమం పూర్తయిన తర్వాత అసెంబ్లీ లాబీల్లో ఎంపీలు సంతోష్, బండా ప్రకాశ్, లింగయ్య యాదవ్ ఇప్పుడు మనం సీనియర్లం అయ్యాం అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

గన్ పార్కువద్ద నివాళి..

నామినేషన్ దాఖలుకు ముందు మంత్రులు, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి రాజ్యసభ అభ్యర్థులు కేశవరావు, సురేశ్ రెడ్డి అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్ పార్క్ లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. గన్ పార్కుకు చేరుకున్న నేతలకు పార్టీ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, విప్ బాల్క సుమన్, గువ్వల బాలరాజు తదితరులతో రాజ్యసభ అభ్యర్థులు అసెంబ్లీకి చేరుకుని నామినేషన్లు దాఖలు చేశారు.

ఎన్నిక కావడం లాంఛనమే..

కాగా అధికార టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఇరువురితో పాటు , శ్రమజీవి పార్టీ తరపున జాజుల భాస్కర్, భోజరాజ్ కోయల్కర్ ఒక్కో సెట్టు దాఖలు చేశారు. ఇలా మొత్తంగా నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లయింది. 16న నామినేషన్ల పరిశీలన, 18న ఉపసంహరణ అనంతరం బరిలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. అసెంబ్లీలో సంఖ్యాబలం పరంగా టీఆర్ఎస్‌కు 104, ఎంఐఎంకు ఏడుగురు సభ్యుల బలం ఉండటంతో టీఆర్ఎస్ అభ్యర్థులు ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం లాంఛనమే కానున్నది.

కాంగ్రెస్ నేతలు మీడియాతో మాట్లాడొద్దు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులు మీడియా లేదా సోషల్ మీడియాలో ఎలాంటి ప్రకటనలు ఇవ్వకూడదని రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా ఆంక్షలు విధించారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియాలో, సోషల్ మీడియాలో కాంగ్రెస్ నేతల విమర్శలు, ప్రతి విమర్శలు తాను చేశానని, ఇది పార్టీలో గందరగోళాన్ని సృష్టించి బలహీనపరిచేలా ఉందని అన్నారు. అయితే ఏ నాయకుడికైనా ఏదైనా అభిప్రాయం ఉంటే టీపీసీసీ లేదా ఏఐసీసీకి లేఖ రాసి తమ అభిప్రాయం తెలియజేయాలే తప్ప మీడియాలో, సోషల్ మీడియాలో ఎలాంటి ప్రకటనలు చేయరాదని ఆ ప్రకటనలో కుంతియా స్పష్టంచేశారు.

ఐక్యంగా పోరాడుదాం..: చెరుకు సుధాకర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జన సమితి, తెలంగాణ ఇంటి పార్టీ కలసి పని చేయాలని నిర్ణయించాయి. శుక్రవారం టీజేఎస్ కార్యాలయానికి ఇంటి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ వెళ్లారు. ఈ సందర్భంగా టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగ సమస్యలపై చర్చించి రెండు పార్టీలు కలసి ఐక్య పోరాటాలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 19న అసెంబ్లీ ముట్టడి చేపట్టనున్నామని.. చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కోదండరాం, చెరుకు సుధాకర్ శుక్రవారం చలో అసెంబ్లీ సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలను గోషామహల్ స్టేడియానికి వెళ్లి కలిశారు.

విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తున్నాం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆస్తి పన్ను, విద్యుత్ చార్జీల పెంపును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాల కారణంగానే బడ్జెట్ అంచనాలకు, రెవెన్యూ రాబడులకు పొంతన లేకుండా పోయిందని, ఈ ఏడాది కూడా అంచనాలకు అందకుండా రూ.1.82 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి పన్ను పెంచితే ఇంటి యజమానులపై భారం పడుతుందని, ఆ భారాన్ని కిరాయిదారులపై వేస్తారని చెప్పారు. విద్యుత్ చార్జీల పెంపు కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

3 వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా మూడు వృద్ధాశ్రమాల (ఓల్డేజ్ హోమ్) ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటిని సిరిసిల్ల, ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో వయోవృద్ధుల సంక్షేమ శాఖ వీటిని నిర్వహిస్తుంది. ఒక్కో వృద్ధాశ్రమం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డి.విద్య శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని, నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు.

పిగ్ బ్రీడింగ్ పాలసీని రూపొందించండి

రాష్ట్ర ప్రణాళికాసంఘాన్ని కోరిన కెనడా ప్రతినిధి బృందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పిగ్ బ్రీడింగ్ పాలసీని రూపొందించాలని కెనడాకు చెందిన పోలార్ జెనిటిక్స్ అధ్యక్షుడు ఆల్ఫ్రెడ్ వాల్ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆల్ఫ్రెడ్ వాల్, తెలంగాణ రాష్ట్ర సౌజన్య ఫార్మ్స్ అధినేత సాగర్ ఇద్దరు వినోద్‌కుమార్‌తో సమావేశమయ్యారు. పిగ్ బ్రీడింగ్ పాలసీ రూపొందిస్తే లైవ్ పిగ్స్, వాటి వీర్యాన్ని కెనడా నుంచి దిగుమతి చేసుకునేందుకు, పోర్క్‌ను విదేశాలకు ఎగుమతి చేసేందుకు వాణిజ్య పరమైన లైసెన్స్ కేంద్రం జారీ చేస్తుందని ఆల్ఫ్రెడ్ తెలిపారు. దీంతో పిగ్ బ్రీడింగ్ పాలసీ రూపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శికి వినోద్ లేఖ రాశారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.1606/NLG/DCE (R)/EE-R/DEE-7/AEE-2/2019-20 తేది. 12.03.2020
యాదాద్రి భువనగిరి జిల్లాలో YTDA డిపాజిట్ నిధులతో YTDAలో ఒక పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను 18.03.2020 సా.4.00 గం. నుండి ఇ-హార్కెట్సైన్ అంటే tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది 26.03.2020 సా.4.00 గం.వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ హార్కెట్సైన్ అంటే tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN
DIPR Ro.No.2649-DP/CL/Advt/1/2019-20, Dt:13-03-2020

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No.30/TS/EE/R&B/KGM/2019-2020 తేది. 07.03.2020
పనుల సంఖ్య (02). పనుల పేరు: తల్లాడ-భద్రాచలం SH-12 పై ROB నం.07 కోసం భద్రాచలం రోడ్ మరియు సత్తుపల్లి స్టేషన్ మధ్య కొత్త BG లైన్ నిర్మాణం, విజయవాడ-జగదల్‌పూర్ NH-30 రోడ్ పై ROB నం.50 కోసం భద్రాచలం రోడ్ మరియు సత్తుపల్లి స్టేషన్ మధ్య కొత్త BG లైన్ నిర్మాణం. మొత్తం ECV: రూ.18.30 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ల జారీ: 12-03-2020న ఉ.11:00 గం. నుండి 20-03-2020న మ.2:00 గం. వరకు. బిడ్ దాఖలుకు ఆఖరు తేది మరియు సమయం: 20-03-2020న మ.2:30 గం. తెరుచు తేది:20-03-2020న సా.4:00 గం. ఫోన్ నం.08744-242779. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ హార్కెట్సైన్ www.eprocurement.gov.in లో చూడవచ్చును.
సం/- డిస్ట్రిక్ట్ (R&B) ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(R&B), స్పెషల్ డివిజన్: కొత్తగూడెం
DIPR Ro.No.2651-DP/CL/Advt/1/2019-20, Dt:13-03-2020

తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
5వ అంతస్తు, పరిశ్రమ భవనం, H.No. 5-9-58/B, ఫతే మైదాన్‌రోడ్, హైదరాబాద్-04. ఫోన్: 23238290-250
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
దిగువ తెలిపిన పనికోసం చీఫ్ ఇంజినీర్, TSIIC లిమిటెడ్, హైదరాబాద్ వారు బిడ్లు కోరుతున్నారు. TN.No.43: IP నాచారం, మేడ్చల్ జిల్లా వద్ద డ్రెయిన్స్‌తో పాటు రోడ్ నం.1 వెడల్పు చేయుట & పటిష్ట పరచుట మరియు ట్రాఫిక్ ఐల్యాండ్స్ సుందరీకరణ (IALA నిధుల క్రింద) ECV రూ 3,94,87,518.00, TN.No. 44, టక్స్‌టైల్ పార్క్, కళ్ళం (గ్రా), లింగాల ఘన్‌పూర్ (M), జనగాం జిల్లా వద్ద CD వర్క్స్‌తో నహా WMM, BM & BC తో ఇంటర్నల్ బ్యాలెన్స్ రోడ్లు నిర్మాణం, వేయుట ECV: రూ. 10,14,26,437.00, TN.No. 45: IP నాచారం, మేడ్చల్ జిల్లా వద్ద రోడ్ నం. 9లో DBM, BC తో పటిష్ట పరచుట మరియు రెన్యూవల్ లేయర్ మరియు డ్రెయిన్లు ఎత్తు పెంచుట. (IALA నిధుల క్రింద) ECV రూ.1,08,62,789.00, బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 11.03.2020 సా॥ 5.30 గం॥ల నుండి, బిడ్ల దాఖలుకు ఆఖరు తేది 26.03.2020న మ॥ 3.00 గం॥ వరకు. టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను వెబ్‌సైట్ www.tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజినీర్
DIPR Ro.No.897-PP/CL/ADVT/1/2019-20, Dt:13/03/2020

తెలంగాణ ప్రభుత్వం
డైరెక్టర్ కార్యాలయం
రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (RIMS) ఆదిలాబాద్
(సెమి-అటానామస్ ఇన్‌స్టిట్యూషన్)
No.61/RIMS-ADB/EST/2020 వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేది: 12.03.2020
రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (RIMS) ఆదిలాబాద్, తెలంగాణ రాష్ట్రం వారు పూర్తిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికపై ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, టూటర్స్ మరియు సీనియర్ రెసిడెంట్స్ ఉద్యోగాల కోసం నిర్ణీత దరఖాస్తు ఫారంలో దరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్స్ మరియు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో వాక్-ఇన్-ఇంటర్వ్యూకి హాజరు కావలెను. వర్తించుచోట మెరిట్ మరియు ROR అనుసరించబడును. మరిన్ని వివరాలకు దర్శించండి www.dme.telangana.gov.in (లేదా) www.rimsadilabad.com
కేడర్ & కాంట్రాక్ట్ జీతం: ప్రొఫెసర్ నెలకు రూ.1,90,000/-, అసోసియేట్ ప్రొఫెసర్ నెలకు రూ.1,50,000/-, అసిస్టెంట్ ప్రొఫెసర్ నెలకు రూ.1,25,000/-, ట్యూటర్ నెలకు రూ.55,000/-, సీనియర్ రెసిడెంట్ నెలకు రూ.70,000/- వాక్-ఇన్-ఇంటర్వ్యూ డైరెక్టర్ కార్యాలయం, RIMS, ఆదిలాబాద్‌లో 27.03.2020 ఉ.10.30 గం. నుండి సా.4.00 గం.వరకు నిర్వహించబడును. మరిన్ని వివరాలకు మా RIMS, ఆదిలాబాద్ వారిని సంప్రదించవలెను. ఇ-మెయిల్ ID: rimsadilabad@yahoo.com
సం/- డైరెక్టర్ RIMS, ఆదిలాబాద్ సం/- జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్
DIPR RO.No.2648-DP/CL/Advt/1/2019-20, Dt:13.03.2020

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-04
ఇ-ప్రొక్యూర్‌మెంట్ - టెండరు ప్రకటన

ఇ-టెండరు నం. & తేది	పనిపేరు	వ్రేజీ (సుమారు)	బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది
EP. No.166 & 167/ CGM(E)/ TC/T3/ 1400mm dia MS main/ O&M Div.No.XI/ 2019-20 Dated: 12.03.2020	O&M డివిజన్ నం.XI, సాహెబ్‌నగర్ పరిధిలోని ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ వద్ద PVNR ఎక్స్‌ప్రెస్ వే ప్రస్తుత పిల్లర్ నం.160 (RP-4) నుండి పిల్లర్ నం.169 వరకు KDWSP ఫేజ్ - II రింగ్ మెయిన్ - I మరియు ప్రస్తుత పిల్లర్ నం.159 (LP-4) నుండి పిల్లర్ నం.168 వరకు KDWSP ఫేజ్ - III రింగ్ మెయిన్ - I యొక్క 1400mm dia MS Gravity main తయారీ, సరఫరా, డెలివరీ, లోయరింగ్, వేయుట, జోడించుట, పరీక్షించుట మరియు పనిచేయించుట.	రూ. 166.94 లక్షలు రూ. 149.46 లక్షలు	13/03/2020 ఉ.10.30 గం.

సమాచారాన్ని ప్రధానంగా Zip ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా టెండరుదారులను కోరడమైనది. తదుపరి వివరాలను www.eprocurement.gov.inలో చూడవచ్చును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004

బెయిల్ ఇవ్వండి: రేవంత్

రేవంత్ కేసులో మూడు రిట్ పిటిషన్లపై హైకోర్టు విచారణ

సాక్షి, హైదరాబాద్: నెల రోజులు మాత్రమే జైలు శిక్ష పడే కేసులో మల్కాజిగిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డిని ఇప్పటికే తొమ్మిది రోజులుగా జైల్లో పెట్టారని, చాలా చిన్న కేసులో వెంటనే బెయిల్ మంజూరు చేయకుండా విచారణను వాయిదా వేయవద్దని ఆయన తరపు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ హైకోర్టుకు విన్నవించారు. తదుపరి విచారణ నాటికి సగం శిక్షాకాలం పూర్తవుతుందని, వెంటనే బెయిల్ ఇవ్వాలని ఆయన కోరారు. చట్ట వ్యతిరేకంగా డ్రోన్‌లను వినియోగించారన్న కేసులో బెయిల్ మంజూరు చేయాలంటూ రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. తనపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని, తనకు బెయిల్ మంజూరుకు తిరస్కరించిన మియాపూర్ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ వేర్వేరుగా దాఖలు చేసిన మూడు రిట్ పిటిషన్లను శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి విచారించారు. రేవంత్ చర్యలన్నీ రాజకీయ ప్రయోజనం కోసమేనని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌కు రేవంత్ వచ్చి లొంగిపోతే పోలీసులే అరెస్ట్ చేశారని ప్రభుత్వం చెప్పడంపై న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. చట్టప్రకారం రేవంత్‌కు సీఆర్‌పీసీలోని 41-ఏ కింద ఎందుకు నోటీసు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఐపీసీ 188 ప్రకారం సంబంధిత అధికారి ఫిర్యాదు చేయనప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి వీల్లేదన్నారు. వాదనల తర్వాత విచారణ వాయిదా పడింది.

లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీల నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి అరెస్టుపై లోక్‌సభ శూన్యగంట(జీరోఅవర్)లో కాంగ్రెస్ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ సభ్యుడు మాణికం ఠాగోర్ వాయిదా తీర్మానం ఇవ్వగా దానిని సభాపతి అనుమతించలేదు. కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తం చేయడంతో శూన్యగంటలో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో మాణికం ఠాగోర్ మాట్లాడుతూ..తెలంగాణలో కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డిని తప్పుడు కేసులో అరెస్టు చేశారని పేర్కొన్నారు. రాజకీయ కక్షతో టీఆర్ఎస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డిని అరెస్టు చేసిందన్నారు. పార్లమెంటు నడుస్తున్న నేపథ్యంలో ఇలా జరగరాదని, సభాపతిగా సదరు సభ్యుడికి రక్షణ కల్పించాలని కోరారు. కేంద్ర హోం మంత్రి ఈ అంశాన్ని పరిశీలించి తీసుకున్న చర్యలను సభకు వివరించాలని కోరారు. ఠాగోర్ మాట్లాడుతున్న సమయంలో టీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీపాటిల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సమయంలో కాంగ్రెస్ ఎంపీలకు, వీరికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా రేవంత్‌రెడ్డిని కక్షపూరితంగా అరెస్టు చేశారని, ఆయన త్వరితగతిన విడుదలై పార్లమెంటుకు హాజరయ్యేలా చర్య తీసుకోవాలని గురువారం కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి సభాపతికి లేఖ రాశారు.

సభను తప్పుదోవపట్టిస్తున్నారు: నామా నాగేశ్వరరావు

మాణికం ఠాగోర్ మాట్లాడిన అనంతరం సభాపతి టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావుకు అనుమతి ఇవ్వడంతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సభ్యుడు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, రేవంత్‌రెడ్డి డ్రోన్ కెమెరాతో చిత్రీకరణ జరిపి వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారన్న ఫిర్యాదు నమోదైందని, దానిపై విచారణ జరిపి అది వాస్తవమేనని పోలీసులు తేల్చారని వివరించారు. డ్రోన్ల నిర్వహణకు సంబంధించి ఈ సభ ఎయిర్‌క్రాఫ్ట్ చట్టాన్ని తెచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

మేమే రాస్తాం.. సాయం వద్దు!

- ఎస్ఎస్‌సీ బోర్డుకు స్పష్టం చేసిన వీణావాణిలు
- ఇద్దరికి వేర్వేరుగా హాల్‌టికెట్లు జారీ చేసిన బోర్డు
- 19 నుంచి మధురానగర్‌లోని ప్రతిభా హైస్కూల్లో పరీక్ష రాయనున్న అవిభక్త కవలలు

సాక్షి, హైదరాబాద్/వెంగళ్‌రావునగర్: అవిభక్త కవలలు వీణావాణిలు ఈ నెల 19 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యాశాఖ వేర్వేరుగా జారీ చేసిన హాల్ టికెట్లను పాఠశాల అధ్యాపకులు శుక్రవారం వారికి అందజేశారు. జబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ వీణావాణిలకు మినహాయింపు ఇచ్చారు. వారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అధికారులు వారిద్దరికీ వెంగళ్‌రావునగర్ స్టేట్‌హోంకు సమీపంలోని మధురానగర్‌కాలనీలో ప్రతిభా హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం కేటాయించారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో నేలపై కూర్చొని పరీక్ష రాయనున్నారు. స్టేట్‌హోం సిబ్బంది ప్రతి రోజూ వీరిని ప్రత్యేక వాహనంలో పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చి, పరీక్ష పూర్తైన తర్వాత మళ్లీ హోంకు తీసుకెళ్లనున్నారు.

వేర్వేరు అడ్మిషన్లు.. వేర్వేరు హాల్‌టికెట్లు..

ఇదిలా ఉంటే హైదరాబాద్‌లో సుమారు 75 వేల మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వీరిలో వీణావాణిలు కూడా ఉండటం విశేషం. పుట్టకతోనే రెండు తలలు అతుక్కుని జన్మించిన వీణావాణిలను 2017 జనవరిలో స్టేట్‌హోంకు తరలించారు. మహిళా శిశుసంక్షేమ అధికారులు 2018 విద్యా సంవత్సరంలో వీరికి వెంగళ్‌రావునగర్ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ కల్పించారు. వీరికి వేర్వేరు అడ్మిషన్ నంబర్లు ఇచ్చారు. ఇటీవల వారు ఎస్ఎస్‌సీ బోర్డుకు దరఖాస్తు చేసుకోగా, పరీక్ష రాసే అర్హత, శక్తిసామర్థ్యాలు వారికి ఉన్నట్లు నిర్ధారించుకున్న అధికారులు ఇద్దరికీ వేర్వేరు హాల్‌టికెట్లు జారీ చేశారు. వారు కోరితే స్క్రైబ్(సహాయకులు)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తమకు ఎవరి సహాయం అవసరం లేదని, తామే స్వయంగా పరీక్ష రాస్తామని వీణావాణిలు స్పష్టం చేసినట్లు తెలిసింది.

ప్రత్యేక గదిని సిద్ధం చేస్తాం

వీణావాణిలు మా పాఠశాలలో పరీక్షలు

భారత్‌లో రెండో మరణం

ఢిల్లీలో కోవిడ్-19తో మృతి చెందిన మహిళ • దేశవ్యాప్తంగా 82 కేసుల నిర్ధారణ
బెంగళూరు షట్‌డౌన్; మాల్స్,థియేటర్లను మూసేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

మాస్కులు ధరించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముంబైలోని సిద్ధి వినాయక ఆలయ పూజారులు

సాక్షి, బెంగళూరు/న్యూఢిల్లీ: కరోనా ప్రకంపనలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. కర్నాటకలో బుధవారం కోవిడ్ -19 కి సంబంధించి తొలి మరణం నమోదు కాగా, శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో మరో మరణం సంభవించింది. కరోనా నిర్ధారణ అయిన 68 ఏళ్ల మహిళ ఢిల్లీలో మరణించిందని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఆమె మధుమేహం(డయాబెటిస్), రక్తపోటు(బీపీ)తో బాధపడుతున్నారని, ఇటీవల ఆమెకు కరోనా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. ఆమె రామ్ మనోహర్ లోహియా(ఆర్ఎంఎల్) ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. ఫిబ్రవరిలో స్విట్జర్లాండ్, ఇటలీల్లో పర్యటించి వచ్చిన ఆమె కుమారుడికి కూడా కోవిడ్-19 నిర్ధారణ అయిందని వెల్లడించారు. అతడికి ఆర్ఎంఎల్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామన్నారు. వారి కుటుంబ సభ్యులను వేరుగా ఉంచి, పరీక్షిస్తున్నట్లు తెలిపారు.

దేశవ్యాప్తంగా హై అలర్ట్

కరోనా మరణాల నేపథ్యంలో.. దేశవ్యాప్తంగా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పలు రాష్ట్రాలు వైరస్ వ్యాప్తిని నిరోధించే దిశగా చర్యలను ముమ్మరం చేశాయి. ముఖ్యంగా ఐటీ రాజధాని బెంగళూరు నగరం సహా కర్నాటక వ్యాప్తంగా వైరస్ వ్యాప్తిని నిరోధించే చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. షాపింగ్ మాల్స్‌ను, సినిమా థియేటర్లను, పబ్‌లు, నైట్ క్లబ్‌లను తక్షణమే మూసేయాలని ఆదేశించారు. అన్ని రకాల ఎగ్జిబిషన్లు, సమ్మర్ క్యాంప్‌లు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సదస్సులు, పుట్టినరోజు వేడుకలు, వివాహ కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలను శనివారం నుంచి వారం రోజుల పాటు నిలిపేయాలని ముఖ్యమంత్రి యెడియూరప్ప శుక్రవారం రాష్ట్ర ప్రజలకు సూచించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలను వారం పాటు మూసేస్తున్నట్లు ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోకూడదని ప్రజలకు సూచించారు. స్కూళ్లను మూసేయాలని, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. 10వ తరగతి పరీక్షలతో పాటు సహా అన్ని పరీక్షలు యథావిధిగా జరుగుతాయన్నారు. ఐటీ నిపుణులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇంటి నుంచి పని చేసేలా విధుల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, అసెంబ్లీ కార్యకలాపాలు యథావిధిగా జరుగుతాయన్నారు. కోవిడ్‌తో కల్బుర్గికి చెందిన 76 ఏళ్ల వృద్ధుడు బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. అతడు కాకుండా, రాష్ట్రంలో మరో ఐదుగురికి ఈ వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. అందులో, బెంగళూరులోని గూగుల్ సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి కూడా ఉన్నారు. కల్బుర్గిలో మరణించిన వ్యక్తితో సన్నిహితంగా ఉన్న 46 మందిని కూడా ప్రత్యేకంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. దేశంలో కరోనా సోకినట్లు నిర్ధారణ అయిన కేసుల సంఖ్య 82కి చేరింది. వీటిలో 11 యూపీలో, 7 ఢిల్లీలో నమోదయ్యాయి. ఇప్పటివరకు 11 రాష్ట్రాల్లో కోవిడ్-19 కేసులు నిర్ధారణ అయ్యాయి.

సుధామూర్తి సూచనలు

కరోనా కట్టడికి ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి పలు సూచనలు చేశారు. వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కర్నాటక ప్రభుత్వానికి రాసిన లేఖలో ఆమె పేర్కొన్నారు. షాపింగ్ మాల్స్‌ను, సినిమా టాకీస్‌లను తక్షణమే మూసేసి, నిత్యావసరాలైన ఫార్మసీ, కిరాణా, పెట్రోల్ బంక్‌లను మాత్రమే తెరిచి ఉంచాలని సూచించారు. బాధితుల కోసం ఒక ఆసుపత్రిని సిద్ధం చేయాలని, అందుకు తమ సహకారం అందిస్తామన్నారు.

కరోనాపై ఉమ్మడిగా పోరాడదాం

ప్రధాని పిలుపునకు సార్క్ దేశాల సానుకూల స్పందన

కోవిడ్ కట్టడికి కలసికట్టుగా పోరాటం చేద్దామని ప్రధాని మోదీ సార్క్ దేశాలకు పిలుపునిచ్చారు. ఇందుకోసం సభ్య దేశాలు ఉమ్మడిగా బలమైన వ్యూహాన్ని రచించాలని శుక్రవారం ట్వీట్ చేశారు. ఆ ప్రణాళిక ప్రపంచ దేశాలకే మార్గదర్శకంగా ఉండాలని అన్నారు. 'ప్రపంచ దేశాలన్నీ కోవిడ్‌తో పోరాడుతున్నాయి. ప్రజలు, ప్రభుత్వాలు వారి వారి స్థాయిలో వైరస్ విస్తరించకుండా ప్రయత్నం చేస్తున్నాయి. అయితే మన దేశాల పౌరులందరూ ఆరోగ్యంగా ఉండడానికి మనమే పరిష్కార మార్గాలు వెతకాలి. సభ్య దేశాల అధినేతలందరం కలిసి కరోనా వైరస్‌పై పోరాటానికి పకడ్బందీ ప్రణాళిక రచించాలి'అని మోదీ పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను శ్రీలంక అధ్యక్షుడు గోటబాయ రాజపక్స, మాల్దీవుల అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలిహ్, నేపాల్ ప్రధానమంత్రి కె.పి. శర్మ ఓలి, భూటాన్ ప్రధాని లోటే షెరింగ్ స్వాగతించారు.

ఇతర ముఖ్యాంశాలు..

- ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇజ్రాయెల్, దక్షిణ కొరియా, శ్రీలంక దేశాలకు ఏప్రిల్ 30 వరకు ఎయిర్ ఇండియా విమాన సర్వీసుల్ని నిలిపివేసింది.
- ఉత్తరప్రదేశ్‌లో 11 కరోనా కేసులు నమోదు కావడంతో అన్ని పాఠశాలలు, కళాశాలల్ని మార్చి 22 వరకు మూసివేస్తున్నట్టు ప్రకటించారు. అయితే పరీక్షలు మాత్రం యథావిధిగా జరుగుతాయి.
- ఢిల్లీలో మార్చి 31 వరకు జేఎన్‌యూ సహా అన్ని విద్యాసంస్థలను మూసివేశారు. థియేటర్లు, షాపింగ్ మాల్స్‌ని బంద్ చేశారు. ఒడిశా కూడా అదే బాటలో నడుస్తోంది.
- కేరళలో చెంగాళంలో కరోనా వైరస్ సోకిన బాధితుడి పొరుగు ఇంట్లో నివసించే వృద్ధుడు మరణించడంతో కలకలం రేగింది. అతనికి కూడా కరోనా వైరస్ సోకిందేమోనన్న అనుమానాలు వచ్చాయి. అయితే అతను గుండె పోటుతో మరణించాడని వైద్యులు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో 900 మంది వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఇటలీ నుంచి గత నెలలో కేరళకు వచ్చిన కుటుంబంలో ముగ్గురికి కరోనా సోకిందని తేలడంతో ఆ రాష్ట్రం పలు చర్యలు తీసుకుంది.
- కరోనా కేసులు ఎక్కువగా ఉన్న మహారాష్ట్ర కూడా పలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. ముంబై, నవీముంబై, పుణె, థానె, నాగపూర్, పింప్రి చించ్వాడలలో మార్చి 30 వరకు మాల్స్, థియేటర్లు, జిమ్‌లు, స్విమ్మింగ్ పూల్‌లను మూసివేశారు.
- వాఘా సరిహద్దుల ద్వారా విదేశీయులెవరినీ శుక్రవారం సాయంత్రం నుంచి దేశంలోకి అనుమతించడం లేదు.
- ఇటలీలో చిక్కుకున్న భారతీయుల్ని వెనక్కి తీసుకురావడానికి ఎయిర్ ఇండియాకు చెందిన విమానం మిలాన్‌కు వెళ్లింది. ఆదివారం ఉదయానికి భారతీయుల్ని వెనక్కి తీసుకురానుంది. మరోవైపు ఇరాన్ నుంచి రెండో విడత 44 మంది యాత్రికుల్ని వెనక్కి తీసుకువచ్చారు. ముంబై విమానాశ్రయంలో దిగిన వారిని జైసల్మీర్‌లో ఆర్మీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతారు.
- ఏప్రిల్ 15వరకు భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి ప్రయాణికుల రాకపోకల్ని నిలిపివేశారు.
- సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు ఈ సోమవారం నుంచి అత్యవసర కేసులు తప్ప మిగిలినవేవీ విచారణ చేపట్టకూడదని నిర్ణయించింది. కోర్టు హాలులోకి లాయర్లను మినహా మరెవరినీ అనుమతించరు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 21 నుంచి రెండు రోజుల గుజరాత్ పర్యటనను వాయిదా వేసుకున్నారు.

బికనీర్‌లో కొత్త జంటకు థర్మల్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఇవీ నిత్యావసరాలే

కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ఉపయోగించే ఫేస్ మాస్కులు, గ్లవుజులు, హ్యాండ్ శానిటైజర్లను నిత్యావసర వస్తువులుగా ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. వీటిని నిత్యావసర వస్తువుల చట్టం-1955 పరిధిలోకి తీసుకువచ్చింది. దాంతో, వీటి ఉత్పత్తి, నాణ్యత, సరఫరా, ధరలను నియంత్రించే అవకాశం రాష్ట్రాలకు లభిస్తుంది. జూన్ 30 వరకు అవి నిత్యావసరాల జాబితాలో ఉంటాయని, వాటిని అక్రమంగా పెద్ద ఎత్తున నిలవ చేయడం నేరమని కేంద్రం పేర్కొంది. వీటి ధరలను పెంచి అమ్మడం కూడా నేరమని పేర్కొంది. అవసరాలకు తగినంతగా వీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

మరణాలు 5 వేలు.. కేసులు 1.34 లక్షలు

- ప్రపంచవ్యాప్తంగా కోవిడ్-19 విజృంభణ
- ఇరాన్‌లో ఒక్కరోజే 85 మంది మృత్యువాత
- కెనడా ప్రధాని భార్యకు, ఆస్ట్రేలియా మంత్రికి సోకిన వైరస్

టెహ్రాన్/ఒట్టావా/పారిస్/వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా కరోనా కరాళనృత్యం కొనసాగుతూనే ఉంది. ఈ కోవిడ్-19 వల్ల ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 5 వేలు దాటింది. కేసుల సంఖ్య 1.34 లక్షలకు చేరింది. మృతుల సంఖ్య చైనాలోనే అత్యధికం. అక్కడ 3,176 మంది చనిపోయారు.

ఇరాన్ లాక్‌డౌన్

కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న 24 గంటల్లో సైనిక దళాలు ఇరాన్ వీధులన్నింటినీ స్వాధీనం చేసుకుంటాయని, ఆ తరువాత ప్రతీ పౌరుడికి కరోనా నిర్ధారణ పరీక్షలు జరుపుతామని శుక్రవారం ప్రకటించింది. కరోనాపై యుద్ధంలో సైనిక దళాలు ప్రధాన పాత్ర పోషించాలని సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ ఆదేశించారు. ఇప్పటికే శుక్రవారం సామూహిక ప్రార్థనలను ఇరాన్ రద్దు చేసింది. పాఠశాలలను మూసివేసింది. ఈ వైరస్ కారణంగా ఇరాన్‌లో గురువారం ఒక్కరోజే 85 మంది మృత్యువాత పడ్డారు. 1,289 మందికి కొత్తగా ఈ వైరస్ సోకింది. మొత్తంగా ఆ దేశంలో కోవిడ్-19 వల్ల మృతి చెందిన వారి సంఖ్య 514కి, మొత్తం కేసుల సంఖ్య 11,364కి చేరింది. కరోనా సోకినట్లుగా నిర్ధారణ అయినవారిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ విదేశీ వ్యవహారాల సలహాదారు అలీ అక్బర్ వెలాయతి కూడా ఉన్నారు. దేశ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, రెవల్యూషనరీ గార్డ్స్ సభ్యులు, ఆరోగ్య శాఖలోని పలువురు అధికారులు కూడా ఈ వైరస్ బారిన పడినట్లు అధికార టీవీ ప్రకటించింది. అమెరికా విధించిన ఆంక్షల కారణంగా.. ఈ వైరస్ కట్టడికి అవసరమైన ఔషధాలు, ఇతర వైద్య పరికరాల దిగుమతిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అందువల్ల తమపై విధించిన ఆర్థిక ఆంక్షలను ఎత్తేయాలని ఇరాన్ యూఎస్‌ను కోరింది. మరోవైపు, ఇటలీలో చిక్కుకుపోయిన భారతీయులను భారత్‌కు తీసుకువచ్చేందుకు వీలుగా.. వారికి కరోనా నిర్ధారణ పరీక్షలు జరిపేందుకు భారత వైద్యుల బృందం శుక్రవారం ఇటలీ చేరుకుంది.

ఇప్పుడు కరోనా కేంద్రం.. యూరోప్

కరోనా వైరస్ కేంద్ర స్థానం ఇప్పుడు యూరోప్‌కి మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ శుక్రవారం ప్రకటించింది. ప్రస్తుతం యూరోప్‌లోనే అత్యధిక కేసులు నమోదవుతున్నాయని, అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని వెల్లడించింది. ఈ విశ్వవ్యాప్త మహమ్మారి ఎప్పుడు అంతమవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొన్నదని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ టెడ్రోస్ పేర్కొన్నారు. ఇటలీలో మృతుల సంఖ్య 1000 దాటింది. మొత్తం 15 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. ఇటలీలోని లాంబర్డీ ప్రాంతంలో ఈ వైరస్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీల్లో కేసుల సంఖ్య 2 వేల చొప్పున నమోదయ్యాయి. ఫ్రాన్స్, ఐర్లాండ్, డెన్మార్క్, నార్వే, లిథువేనియా, అల్జీరియా, స్లొవేకియాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వైరస్ భయానికి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు విదేశాల నుంచి రాకపోకలపై నియంత్రణలను విధించాయి. కళాశాలలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించాయి. సంస్థలు తమ ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేసుకునే సౌకర్యం కల్పించాయి. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రచార ర్యాలీలు కూడా నిలిచిపోయాయి. విమానాశ్రయాలు, రహదారులు నిర్మానుష్యమయ్యాయి. ప్రజలు విందు, వినోదాల కు దూరంగా, ఇంట్లోనే ఉంటున్నారు. బృంద కార్య క్రమాలపై అప్రకటిత నిషేధం అమలవుతోంది. అమెరికాలో కేసుల సంఖ్య 16 వందలకు చేరింది. మరోవైపు, నేపాల్ ఎవరెస్ట్ సహా అన్ని పర్వతారోహణ కార్యక్రమాలపై నిషేధం విధించింది.

రాకపోకలపై నిషేధం కారణంగా నిర్మానుష్యంగా మారిన స్పెయిన్‌లోని ఓ రోడ్డు.. పహారా కాస్తున్న పోలీసు

అమెరికా నుంచే ఆ వైరస్?

అమెరికా నుంచి వచ్చిన యూఎస్ సైన్యం ద్వారానే కరోనా వైరస్ చైనాకు చేరిందని చైనా అధికారి ఒకరు చేసిన ఒక ట్వీట్ అమెరికా, చైనాల మధ్య వివాదానికి దారితీసింది.

కెనడా ప్రధాని భార్యకు కోవిడ్-19

కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో భార్య సోఫీ గ్రెగరీ ట్రూడోకు కరోనా వైరస్ సోకినట్లు తాజాగా నిర్ధారణ అయింది. దాంతో, భార్యతో పాటు జస్టిన్ ట్రూడో స్వీయ గృహ నిర్బంధంలో ఉన్నారు. ఆస్ట్రేలియా సీనియర్ మంత్రి పీటర్ డటన్‌కు కూడా కరోనా కన్ఫర్మ్ అయింది.

క్లుప్తంగా...

గ్రీస్‌కు మహిళా అధ్యక్షురాలు

ఎథెన్స్: గ్రీస్ తొలి మహిళా అధ్యక్షురాలిగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి కెటరీనా సకెల్లార్‌పౌలూ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రెండు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో కేటరీనా ఘన విజయం సాధించారు. కోవిడ్ నేపథ్యంలో ఆమె ప్రమాణ స్వీకార కార్యక్రమం సాదాసీదాగా జరిగింది.

యజమానిని గాయపరిచి బంగారంతో పరార్!

దుబాయ్: గల్ఫ్ నగరం షార్జాలో ముగ్గురు భారతీయులు యజమానిని గాయపరిచి నాలుగు కిలోల బంగారంతో పరారైనట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. బంగ్లాదేశ్‌కు చెందిన ఎస్‌డీ (57) అల్ మరైజా ప్రాంతంలో ఓ నగల దుకాణం నడుపుతున్నాడు. ముగ్గురు భారతీయులు అందులో పనిచేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఉద్యోగులు ఆ ముగ్గురూ యజమానిపై దాడిచేసి 4 కిలోల బంగారంతోపాటు, అతని వద్ద ఉన్న తమ పాస్‌పోర్టులను కూడా తీసుకుని ముంబైకి విమానంలో వెళ్లిపోయారు. ఈ మేరకు ఎస్‌డీ ఎస్‌డీ కుమారుడు శిశిర్ కుమార్ దాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యూపీలో అకాల వర్షాలు.. 28 మంది మృతి

లక్నో: గురువారం నుంచి ఉత్తర ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గడచిన 24 గంటల్లో 28 మంది మృతి చెందారని అధికారులు శుక్రవారం వెల్లడించారు. మరణించిన వారిలో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. గోడలు కూలడం, చెట్లు పడిపోవడం, పిడుగులు పడటం వంటి కారణాల వల్ల వీరంతా మృతి చెందినట్లు తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షల ఆర్థిక సహాయం అందించాలంటూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు.

పోక్సో మరింత కట్టుదిట్టం

న్యూఢిల్లీ: పోక్సో చట్టానికి మరికొన్ని కొత్త నియమాలు చేర్చడంతో పాటు చిన్నారులపై లైంగిక దాడులు తగ్గించేందుకు ఉద్దేశించిన మార్గదర్శకాలను కేంద్రం ప్రకటించింది. ఇకపై పోక్సో చట్టం కింద రుజువయ్యే నేరాలకు మరింత కఠిన శిక్షను విధించేందుకు సిద్ధమైంది. ఈ నెల 9 నుంచి ఈ కొత్త నియమాలు అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. చిన్నారులపై జరిగే లైంగిక దాడులను అరికట్టేందుకు, అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు స్పష్టంచేసింది.

కేంద్ర ఉద్యోగుల డీఏ పెంపు

17 నుంచి 21శాతానికి పెంచుతూ కేబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం శుభవార్త చెప్పింది. కరువు భత్యం (డీఏ)ను 4శాతం పెంచే నిర్ణయానికి ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఆమోదం లభించింది. దీనివల్ల 1.13 కోట్ల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దార్లకు లబ్ధి చేకూరనుంది. పెరిగిన డీఏ 2020 జనవరి 1 నుంచే అమల్లోకి వస్తుందని తెలిపింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే డీఏ 17 నుంచి 21శాతానికి చేరుకుంది. పెరిగిన రేట్లకు అనుగుణంగా దీన్ని పెంచినట్లు కేంద్రం విడుదల చేసిన నివేదిక తెలిపింది. దీనివల్ల కేంద్ర ప్రభుత్వంపై సంవత్సరానికి రూ. 12,510 కోట్లు, 2020-21 సంవత్సరానికి (2020 జనవరి నుంచి 2021 ఫిబ్రవరి వరకు) రూ. 14,595 కోట్ల అదనపు భారం పడనుంది. దాదాపు 48 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పింఛన్‌దారులు దీని ద్వారా లబ్ధి పొందనున్నారని సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్ చెప్పారు.

కొబ్బరికి మద్దతు ధర పెంపు

సాక్షి, న్యూఢిల్లీ: 2020 సీజన్‌కు గాను కొబ్బరికి మద్దతు ధర పెంపు ప్రతిపాదనను ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ(సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమై వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ సిఫారసుల మేరకు శుక్రవారం ఈ నిర్ణయం తీసుకుంది. 2020 సీజన్‌కు గాను ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ కలిగిన మిల్లింగ్ కొబ్బరికి క్వింటాలుకు రూ.9,521 నుంచి రూ.9,960కి, అదేవిధంగా బాల్ కొబ్బరికి రూ.9,920 నుంచి రూ.10,300కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మిల్లింగ్ కొప్రాలో క్వింటాల్‌కు రూ. 439, బాల్ కోప్రాలో రూ.380 పెరిగింది. అఖిల భారత సగటు ఉత్పత్తి వ్యయం కంటే మిల్లింగ్ కొబ్బరికి 50 శాతం, బాల్ కొబ్బరికి 55 శాతం రాబడి వచ్చేలా ఈ మద్దతు ధర నిర్ణయించారు.

ఏపీ సహా 4 రాష్ట్రాల్లో జాతీయ రహదారుల నవీకరణ

ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం 780 కిలోమీటర్ల పొడవైన హరిత జాతీయ రహదారుల నవీకరణకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా రహదారుల విస్తరణ, నవీకరణ, తదితర పనుల కోసం కేంద్రం రూ.7,662.7 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ నిధుల్లో రూ.3,500 కోట్ల మేర ప్రపంచ బ్యాంకు రుణంగా అందజేస్తుంది.

మళ్లీ హైకోర్టుకు నిర్భయ దోషి!

న్యూఢిల్లీ: నిర్భయ కేసు దోషి వినయ్ శర్మ మరోసారి కోర్టు మెట్లు ఎక్కాడు. రాష్ట్రపతి కోవింద్ క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించడంలో కొన్ని లోటుపాట్లు జరిగాయని ఆరోపిస్తూ అతడు శుక్రవారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశాడు. క్షమాభిక్షను తిరస్కరించాలంటూ ఢిల్లీ ప్రభుత్వం ఇచ్చిన సిఫారసు లేఖలో ఢిల్లీ హోం మంత్రి సత్యేంద్రజైన్ సంతకం లేదని ఆ పిటిషన్‌లో ఆరోపించాడు. దీంతో ఢిల్లీ ప్రభుత్వం పంపిన లేఖ అక్రమం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నాడు. వీలైనంత తొందరగా తనకు న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరాడు.

ఐస్‌క్రీమ్ వద్దన్నాడని చంపేశారు..

న్యూఢిల్లీ: ఉచితంగా ఇచ్చిన ఐస్‌క్రీమ్‌ను కాదన్నాడన్న కారణంతో నలుగురు యువకులు మరో యువకున్ని చంపేశారు. ఈ ఘటన ఢిల్లీలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన లక్ష్యయ్ (27) మిత్రులు ధీరజ్ (26), కరణ్ (29), అవినాశ్‌లతో విందు చేసుకున్నాడు. ఆపై ఐస్‌క్రీములు కొనుక్కుని తమకు ఎదురైన అమిత్ (25), రాహుల్, ఇశాంత్‌లకు వాటిని ఇవ్వబోగా తిరస్కరించారు. దీంతో మద్యం మత్తులో ఉన్న లక్ష్యయ్ బృందం వారిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన అమిత్ ప్రాణాలు విడిచాడు. అతడి మిత్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు నాలుగు గంటల్లోనే నిందితులను పట్టుకున్నారు.

టికెట్ల బుకింగ్‌కు ఇక ఏజెంట్లతో పనిలేదు: గోయల్

న్యూఢిల్లీ: రైలు ప్రయాణికులు టికెట్ల కోసం ప్రైవేట్ విక్రేతలు, ఏజెంట్లపై ఆధారపడే అవసరం ఇకపై ఉండదని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. శుక్రవారం లోక్‌సభలో రైల్వే శాఖ గ్రాంట్ల డిమాండ్‌పై చర్చ సందర్భంగా ఆయన ఈ విషయం తెలిపారు. టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన కొద్ది నిమిషాల్లోనే అక్రమమార్గాల్లో బుక్ చేసుకునే ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్మార్ట్‌ఫోన్ల సాయంతో ప్రయాణికులే స్వయంగా టికెట్లను బుక్ చేసుకుంటున్నందున ఇకపై ఏజెంట్ల అవసరం లేకుండా చేస్తామన్నారు. సొంతంగా బుక్ చేసుకోలేని వారు ప్రభుత్వ కామన్ సర్వీస్ సెంటర్లకు వెళ్లవచ్చని తెలిపారు. రైల్వేల్లోకి ప్రైవేట్ భాగస్వామ్యంతో వచ్చే 12 ఏళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి చెప్పారు.

నిర్బంధం నుంచి ఫరూక్ విడుదల

- సంపూర్ణ స్వేచ్ఛకాదన్న మాజీ సీఎం
- ఒమర్, మెహబూబాలనూ విడుదల చేయాలని డిమాండ్

శ్రీనగర్: ఏడు నెలల నిర్బంధం అనంతరం మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా(82) కు విముక్తి లభించింది. మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసి, ఐదుసార్లు పార్లమెంటు సభ్యుడూ అయిన ఎంపీ ఫరూక్ అబ్దుల్లాపై పబ్లిక్ సేఫ్టీ యాక్ట్(పీఎస్ఏ)ను ప్రభుత్వం తొలగించింది. ఆర్టికల్ 370ని కేంద్రం ప్రభుత్వం రద్దుచేసిన అనంతరం ఆగస్టు 5వ తేదీన ఫరూక్ అబ్దుల్లా సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత సెప్టెంబర్ 15వ తేదీ నుంచి పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద ఫరూక్ అబ్దుల్లా గృహ నిర్బంధంలో ఉన్నారు. పీఎస్ఏ చట్టం ప్రయోగించిన తొలి ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాయే. పీఎస్ఏ చట్టం కింద నిర్బంధంలో ఉంచినట్టయితే మూడు నెలలపాటు ఎటువంటి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉండదు. అలాగే ఈ నిర్బంధాన్ని 2 ఏళ్ల పాటు కొనసాగించే అవకాశం కూడా చట్టం ఇస్తుంది. శ్రీనగర్‌లోని గుప్కార్ రోడ్డులోని తన నివాసం నుంచి బయటికి వచ్చిన ఫరూక్ అబ్దుల్లా.. నిర్బంధంలో ఉన్న తన కుమారుడు ఒమర్ అబ్దుల్లా, పీడీపీ నేత మెహబూబా ముఫ్తీని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'ఈ రోజు నేను విముక్తిడినయ్యాను. ఈ స్వేచ్ఛ సంపూర్ణం కాదు. ఒమర్, మెహబూబా ముఫ్తీ సహా ఇతర జైళ్ళల్లో నిర్బంధించిన వారందరినీ విముక్తి చేసినప్పుడే అది సంపూర్ణం అవుతుంది'అని మీడియాతో అన్నారు. 'నా విడుదల కోసం ప్రార్థించిన ప్రతి వ్యక్తికీ కృతజ్ఞతలు. మిగిలిన వారంతా విడుదలయ్యే వరకూ ఏ రాజకీయాలను గురించీ మాట్లాడను. ఇటీవలే కంటికి సంబంధించిన సర్జరీ చేయించుకున్న ఫరూక్ అబ్దుల్లా ప్రజల గొంతుకను వినిపించేందుకు పార్లమెంటు సమావేశాలకు హాజరవుతానన్నారు. ఫరూక్ అబ్దుల్లా విడుదలను స్వాగతించిన నేషనల్ కాన్ఫరెన్స్ నిర్బంధంలో ఉన్న మిగిలిన వారిని విడుదల చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరింది.

నామినేషన్ పత్రాలను అధికారికి అందజేస్తున్న సింధియా

విశ్వాస పరీక్షకు సిద్ధం

- గవర్నర్‌కు లేఖ సమర్పించిన సీఎం కమల్‌నాథ్
- రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన జ్యోతిరాదిత్య సింధియా

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. కాంగ్రెస్‌కు చెందిన 22 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో ప్రభుత్వం సంక్షోభంలో పడింది. విశ్వాస పరీక్షకు సిద్ధంగా ఉన్నామంటూ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన గవర్నర్ లాల్జీ టాండన్‌ని కలిసి ఓ లేఖ అందజేశారు. తమ ఎమ్మెల్యేలను బీజేపీ నిర్బంధంలో ఉంచి బేరసారాలాడుతోందని ఆరోపించారు.

సాక్షి
శనివారం, మార్చి, 14

కశ్మీర్‌లో మరింత కదలిక

ఏడు నెలల నిర్బంధం నుంచి జమ్మూ-కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) అధ్యక్షుడు ఫారుఖ్ అబ్దుల్లా శుక్రవారం విడుదల కావడం అక్కడ తిరిగి సాధారణ పరిస్థితులు ఏర్పడగలవన్న ఆశ రేకెత్తిస్తోంది. నిరుడు ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే రాజ్యాంగంలోని 370వ అధికరణను రద్దు చేయడంతోపాటు, ఆ రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విడగొట్టే కశ్మీర్ పునర్విభజన ప్రక్రియను కూడా పూర్తిచేసింది. అదే రోజు ఫారుఖ్‌తో పాటు ఆయన కుమారుడు, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా, పీడీపీ నాయకురాలు, మాజీ సీఎం మెహబూబా ముఫ్తీలతో సహా వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలను, వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలను అరెస్టు చేశారు. మూడు నెలలు గడిచాక వారందరినీ విడుదల చేస్తారని ఆశిస్తున్న తరుణంలో సెప్టెంబర్ 15న ఫారుఖ్‌పైనా, ఇతర నేతలపైనా ప్రజా భద్రతా చట్టం(పీఎస్ఏ) ప్రయోగించారు. ఆగస్టు 5నుంచి మొత్తంగా 7,357మందిని అరెస్టు చేయగా, అందులో 396మందిపై ఆ తర్వాత పీఎస్ఏ ప్రయోగించారు. జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ)తో పోల్చదగిన ఈ చట్టాన్ని వాస్తవానికి ఫారుఖ్ తండ్రి షేక్ అబ్దుల్లాయే తీసుకొచ్చారు. 1978లో ఆ చట్టాన్ని తెచ్చినప్పుడు దాన్ని కలప స్మగ్లింగ్‌ను అడ్డుకోవడానికని చెప్పినా అనంతరకాలంలో రాజకీయ ప్రత్యర్థులపై దాన్ని ప్రయోగించడం మొదలుపెట్టారు. నిర్దిష్టమైన వ్యక్తి వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనుకుంటే ఈ చట్టం కింద గరిష్టంగా ఏడాదిపాటు నిర్బంధించేందుకు వీలుంటుంది. రాజ్యభద్రతకు ముప్పు కలిగించే కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారన్న అభియోగం మోపితే గరిష్టంగా రెండేళ్లపాటు నిర్బంధించవచ్చు. కనుకనే ఈ చట్టానికి రాజ్యాంగబద్ధత వున్నా ఆచి తూచి వినియోగించకపోతే పౌర స్వేచ్ఛకు ముప్పు తెస్తుందని సుప్రీంకోర్టు సైతం ఒక సందర్భంలో వ్యాఖ్యానించింది. జమ్మూ-కశ్మీర్ పునర్విభజన అనంతరం ఇతరత్రా చట్టాలు చాలా రద్దయినా పీఎస్ఏ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం యథావిధిగా కొనసాగించింది. నిర్బంధ చట్టాలపై పార్టీలకతీతంగా పాలకులకుండే ప్రేమను పీఎస్ఏ చరిత్ర వెల్లడిస్తుంది.

నాయకులు, ఇతరుల నిర్బంధం మాత్రమే కాదు... కశ్మీర్‌లో ఆగస్టు 5 నుంచి కమ్యూనికేషన్ల వ్యవస్థ కూడా స్తంభించిపోయింది. అక్కడున్న తమవారి క్షేమ సమాచారాలు తెలియక విదేశాల్లోనూ, దేశంలోని వివిధ ప్రాంతాల్లోనూ చదువుల కోసం, కొలువుల కోసం వెళ్లినవారు ఇబ్బందిపడ్డారు. అక్కడివారు కూడా తమ ఆప్తులతో సంభాషించడం ఆగిపోవడంతో మానసిక వేదనకు లోనయ్యారు. అయితే నిరుడు అక్టోబర్‌నాటికి మొబైల్ సేవల్ని పాక్షికంగా పునరుద్ధరించారు. అక్కడ పర్యాటకం కూడా ప్రారంభమైంది. మొదట్లో దాదాపు మూడు నెలలపాటు మూతబడిన పాఠశాలలు, కళాశాలలు కూడా ఆ తర్వాత తెరుచుకున్నాయి. అదేవిధంగా మూతబడిన వ్యాపార కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే జమ్మూ-కశ్మీర్ ప్రాంతం సున్నితమైన ప్రాంతం. పొరుగునే పాకిస్తాన్ ఉండటం, మిలిటెంట్లను సరిహద్దులు దాటించి కశ్మీర్‌లో తరచు సమస్యలు సృష్టించిన చరిత్ర దానికి వుండటం పర్యవసానంగా కమ్యూనికేషన్ల వ్యవస్థను నిలిపేసినట్టు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ సర్వీసుల్ని వినియోగించుకుని ఉగ్రవాదులు విధ్వంసకర కార్యకలాపాలకు దిగే ప్రమాదం వుంటుందని ప్రభుత్వం అనుమానించడంలో తప్పు లేదు. అయితే పటిష్టమైన నిఘా వుంచి లేదా పరిమిత సమయాల్లో మాత్రం అనుమతించి ఈ వ్యవస్థను యథావిధిగా కొనసాగించివుంటే బాగుండేది. మొత్తంగా నిలిపేయడం వల్ల సాధారణ పౌరులు ఇబ్బందులుపడ్డారు. మొబైల్ సేవలు అందుబాటులోకొచ్చాక ఇంటర్నెట్ కూడా పనిచేయడం ప్రారంభించింది. ఇవన్నీ కశ్మీర్‌లో నానాటికీ మెరుగుపడుతున్న పరిస్థితుల్ని సూచిస్తున్నాయనడంలో సందేహం లేదు. కానీ ఫారుఖ్, ఒమర్, మెహబూబా వంటి నేతల్ని ఈ చట్టం కింద నిర్బంధించడం ఎలా చూసినా సహేతుకమైన చర్య కాదు. వీరంతా భారత్‌లో జమ్మూ-కశ్మీర్ విడదీయరాని భాగమని దృఢంగా విశ్వసించినవారు. మాజీ ప్రధాని స్వర్గీయ వాజపేయి నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు నేషనల్ కాన్ఫరెన్స్ అందులో పాలుపంచుకుంది. మెహబూబా నాయకత్వంలోని పీడీపీతో కలిసి బీజేపీ జమ్మూ-కశ్మీర్‌లో రెండేళ్లపాటు అధికారం పంచుకుంది. ఈ నేతల రాజకీయ కార్యకలాపాలు ఎప్పుడూ సమస్యాత్మకం కాలేదు. పైపెచ్చు ఈ పార్టీల కార్యకలాపాల కారణంగానే అక్కడి ప్రజానీకంపై మిలిటెంట్ల ప్రభావం నానాటికీ తగ్గిపోయింది. ఒకప్పుడు ఎంతో పలుకుబడివున్న హురియత్ కాన్ఫరెన్స్ వంటివి క్రమేపీ ప్రజాబలం లేక క్షీణించాయి.

అఫ్గానిస్తాన్ నుంచి వైదొలగాలని ఏకపక్షంగా, బాధ్యతారహితంగా అమెరికా నిర్ణయించడం, అందులో భాగంగా తాలిబన్‌లతో ఒప్పందం కుదుర్చుకోవడం వంటి పరిణామాలతో ముందూ మునుపూ మన దేశానికి సమస్యలేర్పడే అవకాశంవుంది. 90వ దశకం చివర పాక్ ప్రాపకంతో తాలిబన్‌లు జమ్మూ-కశ్మీర్‌లో ఎంత కల్లోలం సృష్టించారో ఎవరూ మరిచిపోలేరు. కనుక ఈ దశలో కశ్మీర్ సమాజం సమష్టిగా ఉగ్రవాద బెడదను ఎదుర్కొనాలంటే అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొల్పడం అత్యవసరం. ఫారుఖ్ అబ్దుల్లాకు స్వేచ్ఛనివ్వడం ఆ దిశగా తొలి అడుగని భావించాలి. చెరవీడిన అనంతరం ఫారుఖ్ ఒక మాటన్నారు. ఇతర నాయకులు కూడా నిర్బంధం నుంచి విముక్తులైనప్పుడే తనకు పరిపూర్ణమైన స్వేచ్ఛ వచ్చినట్టు భావిస్తానన్నారు. జమ్మూ-కశ్మీర్‌లో పరిస్థితులు కుదుటపడితే దానికి మళ్లీ రాష్ట్ర ప్రతిపత్తి ఇస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిరుడు ఆగస్టులోనే వాగ్దానం చేశారు. అది నెరవేరాలని, కశ్మీర్‌లో సాధ్యమైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొని, అది మళ్లీ భూతలస్వర్గంగా కాంతులీనాలని అందరూ ఆశిస్తారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి బ.పంచమి ప.12.34 వరకు తదుపరి, షష్ఠి, నక్షత్రం విశాఖ రా.6.20 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం రా.10.10 నుంచి 11.44 వరకు దుర్ముహూర్తం ఉ.6.54 నుంచి 7.47 వరకు అమృతఘడియలు... ఉ.10.03 నుంచి 11.43 వరకు.

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం: 6.05
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

సమాజానికి 'అమృత' సందేశం

తండ్రి ఆత్మహత్య నేపథ్యంలో, హత్యకు గురైన తన భర్త పట్ల, అతడి కుటుంబం పట్ల అమృత ప్రదర్శించిన నిబద్ధత.. నైతిక జీవితానికి సంబంధించి అతి గొప్ప ఉదాహరణగా నిలిచిపోతుంది. కులం చుట్టూ పెనవేసుకుపోయిన మానవ అస్పృశ్యత ప్రభావమే ఒక యువకుడి దారుణ హత్యకు దారితీసింది. అంతిమంగా తండ్రి ఆత్మహత్యకు కారణమైంది. మారుతిరావు కులతత్వమే అతడి కుటుంబాన్ని, అతడిని కూడా ధ్వంసం చేసింది. మనుషులు మంచివారు లేక చెడ్డవారు అని కులం ఎలా నిర్ణయిస్తుంది అని ప్రశ్నించింది అమృత. సంపద కానీ, కులం కానీ మానవ ప్రేమను, అభిమానాన్ని పట్టించుకోవు, సహించవు అని అమృత మన సమాజానికి ఇస్తున్న సందేశం శాశ్వత విలువ కలిగినది.

విశ్లేషణ

ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

తెలంగాణలోని మిర్యాలగూడలో పెరుమాళ్ల ప్రణయ్ అనే 24 ఏళ్ల దళిత యువకుడిని గర్భిణి అయిన భార్య సమక్షంలోనే 2018 సెప్టెంబర్ 24న నరికి చంపారు. అమృత ఆ పట్టణంలోని ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన యువతి. తన తండ్రి మారుతిరావును ధిక్కరించి మరీ ఆమె ప్రణయ్‌ని పెళ్లి చేసుకుంది. అమృతకు ఇప్పుడు 25 ఏళ్లు. సంపన్నులైన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తె. ఆమె తండ్రి రియల్ ఎస్టేట్, తదితర వ్యాపారాలతో భారీ ఆస్తులు కూడగట్టుకున్నారు. పోలీసులు సమర్పించిన ఎఫ్ఐఆర్ ప్రకారం ఆయనకు 200 కోట్ల రూపాయల ఆస్తులున్నాయి. కృష్ణానది ఒడ్డున ఉన్న సంపన్న పట్టణమైన మిర్యాలగూడ.. తెలంగాణలో వ్యాపార కార్యకలాపాలు విస్తృతంగా సాగే పట్టణాల్లో ఒకటి. ఈ పరిస్థితిని మారుతిరావు సంపదను కూడగట్టుకోవడానికి అనువుగా మల్చుకున్నారు.

ప్రణయ్ హత్యకేసులో అమృత తండ్రితో పాటు మరి కొందరు జైలుకెళ్లారు. కొన్నినెలల క్రితమే వారు బెయిల్‌పై విడుదల అయ్యారు. తన భర్త హత్య తర్వాత అమృత మిర్యాలగూడలో తన అత్త, మామల తోటే వారి సొంత ఇంటిలో కలిసి ఉంటోంది. భర్త హత్యకు గురైనప్పుడు ఆమె ఆరునెలల గర్భిణి. అమృత తన అత్తతో కలిసి వైద్య పరీక్షలకోసం ఆసుపత్రికి వెళ్లిన సందర్భంలోనే ఆమె భర్తను నరికి చంపారు.

న్యాయంకోసం చెరగని నిబద్ధత

తర్వాత ఆమె బాబుకు జన్మనిచ్చింది. ఇప్పుడతడు సంవత్సరం బిడ్డ. ఈ సమయంలోనే 2020 మార్చి 6న మారుతిరావు నోట్ రాసిపెట్టి మరీ ఆత్మహత్య చేసుకున్నారు. ఆ నోట్‌లో తన కుమార్తె తన ఇంటికి తిరిగి వచ్చి తల్లితో కలిసి ఉండాలని కోరుకున్నారు. తన తండ్రి ఆత్మహత్య తర్వాత, న్యాయంకోసం అమృత నిబద్ధత పట్ల మీడియాలో వస్తున్న కథనాలు నిజంగానే సినిమా కథను తలపిస్తున్నాయి. మారుతిరావు పక్షాన కేసు వాదిస్తున్న లాయర్ చెప్పిందాని ప్రకారం, తన కుమార్తె అమృతను తిరిగి తనవద్దకు తెచ్చుకునేందుకు కన్నతండ్రి అనేక ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. కానీ అమృత తన భర్త హత్యకు న్యాయం జరగాలనే తన వైఖరినుంచి అంగుళం కూడా పక్కకు జరగడానికి తిరస్కరించింది. తన తండ్రి, నిజమైన హంతకుడు బిహార్‌కి చెందిన శుభాష్ శర్మ, ప్రణయ్ హత్యకు సహకారం అందించిన ఆమె చిన్నాన్న శ్రవణ్‌లకు కఠిన శిక్ష పడాలని ఆమె కోరుకుంది. ప్రణయ్ హత్య కేసులో రాజీ కుదుర్చుకోవాలని ఆమె తండ్రి ఎంతగా ప్రయత్నించాడో అంతకంటే దృఢంగా మారిన అమృత తనను బెదిరిస్తున్నారని ఆరోపించి మరిన్ని కేసులను దాఖలు చేసింది.

తన తండ్రి చనిపోయిన వెంటనే ఆయన భౌతిక కాయాన్ని చూడడానికి ఆమె వెళ్లలేదు కానీ పోలీసు రక్షణ మధ్య శ్మశానవాటికలో తండ్రి మృతదేహాన్ని చూసి రావాలని ప్రయత్నించింది. కానీ ఆమె బంధువులు ఆమెను తండ్రి శవాన్ని చూడటానికి అనుమతించలేదు. దాంతో ఆమె మౌనంగా పోలీసు వ్యాన్‌లో వెనక్కి వెళ్లిపోయింది. ప్రణయ్ హత్య తర్వాత తన బాధను అర్థం చేసుకుని తన పక్కన నిలబడిన తన దళిత అత్త, మామతోనే ఆమె ఉంటోంది. తండ్రి ఆత్మహత్య

అనంతరం ఆ తర్వాత శ్మశాన వాటికలో ఆమె మీడియాతో చెప్పిన మూడు విషయాలు టీవీ తెరపై చూస్తున్న ప్రతి ఒక్కరినీ నివ్వెరపర్చాయి. ఆమె చెప్పిన మాటలివి. 1. ఆత్మహత్య చేసుకోవడం కంటే నా భర్త హత్య కేసులో నాన్న శిక్ష అనుభవించి ఉంటే బాగుంటుందని అనుకుంటున్నాను. 2. కుటుంబ సభ్యుల పేర్లతో, బినామీ పేర్లతో కూడా ఉంటున్న తండ్రి ఆస్తులను నేను లెక్కచేయను. నా తండ్రికి అనేక ఆస్తులున్నాయని నాకు తెలుసు కానీ వాటిపై నాకు ఆసక్తి లేదు. 3. ప్రధాన నిందితుడైన తండ్రి మరణించాక అమ్మవద్దకు వెళతావా అని మీడియా అడిగినప్పుడు ఆమె 'నేను ఇప్పుడు నా కుటుంబంతో, నా కుమారుడితో, నా అత్తమామలతోనే ఉంటున్నాను. అమ్మ కూడా నావద్దకు వస్తే మేం ఆమెను బాగా చూసుకుంటాం. అంతే కానీ మా నాన్న ఇంటికి మాత్రం వెళ్లను' అని చెప్పింది.

కులతత్వానికి బలైన కుటుంబం

మరణించిన తన భర్త పట్ల, అతడి కుటుంబం పట్ల అమృత ప్రదర్శించిన నిబద్ధత.. నైతిక జీవితానికి సంబంధించి అతి గొప్ప ఉదాహరణగా నిలిచిపోతుంది. ప్రణయ్ దళితుడు కాకపోయి ఉంటే ఆమె తండ్రి బహుశా అతడిని చంపించి ఉండకపోవచ్చు. ప్రణయ్ మరో కులానికి చెంది ఉంటే వారిని మారుతిరావు వదిలివేసి ఉండేవాడు. కానీ కులం చుట్టూ అంటుకుపోయిన మానవ అస్పృశ్యత ప్రభావమే ఒక యువకుడి దారుణ హత్యకు దారితీసింది. అంతిమంగా తండ్రి ఆత్మహత్యకు కారణమైంది. చివరకు మారుతిరావు భార్య కూడా నిస్సహాయురాలిగా మిగిలిపోయింది. మారుతిరావు కులతత్వమే అతడి కుటుంబాన్ని, అతడిని కూడా ధ్వంసం చేసింది.

మారుతిరావు తన కుమార్తెను ప్రాణాధికంగా ప్రేమించారని చెబుతున్నారు. తన కుమార్తెకు ఇవ్వడం కోసమే అన్ని రకాల వ్యాపారాలు చేస్తూ వచ్చారు. కాని తన కుమార్తె ఒక యువకుడిని ప్రాణాధికంగా ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పుడు అతడిని దారుణంగా హత్య చేసే వరకు కన్నతండ్రి తెగించారు. కానీ ఆయన కన్నకుమార్తె ఈ సమాజానికి ఒక విభిన్నమైన నైతిక సందేశాన్ని పంపింది. తమపిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రేమను ప్రదర్శించడం అంటే ఆ పిల్లల జీవితానికి సంబంధించిన ప్రతి అంశాన్ని నిర్ణయించే హక్కు తమకు ఉంటుందని కాదు. అంతకు మించి కుల వ్యవస్థ మనిషి జీవితాన్ని, ప్రేమను, మానవ విలువలను అస్సలు నిర్ణయించకూడదు. మారుతిరావు మానవ జీవితానికి సంబంధించిన చెడు ఉదాహరణగా నిలిచారు కానీ ఆయన కుమార్తె తన యవ్వన జీవితంలోనే అత్యంత విభిన్నమైన దారిలో నడుస్తోంది. తన భర్తను కోల్పోయింది. ఆ బాధను అనుభవిస్తూనే బిడ్డకు జన్మనిచ్చింది. తండ్రినుంచి ఒత్తిళ్లకు గురైంది. మీడియా డేగ చూపులను ఎదుర్కొంటోంది. పోలీసు రక్షణలోనే జీవిస్తోంది. చివరకు కన్నతండ్రి ఆత్మహత్యను కూడా భరిస్తోంది. ఒక అగ్రకుల సంపన్న కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయిని ఇన్ని రకాల విషాదాలు, గాయాలు ఇంత చిన్న జీవితంలో వెంటాడుతూ వచ్చాయి.

కలకాలం నిలిచే సందేశం

కన్నతండ్రి ఆత్మహత్య తర్వాత మీడియా ఆమెను విభిన్నమైన ప్రశ్నలతో వెంటాడుతోంది. అమృత నుంచి ఆశ్చర్యకరమైన విషయాలను వినాలని టీవీలకు అంటుకుపోయి చూస్తున్న ప్రజలను ప్రశాంతంగా, స్థిరంగా కనిపించిన అమృత నిశ్చేష్టులను చేసింది. ఇంటర్వ్యూలలో ఆమె అత్యంత పరిణతిని, మానవీయమైన, కుల వ్యతిరేక సంస్కృతిని, నడతను ప్రదర్శించింది. భర్తను చంపించిన కన్నతండ్రే ఆత్మహత్య చేసుకున్నాడు. మరి ఈ ఘటనల మొత్తంలో ఏ పాత్రా లేని, ఏమీ చేయని కన్నతల్లి వద్దకు ఇప్పుడు మీరు ఎందుకు వెళ్లడం లేదు అని ఒక మీడియా వ్యక్తి ప్రశ్నించినప్పుడు ఆమె ఇచ్చిన జవాబు అందరి మతిపోగొట్టింది. ''నా కోసం నా అత్తమామలు వారి కొడుకును పోగొట్టుకున్నారు. నా జీవితంలోని అత్యంత కఠిన పరిస్థితుల్లో వారే నాకు నా బిడ్డకు తోడుగా ఉన్నారు. నాకు అత్యంత ముఖ్యమైన వ్యక్తులు వారే. మా అమ్మ నన్ను ప్రేమిస్తున్నట్లయితే, ఆమే మా వద్దకు వచ్చి మాతో కలిసి జీవించాలి''.

తన భర్త హత్యకు గురైనప్పుడు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటూనే ఆమె మీడియాతో మాట్లాడుతూ, మనుషులు మంచివారు లేక చెడ్డవారు అని కులం ఎలా నిర్ణయిస్తుంది అని ప్రశ్నించింది అమృత. 'నా పోరాటం మొత్తంలో నా భర్త కుటుంబంలోనే మానవీయతను నేను చూశాను. మా నాన్న వారికి వ్యతిరేకంగా ఎన్నో ఘోరమైన చర్యలు చేపట్టారు. కానీ నా కష్టకాలంలో నా కుటుంబం నాతో వ్యవహరించిన దానికంటే ఎంతో బాగా నా అత్తమామలు నన్ను చూసుకున్నారు. వారిది దిగువ మధ్యతరగతికి చెందిన దళిత కుటుంబం. మా నాన్న చాలా సంపన్నుడు, పైగా అధికార బలం ఉన్నవాడు. కానీ నా అత్తమామలు తన కుమారుడికోసం, అతడి మరణం తర్వాత నా కోసం దేన్నయినా కోల్పోవడానికి సిద్ధపడ్డారు. ఇక్కడే నేను నిజమైన మానవీయతను చూశాను. సంపద కానీ, కులం కానీ మానవ ప్రేమను, అభిమానాన్ని పట్టించుకోవు, సహించవు'.

భారతీయ సమాజానికి అమృత ఇస్తున్న ఈ సందేశం కలకాలం నిలిచివుంటుంది.

వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

సోషల్ మీడియా పతనం

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సరిహద్దులు

"ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా రక్షణ కోసం ఒక బలమైన సరిహద్దు విధానం ఉండాలి. కరోనా వైరస్ కారణంగా ఇప్పటికి దేశంలో 40 మంది వరకు మరణించారు. మనం ఇప్పటికీ బలహీనంగా వ్యవహరించి, దేశ సరిహద్దులను తెరిస్తే కరోనా మరణాల సంఖ్య మరిన్ని రెట్లు పెరిగే అవకాశం ఉంది"

– డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

వ్యాప్తి

"కరోనా వైరస్ కారణంగా మరణాల సంఖ్య ఎక్కువగా లేకపోయినా అది చాలా తీవ్రంగా వ్యాపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికీ టీజీ కారణంగా మరణాలు సంభవిస్తున్న భారత్ లాంటి దేశంలో కరోనా వ్యాప్తిని మనం తట్టుకోలేం. ప్రభుత్వం మరింత తీవ్రంగా స్పందించాల్సిన అవసరం ఉంది"

– రోహిణీ సింగ్, జర్నలిస్ట్

భక్తులు

"భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టి స్టాక్ మార్కెట్‌కు పూర్వవైభవం తీసుకురావాలని మోదీ అభిమానులకు విజ్ఞప్తి చేస్తున్నా. ప్రధాని నరేంద్ర మోదీపై, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై మీకున్న భక్తిని ప్రపంచానికి చాటుకోండి. మోదీని తక్కువగా చూపించడం కోసం ఉదారవాదులు తమ స్టాక్‌లను తక్కువ ధరకు విక్రయించి సెన్సెక్స్ పతనానికి కారణమవుతున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు? భక్తులారా మేల్కోండి, మీ శక్తిని చూపించండి"

– జే అంబడి, లాయర్

నిరసనలు

"కరోనా వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో అన్ని నిరసనలు విరమించుకోవాలి. పొంచి ఉన్న ఈ ముప్పుపై పోరాటం అనంతరం వాటిని మళ్లీ కొనసాగించవచ్చు. మతపరమైన, వ్యక్తిగతమైన పెద్ద సమూహాలకు అందరూ దూరంగా ఉండాలి. వ్యాధి సోకకుండానే కాదు, దాని చుట్టూ వ్యాపిస్తున్న తప్పుడు సమాచారం నుంచి కూడా అందరూ దూరంగా, క్షేమంగా ఉండండి"

– ప్రతీక్ సిన్హా, జర్నలిస్ట్

సంభాషణ

"ఉత్తర అమెరికాలోని 16 నగరాల్లో నా ప్రదర్శనలను వాయిదా వేసుకుని ఈ రాత్రికి ఇండియా తిరిగి వచ్చేస్తున్నానని నా భార్యకు చెప్పా. సరే, వచ్చేప్పుడు హోటల్ నుంచి కొన్ని షవర్ క్యాప్‌లు తీసుకురా అందామె"

– అతుల్ ఖత్రీ, కమెడియన్

ఇన్‌బాక్స్

వర్సిటీలకు వైస్‌చాన్సలర్లు ఏరీ?

అభివృద్ధికి బాటలు వేసి, చిన్న రాష్ట్రమైన తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చటంలో విద్యారంగం ప్రముఖమైనది. విద్యారంగం అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాల్సిన వర్శిటీల్లో అటెండర్ మొదలు వైస్‌ఛాన్సలర్ల వరకు అన్నీ ఖాళీలే. రాష్ట్రంలో ప్రముఖంగా 10 వర్సిటీలున్నాయి. రెండు వర్సిటీలు మినహా మిగతా 7-8 వర్సిటీలకు, గత 9 నెలల నుండి వైస్‌ఛాన్సలర్లు లేరు, ఇంఛార్జీల పాలనలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. రాష్ట్ర ఆవిర్భావంలో కీలక భూమిక పోషించిన వర్సిటీలకు రాష్ట్రం ఏర్పడ్డాక రెండున్నర ఏళ్లవరకు వైస్‌ఛాన్సలర్ల నియామకమే జరగలేదు. సమీక్షలకు నోచుకోని విశ్వవిద్యాలయాలు, వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో కూడా వివక్షకు గురయ్యాయి. నేటికీ మన విశ్వవిద్యాలయాలు అభివృద్ధికి దరిదాపుల్లో లేకుండా పోయాయి. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఒక్క తెలంగాణ విశ్వవిద్యాలయం కూడా మొదటి 100 వర్సిటీల జాబితాలో లేదు.

ఏ ఒక్క విశ్వవిద్యాలయంలో కూడా ఒక్క అటెండర్ పోస్టును కూడా నింపలేదు. ఒక్క పీహెచ్‌డీ నోటిఫికేషన్ కూడా వేయలేదు, వేసిన నోటిఫికేషన్లు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెట్టారు. ఒక్కటంటే ఒక్క పీహెచ్‌డీ నోటిఫికేషన్‌కు 3 ఏళ్ల సమయం పట్టిందంటే వీసీల పని తీరు ఎలా ఉందో ఊహించగలం. ఇకనైనా ప్రభుత్వం కుల, మత, ప్రాంతాల కతీతంగా వైస్‌ఛాన్సలర్ల నియామకాలు చేపట్టాలి. ఆయా వైస్ ఛాన్సలర్లు విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగే విధంగా, ప్రతి విద్యా సంవత్సరంలో పీహెచ్‌డీ నోటిఫికేషన్లు ఇచ్చేవిధంగా ఆలోచన చేయాలి, అంతేకాకుండా ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చేయాలి. ప్రతి విశ్వవిద్యాలయం, ఎన్ఏఏసీ గ్రేడింగ్ పొందే విధంగా, యూజీసీ 2 ఎఫ్, 12 బి స్టేటస్‌లను సంపాదించే విధంగా ప్రభుత్వ వర్సిటీలను బలోపేతం చేసే విధంగా ప్రణాళికలు రచించాలని విద్యార్థి లోకం డిమాండ్ చేస్తున్నది. విశ్వవిద్యాలయ ర్యాంకింగ్‌లను పెంచే విధంగా పని చేయాలి.

– జి. దిలీప్, జెఎన్‌టియుహెచ్, కూకట్‌పల్లి | 78010 09838

ఏది హాస్యం! ఏది అపహాస్యం!

శ్రీరమణ

కొన్ని వేల సంవత్సరాల నాడే అరిస్టాటిల్ మహాశయుడు 'నేటి మన యువత వెర్రిపోకడల్ని గమనిస్తుంటే, రానున్న రోజుల్లో ఈ సమాజం ఏమి కానున్నదో తల్చుకుంటే భయం వేస్తోంది' అని పదేపదే నిర్వేదపడేవాడు. మూడువేల సంవత్సరాల తర్వాత కూడా ఏమీ కాలేదు. ఎప్పుడూ అంతే, నాన్నలకి పిల్లల ధోరణి విపరీతంగా కనిపిస్తుంది. పిల్లేంచేసినా ఏదీ ఒక సక్రమ మార్గంలో ఉండదని తండ్రులు ప్రగాఢంగా భావించేవారు. పిల్లలు హాయిగా నవ్వుకుంటూ తమ జీవితం తాము గడిపేవారు. అరిస్టాటిల్ నించి మోతీలాల్ దాకా 'ఈ ప్రజాస్వామ్యం పెడదోవ పడుతోంది. బహుపరాక్' అంటూ హెచ్చరించినవారే. ఇటీవలి కాలంలో మళ్లీ చంద్రబాబులో అరిస్టాటిలూ ఇతర విశ్వవిఖ్యాత తత్వవేత్తలూ తొంగి తొంగి చూస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే సహించేది లేదని నిన్న మొన్న కూడా తీవ్ర స్వరంతో హెచ్రించారు. రాచరికాలు నడిచే రోజుల్లో కూడా ఓ మూల ప్రజాస్వామ్యం నడుస్తూ ఉండేది. రాణివాసపు ఆప్తులు, రాజాశ్రితులు, రాజబంధువులు, రాజోద్యోగులు, అక్రమ సంతాన మొగమాటస్తులు ఇలా చాలామంది వీధులకు తీరి ఉండేవారు. రాజుగారి పాలనలో అంతా సమానమేగానీ పైన చెప్పినవారు మరింత ఎక్కువ సమానం. మరీ ఓ వారం పదిరోజుల్నించి చంద్రబాబుకి ప్రజా

అక్షర తూణీరం

స్వామ్యం మీద బెంగ ఎక్కువైంది. పిల్లికి రొయ్యల మొలతాడన్నట్టు అచ్చ తెలుగు సామెత ఉంది. చంద్రబాబు నలభై ఏళ్ల ఇండస్ట్రీని ఒక్కొక్క ఫ్రేము చూస్తే- తెలుగునాట డెమోక్రసీ ఎన్ని ఫ్రేముల్లో గీతలు చారలు పడిందో మనం చూడవచ్చు.

కొంచెమైనా వెన్ను ముదరకుండానే లోకేశ్ బాబుని పెరటి గుమ్మంలోంచి ప్రవేశపెట్టి మంత్రి పదవి కూడా ఇచ్చేసి సభలో కూచోపెట్టినపుడు ప్రజాస్వామ్య దేవత ఆనంద తాండవం చేసిందా? నేతలు పుడతారు. మనం తయారుచేస్తే అవరు. చంద్రబాబుకి తొలినుంచీ సహనం చాలా తక్కువ. కాంగ్రెస్‌లో పుట్టి పెరిగినా, ఎన్టీఆర్ పవర్‌లోకి రాగానే దండవేసి మామగారి చంకనెక్కి కూచున్నారు. అది అపహాస్యం కాదు. ప్రజాస్వామ్య పరిరక్షణ. తర్వాత మామగారిని పాతాళానికి తొక్కేసినపుడు కూడా అది ధర్మసమ్మతమే. చంద్రబాబుకి గడిచిన 9 నెలలూ తొమ్మిది యుగాలుగా అనిపిస్తోంది. పదవీ విరహ వేదనతో మనిషి చలించిపోతున్నాడు. సరైన ఆలోచనలు రావడం లేదు. తను పవర్‌లో ఉండగా నెగ్గిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలకి గిట్టుబాటు ధరలతో ఎమ్మార్పీలు నిర్ణయించి మూకుమ్మడిగా కొనుగోలు చేసినపుడు ప్రజాస్వామ్యం చంద్రబాబుపై పూలవాన కురిపించిందా? చెప్పాలి. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు తీవ్రస్థాయికి చేరాయ్. చంద్రబాబుకి అభ్యర్థుల కొరత తీవ్రంగా ఉందని ప్రజలు చెప్పుకుంటున్నారు. జగన్ ప్రభు త్వం మద్యంమీద నిఘా పెట్టింది. ఇది కూడా బాబుకి పెద్ద మైనస్.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం ॥ 14-3-2020

వాసంశెట్టి మాధవి

'జరిగిందంతా నాతో చెప్పడం మీకు ఇబ్బందిగా ఉంటే మా లేడీ కానిస్టేబుల్‌తో షేర్ చేసుకోవచ్చు' అని చెప్తాడు లైంగిక బాధితురాలితో ఒక ఎస్సై. కోర్టులో ... ఆ అమ్మాయిని ఇబ్బంది పెట్టేలా డిఫెన్స్ లాయర్ ప్రశ్నలు అడుగుతూంటే.. 'బాధితురాలు స్త్రీ.. కాస్త సున్నితంగా డీల్ చేయండి' అంటూ అడ్డుపడుతుంది పబ్లిక్ ప్రాసిక్యూటర్. 'సెక్షన్ 375' సినిమాలోని దృశ్యాలవి. నిజంగా కూడా పోలీస్ శాఖ, జ్యుడీషియరీలోనూ ఇలా ఆలోచించే వాళ్లుంటే బాగుండు అనిపిస్తుంది. లేరు అనడానిక్కూడా లేదు.. ఉన్నారు. కొంత మంది. వాళ్లలో వాసంశెట్టి మాధవి ఒకరు. తెలంగాణ, కరీంనగర్ జిల్లా, హుజురాబాద్‌లో సీఐగా పనిచేస్తున్నారు.

షీ ఐ మాధవి

నా 23 ఏళ్ల సర్వీస్‌లో ఎన్నడూ పశ్చాత్తాప పడ్డ సందర్భాలు లేవు. కేవలం పొట్టకూటి కోసమే ఈ ఉద్యోగంలో చేరా. డిగ్రీ అయిపోయాక బీఈడీ చేయాలనుకుంటున్నప్పుడు అప్పటికే ఎస్ఐ పోస్ట్ కోసం ప్రిపేర్ అవుతున్న మా అన్నయ్య.. 'బీఈడీ అంటే ఇంకా రెండేళ్లు పడుతుంది. నా మాట విని ఎస్.ఐ. పోస్ట్'కి అప్లయ్ చెయ్' అంటూ ఎంకరేజ్ చేశాడు. అలా అన్నయ్య, నేను ఇద్దరం ఒకే బ్యాచ్‌లో ట్రైన్ అయ్యాం. ఉద్యోగంలో చేరినప్పటినుంచి నా పనికి న్యాయం చేసుకుంటూ పోతున్నా' అని చెప్పారు మాధవి.

ఆ మూడు కేసులు..

' పదేళ్ల కిందట 26 ఏళ్ల యువతి మీద 45 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడి చేశాడు. అప్పుడు నేను ఆ జ్యూరిస్ డిక్షన్‌లో లేను. పదేళ్ల తర్వాత అంటే ఇటీవలే ఆ కేస్ ట్రయల్స్‌కు వచ్చింది. ఇప్పుడది నా జ్యూరిస్ డిక్షన్. అయితే లైంగిక దాడి తర్వాత ఆ అమ్మాయి మానసికంగా, శారీరకంగా చాలా కుంగిపోయింది. జరిగిన సంఘటన అటుంచి, ఎవరినీ గుర్తుపట్టే స్థితిలో కూడా లేదు. ఆమెకు మానసిక చికిత్స అవసరమని, మానసికంగా కుదుట పడ్డాకే ట్రయల్స్ మొదలుపెట్టాలని కోర్టు నుంచి ప్రత్యేక అనుమతి తీసుకున్నాను. మూడు నెలల తర్వాత ఆమె కుదుట పడ్డాకే.. ట్రయల్స్‌కు వెళ్లాం. ఇక్కడ ఇంకో చిక్కు వచ్చిపడింది. నేను ఎదురుగా ఉంటేనే ధైర్యంగా మాట్లాడేది. నన్నూ అనుమతించమని కోరును అభ్యర్థించి మరీ ఆమెకు అండగా నిలబడ్డాను. ఈ ప్రయత్నాలతో ఆమె తన మీద దాష్టీకం చేసిన వ్యక్తిని గుర్తుపట్టి.. జరిగిందంతా కోర్టుకు వివరించింది. ఆ నేరస్తుడికి పదేళ్లు శిక్ష పడింది. వైవాహిక జీవితానికి సంబంధించిన సమస్యలనూ డీల్ చేసాను. సామాన్యుల నుంచి సమాజంలో పేరున్నవాళ్ల దాకా, కొత్త పెళ్లిజంటల నుంచి 40 ఏళ్లు కాపురం చేసిన వాళ్లదాకా ఎందరికో కౌన్సెలింగ్స్ ఇచ్చాను. పోలీస్‌స్టేషన్‌కు రావడం ఇష్టంలేని వాళ్ల ఇళ్లకు సివిల్ డ్రెస్‌లో వెళ్లి మరీ కౌన్సెలింగ్ చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఆస్తి లాక్కొని తిండి పెట్టక అమ్మానాన్నలను కష్టపెడ్తున్న పిల్లలనూ పిలిచి మాట్లాడి పెద్దవాళ్లకు పరిష్కారం చూపించిన కేసులు ఎన్నో. ఇలాంటి పట్టణాల్లో అంతగా కనపడవు కాని పల్లెల్లో అన్నీ అవే. రోజుకు ఒక్కటైనా వస్తుంది అలాంటి కేసు.

సవాళ్లు?

నేనైతే పెద్దగా ఎదుర్కోలేదు. అలాగని డిస్క్రిమినేషన్‌కు ఈ ఫీల్డేమీ మినహాయింపు కాదు. పనికి జెండర్ ఉండదు, ఏ టాస్క్‌కైనా నేను సిద్ధమే అని నిరూపించుకోవడానికి, ఆ కాన్ఫిడెన్స్‌ను బిల్డప్ చేయడానికి ఎంత కష్టపడ్డానో ఆ దేవుడికే తెలుసు. మహిళలమని మనకు మనమే రిజర్వేషన్స్‌పెట్టుకుంటే అవతలి వాళ్లు మనల్ని ఈక్వల్‌గా చూడరు అని నా ఉద్దేశం. మన పనితీరే మనకు గౌరవాన్ని, గుర్తింపునిస్తుంది. నేను జాయిన్ అయిన కొత్తలో మగవాళ్లు ఎవరైనా 'మాధవి ..లేడీ ఇన్‌స్పెక్టర్ అని పిలిస్తే 'ఇన్‌స్పెక్టర్ అంటే ఇన్‌స్పెక్టర్... అంతే.. మగ, ఆడ అని ఉండదు కదా అని వాదించి వారికి వారికి నచ్చజెప్పేదాన్ని.

విమెన్ ఫ్రెండ్లీ పోలీస్...

మొన్న తొమ్మిదేళ్ల పాప మీద లైంగిక దాడి జరిగింది. సివిల్ డ్రెస్‌లో వెళ్లి.. ఓపిగ్గా ఆ పాపతో మాట్లాడితే విషయమంతా చెప్పింది. బహుశా నాలో వాళ్ల అమ్మనో.. అత్తనో.. పిన్నినో చూసుకొని ఉంటుంది. అదే నా స్థానంలో మేల్ ఆఫీసర్ ఉండుంటే ఆ పాప భయంతో బిగుసుకుపోయేదేమో! న్యాయం జరిగినా, జరగకపోయినా బాధితులు మహిళలే. ఈ నిజాన్ని గ్రహించేది, అర్థం చేసుకునేదీ మహిళలే. ఇన్‌స్టంట్‌గా న్యాయం అందించే అవకాశమూ ఉంటుంది. అందుకే పోలీస్‌డిపార్ట్‌మెంట్‌లోకి ఎంత వీలైతే అంత ఎక్కువ మంది మహిళలు రావాలి. బీటెక్‌లు చదివి ఏ కాల్ సెంటర్‌లోనో పదివేలకు ఉద్యోగం చేసేకంటే పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి వస్తే.. గౌరవానికి గౌరవం, సాటి మహిళల తరపున ఉన్నామనే గర్వం రెండూ మిగులుతాయి. తల్లిదండ్రులకు నేను రిక్వెస్ట్ చేసేది ఒకటే.. మీ ఆడపిల్లలను పోలీస్ జాబ్స్‌కి ఎంకరేజ్ చేయండి. భయపడాల్సిందేమీ లేదు. మీ అమ్మాయి ధైర్యంగా ఉండడమే కాక పది మంది అమ్మాయిలకూ ధైర్యాన్నివ్వగలదు.

దిశ తర్వాత మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా చేపట్టిన కార్యక్రమాలు..

ప్రత్యేకంగా ఏమీ చేపట్టలేదు కాని డయల్ 100 మీద విస్తృత ప్రచారం మాత్రం చేశాం.. చేస్తున్నాం. మహిళల నుంచి వచ్చిన, వస్తున్న స్పందన చూస్తుంటే ఆనందం, ఆశ్చర్యం రెండూ కలుగుతున్నాయి. తన కొడుకు స్కూల్‌కి వెళ్లకుండా మారాం చేస్తున్నాడు కాస్త వచ్చి పిల్లాడిని బుజ్జగించండి అని ఒక అమ్మ, తొమ్మిది నెలల నిండుతున్నా డెలివరీకి తల్లిగారింటికి పంపించట్లేదు.. కొంచెం మీరొచ్చి మా అత్తగారికి కౌన్సెలింగ్ ఇవ్వరా అంటూ ఓ గర్భిణీ కాల్ చేశారు. సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలన్న అవగాహనైతే వచ్చింది అది చాలు'' అని సంతోషపడుతున్నారు మాధవి.

– సరస్వతి రమ

ఫొటోలు .. అల్లె నరేందర్, సాక్షి, హుజురాబాద్

ఫ్యామిలీ ఫంక్షన్స్‌కు, పేరంటాలు, పెళ్లిళ్లకూ అందునా చీరలు కట్టుకుని అటెండ్ అయ్యే వీలు చాలా తక్కువ. పట్టుచీరలు కట్టుకొని ఆ ఫంక్షన్స్‌కు అటెండ్ అయిన మహిళలను చూసి 'అయ్యో.. నాలా యూనిఫామ్ వేసుకునే చాన్స్ వీళ్లకు లేదే' అనుకుంటా.. నా యూనిఫామ్ పట్ల గౌరవం, నా పట్ల నాకు గర్వంగా అనిపిస్తుంది.

అమ్మాయిలు భద్రంగా ఉండాలంటే మగ పిల్లల ఆలోచనలు ఆరోగ్యంగా ఉండాలి. అమ్మను, తోబుట్టువులను గౌరవించడం మగపిల్లలకు నేర్పించాలి. దీని బాధ్యత పేరెంట్స్, టీచర్స్‌దే. పిల్లలకు చదువొక్కటే కాదు లోకజ్ఞానమూ కావాలి. పాఠ్యపుస్తకాలతోపాటు ఇతర పుస్తకాలు, పేపర్ రీడింగ్ పిల్లలకు అలవాటు చేయాలి. వార్తలను టీవీల్లో, సోషల్ మీడియాలో ఫాలో అవడం కాదు కచ్చితంగా పత్రికలనే చదివేలా చూడాలి. పేపర్ అనే ఎందుకంటున్నానంటే.. పేపర్‌కున్న విశ్వసనీయత ఒక కారణమైతే.. అది చదివినప్పుడు మనలో ఒక రియాక్షన్ ఉంటుంది. అది ఇంకో కారణం.

కుటుంబ నేపథ్యం..

మేం ఆరుగురం అక్కచెల్లెళ్లం, మాకు ఇద్దరన్నదమ్ములు. మా నాన్నదీ పోలీస్ ఉద్యోగమే. నా పదేళ్లప్పుడే మా అమ్మ చనిపోయింది. అప్పటి నుంచి అక్కాచెల్లెళ్లమే ఇంటి బాధ్యతలను చూసుకునేవాళ్లం. మా అక్కచెల్లెళ్లం మా అత్తగారింటి వాళ్లకు చెప్పిన మాటొక్కటే..'మా అమ్మ బతికుంటే ఒకటే అమ్మ ఉండేది.. కాని ఇప్పుడు మాకు మేం ఆరుగురం అమ్మలమే' అని. అందుకే ఇంట్లో ఆడపిల్ల పుట్టింది అంటే గర్వపడండి. బాగా చదివించండి.. స్వశక్తి మీద నిలబడేలా పెంచండి. నా కుటుంబానికి వస్తే మా వారు మహేష్ బాబు కూడా ఇన్‌స్పెక్టరే. ఇద్దరు అబ్బాయిలు రుషి ఫణీంద్ర, మీరజ్ చంద్ర. నేను ఈ రోజు ఈ ఉద్యోగం హాయిగా చేసుకోగలుతున్నానంటే మా అత్తగారి సహకారం వల్లే.


కుటుంబ సభ్యులతో మాధవి

ఉమన్ వే

విమానాలకు కొత్తదారి

విమానం సాఫీగా పైకి లేవాలన్నా, సురక్షితంగా కిందికి దిగాలన్నా రన్‌వే బాగుండాలి. కొచ్చి, అంతర్జాతీయ విమానాశ్రయంలో.. మరమ్మతులు అవసరమైన స్థితిలో ఉన్న రన్‌వే పైనే గత నవంబర్ ముందు వరకు విమానాల రాకపోకలు జరుగుతుండేవి. రీ-కార్పెటింగ్‌కి (మరమ్మతులకు) నిపుణులైన ఇంజినీర్ల కోసం సి.ఐ.ఎ.ఎల్ (కొచ్చి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్) తన ఇంజినీరింగ్ విభాగంలోని సిబ్బందిలోంచి పెద్ద వడపోతనే పోయవలసి వచ్చింది. చివరికి ఎనిమిది మంది ఇంజినీర్లను, వాళ్లకు సహాయంగా 20 మంది అప్రెంటీస్‌లను ఎంపిక చేసుకుంది. విశేషం ఏంటంటే.. వాళ్లంతా కూడా మహిళలే!

విమానం టేకాఫ్‌కి, ల్యాండింగ్‌కీ ఎలాగైతే మంచి రన్‌వే ఉండాలో, రన్‌వే రీ-కార్పెటింగ్ పనిని పరుగులు తీయించే బృందం అవసరమని భావించిన సి.ఐ.ఎ.ఎల్. మహిళా ఇంజినీర్ల వైపే మొగ్గు చూపింది. సి.ఐ.ఎ.ఎల్. సివిల్ ఇంజినీరింగ్ విభాగం జనరల్ మేనేజర్ బినీ టి.ఐ., అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌లు టి.పి.ఉషాదేవి, మినీ జాకబ్, జూనియర్ మేనేజర్‌లు పూజా టి.ఎస్., త్రీసా వర్గీస్, సీనియర్ సూపరింటెండెంట్‌లు పి.పి.శ్రీకళ, ఇ.వి. జెస్సీ, జిన్సీ ఎం పాల్.. ఈ ఎనిమిది మంది పర్యవేణలో, వారికి సహాయంగా ఉన్న ఇరవై మంది ట్రెయినీ ఇంజినీర్‌లతో గత ఏడాది నవంబర్ 20 న ప్రారంభమైన రీ-కార్పెటింగ్ పనులు తొలి రోజు నుంచే వేగంగా జరుగుతున్నాయి! ముందు అనుకున్న ప్రకారం ఈ నెల 29 కి రన్‌వే సిద్ధం అవాలి. అయితే ఈ మహిళా ఇంజనీర్ల అంకితభావం, దీక్ష చూస్తుంటే ఆలోపే రన్‌వే మా చేతికి వచ్చేలా ఉందని సి.ఐ.ఎ.ఎల్. అధికారులు ప్రశంసాపూర్వకంగా అంటున్నారు.

'మిక్స్' ప్లాంట్‌కూ వెళతారు

రన్‌వే కార్పెటింగ్ రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతోంది. ఆ సమయంలో విమానాశ్రయాన్ని మూసి ఉంచుతున్నారు. 200 మంది పనివాళ్లు ఉంటారు. పనిని కాంట్రాక్టుకు తీసుకున్న సంస్థల వాహనాలు ఓ 50 వరకు వచ్చిపోతుంటాయి. 60 మీటర్ల వెడల్పు, 3,400 మీటర్ల పొడవున రీకార్పెటింగ్ పని జరుగుతూ ఉంటుంది. రన్‌వేపై దిగాక విమానాల కదలికలకు వీలు కల్పించే ఐదు 'టాక్సీవే'ల పునఃనిర్మాణం కూడా ఏకకాలంలో అవుతోంది. వీటన్నిటికీ కావలసిన కంకర కోసం ఈ మహిళా ఇంజినీరింగ్ టీమ్ ఎప్పటికప్పుడు క్వారీలకు వెళ్లి నాణ్యతను పరీక్షిస్తోంది. తారును మిక్స్ చేసే ప్లాంట్‌కూ వెళుతుంది. మెటీరియల్ ఎంత వస్తున్నదీ, ఎంత మిగిలి ఉన్నదీ, అవసరానికి తగ్గట్టుగా కొనుగోలు చేసిన మెటీరియల్ పూర్తిగా వినియోగం అవుతున్నదీ లేనిదీ వీరు పరిశీలిస్తారు. అంటే పని మొత్తం పూర్తిగా వీరి కనుసన్నల్లోనే నడుస్తుంది. రోజుకు 1500 టన్నుల తారు-కంకర కలుపు (మిక్సింగ్) విమానాశ్రయానికి చేరుకుంటుంది. అయితే అది సమయానికి చేరడం ముఖ్యం. సాయంత్రం 6 తర్వాత వస్తే ఇక ఆ రోజు పనికి వీలు పడనట్లే. అందుకే ప్రతిదీ ఒక పద్ధతితో, ప్రణాళిక ప్రకారం అయ్యేలా శ్రద్ధ తీసుకుంటున్నారు బినీ, ఆమె బృందం.

చిన్న తేడా రానివ్వరు

మిక్సింగ్ ప్లాంట్ పని రోజూ తెల్లవారు జామునే 3 గంటలకు మొదలౌతుంది. ఉదయం 10 కల్లా విమానాశ్రయానికి 'మిక్స్'ను మోసుకొచ్చేస్తాయి బండ్లు. సాయంత్రం 6 గంటలకు తొలి విమానం దిగేలోపే ఆవేళ్టి పని పూర్తి చేసేస్తారు. రీకార్పెటింగ్ ఒకసారి అయిపోయే పని కాదు. మిక్స్‌ని రెండు పూతలుగా (లేయర్లు) వేస్తారు. మొదటి పూత ఏడు సెంటీమీటర్ల మందంలో, దాని పైన వేసే రెండో పూత ఐదు సెంటీమీటర్ల మందంలో ఉంటుంది. పాత లెక్కలకు, కొత్త లెక్కలకు తేడాలు వచ్చాయంటే విమానం ల్యాండింగ్ ప్రమాదంలో పడినట్లే. ఇంత సూక్ష్మంగా, జాగ్రత్తగా అన్నీ సరి పోల్చుకుంటూ రోజుకు 150 మీటర్లు చొప్పున రన్‌వే రీ-కార్పెటింగ్ చేయిస్తున్నారు ఈ మహిళా ఇంజినీర్‌లు.

ముందు అనుకున్న ప్రకారం ఈ నెల 29 కి రన్‌వే సిద్ధం అవాలి. అయితే ఈ మహిళా ఇంజనీర్ల అంకితభావం, దీక్ష చూస్తుంటే ఆలోపే రన్‌వే మా చేతికి వచ్చేలా ఉందని సి.ఐ.ఎ.ఎల్. అధికారులు ప్రశంసాపూర్వకంగా అంటున్నారు.

రేపటి 'ఫన్‌డే'లో..!

భూభ్రమణాన్ని ఆపినవాడు!

ఫాదరింగే అందరిలాంటోడు కాదు. అతనిలో ఎన్నో అతీంద్రియశక్తులు ఉన్నాయి. ఫాదరింగేలో దాగిన శక్తుల పరిధి ఎంతవరకుందోనని ఎవరైనా చిన్న చిన్న ప్రయోగాలు చేయిస్తే, ఫాదరింగే వాటిని సులభంగా చేసి చూపించాడు. మేడింగ్ అనే పండితుడు ఫాదరింగేతో అన్నిటికన్నా గొప్ప అద్భుతం ఏదైనా చేయించాలనుకున్నాడు.

ఓరోజు ఆకాశంలోని చంద్రుణ్ణి చూపించి ''చంద్రుణ్ణి ఆపేయ్ చూద్దాం'' అన్నాడు.

''అబ్బా! అది మరీ దురాశ. నాలోని శక్తి అంతవరకు చేరగలదా?'' అని అనుమానపడ్డాడు ఫాదరింగే.

''అయితే మనం నివసించే ఈ భూగోళాన్ని శాసించు. భూభ్రమణాన్ని ఆపు'' అని అడిగాడు మేడింగ్.

తన కాళ్ళ కింద ఉన్న భూమిని చూసి సాదరంగా మనసులో ప్రార్థించాడు ఫాదరింగే...

''అమ్మా! భూదేవీ! ఒక్కసారి నీ భ్రమణాన్ని ఆపు తల్లీ!'' అన్నాడు.

అంతే-మరుక్షణంలో ఫాదరింగే గాల్లో లేచి ఎగరసాగాడు. క్షణానికి పది, పన్నెండు మైళ్ల వేగంతో ముందుకు పోసాగాడు...

ఆ తరువాత ఏమైందంటే....

ప్రసిద్ధ రచయిత హెచ్.జి.వెల్స్ కథ 'అతీంద్రియ శక్తి'లో చదవండి.

ఇంకా... కార్పొరేట్ కథానాయకులు (ముఖచిత్రకథనం), వర్క్ ఏదైనా...(బ్యూటీజర్), మాంచి మల్లీ కుక్కర్ (కొత్త కొత్తగా), స్వీట్ కార్న్ కేక్, డేట్స్ శాండ్‌విచ్ (స్నాక్ సెంటర్), రుక్మిణీ పరిణయం (పురానీతి), కల్లమాటలే పలకొద్దు...(నిండు హృదయాలు సినిమాలోని పాటతత్వం – అలనాటి బాలనటుడు విశ్వేశ్వరరావు మాటల్లో), ఒంటరి పిచ్చుక (రీడర్స్ పేజీ), అగ్రిమెంట్ (క్రైంకథ), ఆ ప్రభావం.. (సందేహం), పరామర్శ (సరికొత్త పుస్తకాల పరిచయం), కరోనా కరోనా... (లాఫింగ్ గ్యాస్), పసందైన కార్టూన్లు, మెదడుకు పదును పెట్టే పదశోధన, పదవినోదం, సుడోకు... ఇంకా మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి ఫన్‌డేలో చదవండి.

ప్రియాంక

శివ సైనిక

చదువు కళ ఉన్న ముఖం తెలిసిపోతుంది. ప్రియాంక చతుర్వేది అలాంటి కళే కలిగిన నాయకురాలు. రాజ్యసభ అభ్యర్థిగా ప్రియాంకను నామినేట్ చేస్తున్నట్లు శివసేన ప్రకటించగానే పార్టీలోని అనేక ముఖాలు కళావిహీనం అయ్యాయి. అయితే శివసేన ప్రియాంకను రాజ్యసభకు పంపించాలని నిశ్చయించుకోడానికి తగిన కారణమే ఉంది.

ప్రియాంక చక్కటి ఇంగ్లిష్ మాట్లాడతారు. హిందీ కూడా బాగా వచ్చు. ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చి మహారాష్ట్రలో స్థిరపడిన కుటుంబం కనుక మరాఠీ కూడా కొట్టిన పిండే. మహారాష్ట్రలో ఉండేవారంతా మరాఠీలోనే మాట్లాడాలని శివసేన అంటున్నా.. రాజ్యసభలో మాత్రం తన స్వరం వినిపించడానికి ఆ పార్టీకి ఇంగ్లిష్, హిందీ తప్పనిసరి అవుతోంది. అందుకే ప్రియాంకను ఎంచుకుంది. ప్రియాంక గత ఏడాది ఏప్రిల్ వరకు కాంగ్రెస్‌లోనే ఉన్నారు. 2010 లో పార్టీలో చేరి, రెండేళ్లలోనే నార్త్-వెస్ట్ ముంబై జాతీయ యువజన కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శి కూడా అయ్యారు. అయితే ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో కొందరు ఆమెతో అమర్యాదగా ప్రవర్తించినప్పుడు.. వారిని పార్టీనుంచి బయటికి పంపించిన కాంగ్రెస్.. ఆ తర్వాత కొద్ది రోజులకే వాళ్లను వెనక్కు తీసుకోవడంతో ఆగ్రహించి పార్టీ నుంచి బయటికి వచ్చేశారు. వచ్చిన రెండో రోజే శివసేనలో చేరిపోయారు. 'పార్టీలో నేను మామూలు శివసైనికురాలిగా ఉంటాను' అని ఆమె అన్నారు కానీ, ఠాక్రేనే.. సైనిక దళానికి ఒక నేతగా ఉండమని కోరారు. ఇప్పుడు రాజ్యసభకు పంపిస్తున్నారు.

ప్రియాంక జన్మస్థలం ఉత్తర ప్రదేశ్. పెరిగిందీ, చదువుకున్నదీ ముంబైలో. జూహూలోని సెట్ జోసెఫ్స్ హైస్కూల్‌లో చదివారు. విలేపార్లే లోని నర్సీ మోంజీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనమిక్స్‌లో కామర్స్ డిగ్రీ చేశారు. తర్వాత పెళ్లి, ఇద్దరు పిల్లలు. రాజకీయాల్లోకి రాక ముందు, వచ్చాక కూడా మంచి కాలమిస్టుగానే ఆమెకు పేరు. బాగా రాస్తారు, రాసినంత బాగా మాట్లాడతారు. 'తెహల్కా', 'డైలీ న్యూస్ అనాలిసిస్', 'ఫస్ట్‌పోస్ట్'.. వీటికి వ్యాసాలు రాశారు. రెండు మూడు ఎన్జీవోలకు ధర్మకర్త కూడా. బాలల విద్య, స్త్రీ సాధికారత, స్త్రీ ఆరోగ్యం.. ఇవీ.. వ్యాసకర్తగా, సామాజిక కర్యకర్తగా ఆమె స్వీకరించిన బాధ్యతలు. ఏ ప్రభుత్వమైనా మొదట స్త్రీ శిశు సంక్షేమం కోసం పని చేయాలని ప్రియాంక అంటారు. అప్పుడు అభివృద్ధి దానంతటే వస్తుందని చెబుతారు. ముంబైలో 'ఎంపవర్ కన్సల్టెంట్స్' అని.. మీడియా, పి.ఆర్. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఒకటి ఉంది. డిగ్రీ అయిపోగానే ఆ కంపెనీ డైరెక్టర్‌గా చేరారు ప్రియాంక. ముంబైలోనే 'ప్రయాస్ చారిటబుల్ ట్రస్ట్' అనే సంస్థ ఉంది. ఆ సంస్థ ఆధ్వర్యంలో రెండు పాఠశాలు ఉన్నాయి. స్థోమత లేని 200 మంది పిల్లలకు ఆ పాఠశాలల్లో ఉచిత విద్య లభిస్తోంది. ఆ సంస్థకు కూడా ట్రస్టీగా ఉన్నారు ప్రియాంక. మోదీ అంటే ఆమెకు పడదు. ఇక చూడాలి.. ఈ శివసైనికురాలు రాజ్యసభలో మోదీ సైన్యాన్ని తన వాక్పటిమతో, సామాజికాంశాలలో తనకున్న పరిజ్ఞానంతో ఎలా అదరగొట్టి, బెదరగొట్టి దారికి తెస్తారో!

ప్రియాంక చతుర్వేది, శివసేన పార్టీ



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
14-3-2020

ముల్లు తీయండి

ఏటిలోన చేపలంట.
ఎగిరెగిరి దూకెనంట.
దూకి ఎక్కడ పడతాయ్?
గిన్నెలో పడతాయ్!
ఆ తర్వాత...
కంచంలో పడతాయ్.
చేపలు సులభ ఆహారం.
శక్తినిచ్చే ఆహారం.
బుద్ధి పెంచే ఆహారం.
బెంగాలీలు కంగాళీ
లేకుండా ఉంటారంటే
చేపలు తినడం వల్లే అంటారు.
మనకు బంగాళాఖాతం
తీరమే ఉంది.
నదులకు కొదవేముంది?
నిండా చేపలు...
కోరిన కూరలు.
ఈ ఆదివారం
ఫిష్ మార్కెట్‌కు వెళ్లండి.
ముక్కల్ని చక్కని
కూరల్లా మలచండి.
ముల్లు తీసి లాగించండి.

అమృత్‌సర్ మచ్చి

కావల్సినవి: వంజరం చేప గుండ్రటి ముక్కలు – 600 గ్రా.లు; శనగపిండి – కప్పు; కారం – టేబుల్ స్పూన్; వాము (ఓమ) – టీ స్పూన్; అల్లం ముద్ద – 2 టేబుల్ స్పూన్లు; వెల్లుల్లి ముద్ద – 2 టేబుల్ స్పూన్లు; నిమ్మరం – టేబుల్ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత; గుడ్డు – 1; చాట్ మసాలా – టీ స్పూన్ ; నిమ్మ ముక్కలు (చక్రాల్లా కోసినవి) – 2.

తయారీ: ● బాగా కడిగిన చేప ముక్కలు ఒక గిన్నెలో వేసి, అందులో కారం, ఉప్పు, వాము, అల్లం, వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, శనగపిండి వేసి కలిపి పక్కనుంచాలి. కడాయిలో నూనె పోసి కాగనివ్వాలి ● మరొక గిన్నెలో గుడ్డు సొన వేసి, కలిపి, చేప ముక్కలను అందులో ముంచి కాగిన నూనెలో వేసి రెండువైపులా గోధుమ రంగులోకి మారేంతవరకు వేయించుకోవాలి ● పేపర్‌నాపికిన్ (అబ్‌సార్బెంట్ పేపర్) మీద వేయించుకున్న ముక్కలు వేయాలి. ఇలా చేస్తే అదనపు నూనె పేపర్ పీల్చుకుంటుంది. వడ్డించే ముందు వీటిని మరోసారి వేయించి, వెంటనే అందిస్తే చేప ముక్కలు కరకరలాడుతూ బాగుంటాయి ● చేప ముక్కలను వేసే ప్లేట్ అడుగున అబ్‌సార్బెంట్ పేపర్ వేసి, ముక్కల పైన చాట్ మసాలా చల్లి, కట్ చేసుకున్న నిమ్మముక్కలతో అలంకరించాలి.

పుల్లగా తినండి

గోదావరి చేపల పులుసు

కావల్సినవి: కొరమీను చేప – కేజీ (మీడియమ్ సైజులో ముక్కలు చేయాలి); చింతపండు – 150 గ్రా.లు (నీళ్లలో నానబెట్టి రసం తీయాలి); టొమాటోలు – పావుకేజీ (ముక్కలుగా కట్ చేయాలి); ఉల్లిపాయలు – పావుకేజీ (సన్నగా తరగాలి); పచ్చిమిర్చి – 5 (నిలువుగా చీరాలి); మెంతులు – 2 టీ స్పూన్లు; ఆవాలు – టీ స్పూన్; కారం – తగినంత; ఉప్పు – తగినంత; ధనియాల పొడి – 2 టీ స్పూన్లు; ఎండుకొబ్బరి – 2 టీ స్పూన్లు; కొత్తిమీర – కొద్దిగా; నూనె – తగినంత.

తయారీ: ● వెడల్పాటి పాన్‌లో నూనె వేసి కాగాక మెంతులు, ఆవాలు వేయించి ఉల్లిపాయలు, టొమాటో ముక్కలు, పచ్చిమిర్చి చీలికలు వేసి కలపాలి. అల్లం–వెల్లుల్లి పేస్ట్ వేగాక సరిపడా కారం, చింతపులుసు, ఉప్పు కలిపి ఉడికించాలి ● రసం చిక్కబడ్డాక చేప ముక్కలు వేసి మూత పెట్టాలి ● 5 నిమిషాల తర్వాత మూత తీసి కొత్తిమీర చల్లి దించాలి ● గరిటెతో కలిపితే ముక్కలు విరిగిపోతాయి కనుక జాగ్రత్తగా తీసుకోవాలి.

నిర్వహణ: ఆరెన్నార్

చేప ఆవకాయ

కావల్సినవి: ఆవకాయ – 100 గ్రా.లు; చేప ముక్కలు (ముల్లు తీసినవి) – 200 గ్రా.లు; నూనె – వేయించడానికి తగినంత; మైదా – కప్పు; మొక్కజొన్న పిండి – కప్పు; ఉప్పు – తగినంత; కారం – టీ స్పూన్; మిరియాల పొడి – టీ స్పూన్; కొత్తిమీర తరుగు – 2 టీ స్పూన్లు; పచ్చిమిర్చి – 4; అల్లం–వెల్లుల్లి ముద్ద– టీ స్పూన్; అల్లం–వెలుల్లి తరుగు– 2 టేబుల్ స్పూన్లు; గుడ్డు – 1; ఉల్లిపాయ – 1 (సన్నగా తరగాలి).

తయారీ: ● ముందుగా చేపలను శుభ్రం చేసి, ఒక గిన్నెలో వేసి అందులో గుడ్డు సొన, ఉప్పు, మిరియాలపొడి, కారం, అల్లం–వెల్లుల్లి ముద్ద, మైదా, మొక్కజొన్న పిండి వేసి బాగా కలపాలి. ● కడాయిలో నూనె పోసి కాగాక ఈ చేప ముక్కలను పకోడీల మాదిరి వేయించి తీసి పక్కన పెట్టాలి ● తరువాత మరో కడాయిలో 2 టేబుల్ స్పూన్ల నూనె వేసి అల్లం–వెల్లుల్లి తరుగు, ఉల్లిపాయ తరుగు, పచ్చిమిర్చి, కరివేపాకు, ఆవకాయ వేసి కలపాలి ● దీంట్లో వేయించిన చేప ముక్కలను వేసి బాగా కలపాలి. తరువాత కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేయాలి.

చేపల వేపుడు

కావల్సినవి: చేప ముక్కలు – 6; కారం – అర టీ స్పూన్; మొక్కజొన్న పిండి – టీ స్పూన్; ఉప్పు – తగినంత; నిమ్మ రసం – అర టీ స్పూన్; గుడ్డు – 1; ఉల్లిపాయలు – 1 (సన్నగా తరగాలి); నూనె – తగినంత; ధనియాల పొడి – టీ స్పూన్; గరం మసాలా – అర టీ స్పూన్; అల్లం–వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; కొత్తి మీర – టీ స్పూన్.

తయారీ: ● గిన్నెలో చేప ముక్కలు వేసి కారం, మొక్కజొన్నపిండి, ఉప్పు, నిమ్మ రసం, గుడ్డు, ధనియాల పొడి, అర టీ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, నిమ్మరసం వేసి కలిపి అరగంట పక్క నుంచాలి ● కడాయిలో నూనె వేసి కాగాక జీలకర్ర, ఉల్లిపాయలు వేయించాలి. ● అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు కరివేపాకు వేసి కలిపి తర్వాత చేప ముక్కలు వేసి వేయించాలి ● తర్వాత కొత్తి మీర చల్లి దించాలి.

ఫిష్ బిర్యానీ

కావల్సినవి: చేపముక్కలు – అర కేజీ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్; కారం – అర టీ స్పూన్; బిర్యానీ మసాలా/ గరం మసాలా – అర టీ స్పూన్; పసుపు – కొద్దిగ; నిమ్మరసం – ఒక టిన్నర టేబుల్ స్పూన్; ఉప్పు – తగినంత; టొమాటో – 1; ఇతర పదార్థాలు; బిర్యానీ ఆకు – 1 ; బిర్యానీ పువ్వు – 2 ; దాల్చిన చెక్క – చిన్న ముక్క; లవంగాలు – 6; పచ్చ యాలకులు – 3; సాజీరా – అర టీ స్పూన్.

గ్రేవీ కోసం: నూనె – 3 టేబుల్ స్పూన్లు; ఉల్లిపాయల స్లైసులు – కప్పు; అల్లం –వెల్లుల్లి పేస్ట్ – ఒకటిన్నర కప్పు; గరం మసాలా పొడి – టీ స్పూన్; ధనియాల పొడి – అర టీ స్పూన్; కారం – అర టీ స్పూన్; పెరుగు – కప్పు; పుదీనా తరుగు – 2 టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్లు; కుంకుమపువ్వు – తగినంత; పాలు – 2 టేబుల్ స్పూన్లు; ఉప్పు – తగినంత;

బిర్యానీ రైస్: బాస్మతి బియ్యం – 1 1/2 కప్పు; ఉప్పు – తగినంత; నూనె – 1 టీ స్పూన్.

తయారీ: ● చేపలు కాకుండా మిగతా పదార్థాలన్నీ ఒక పాత్రలో వేసి కలిపి పక్కన ఉంచాలి. ఉప్పు, కారం సరిపోయిందో లేదో చెక్ చేసుకోవాలి. దీంట్లో చేప ముక్కలు వేసి కలపాలి ● విడిగా గోరువెచ్చని పాలలో కుంకుమ పువ్వు వేసి కలిపి పక్కనుంచాలి ● బాస్మతి బియ్యం కడిగి అరగంట నీళ్లలో నానబెట్టాలి. తర్వాత జల్లెడలో పోసి వడకట్టాలి ● ఒక గిన్నెలో 6 కప్పుల నీళ్లు పోసి టీ స్పూన్ నూనె, ఉప్పు వేసి పొయ్యి మీద పెట్టి మరిగించాలి ● వడకట్టిన బియ్యం మరుగుతున్న నీళ్లలో వేసి ఉడికించాలి. అయితే, ఆఫ్ బాయిల్ కాగానే వడకట్టి పక్కనుంచాలి. మరొక గిన్నెలో కొద్దిగా నూనె వేసి చేప ముక్కలను రెండు వైపులా బంగారు రంగు వచ్చేలా వేయించి తీయాలి ● దాంట్లోనే మరికొద్దిగ నూనె వేసి ఉల్లిపాయల తరుగు వేసి వేయించాలి. ● దాంట్లోనే మిగతా అన్ని దినుసులు వేసి కొద్దిగా వేయించాలి ● అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాక టొమాటో ముక్కలు ఉడికించాలి. గరం మసాలా, ధనియాలపొడి, కారం వేసి వేగాక పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమం చిక్కబడేలా ఉడికించాలి. ● ఒక మందపాటి పెద్ద గిన్నెలో అడుగున కొద్దిగా గ్రేవీని ఒక లేయర్‌గా వేయాలి. దాని మీద సగం ఉడికిన అన్నాన్ని మరొక లేయర్‌గా వేసి ఆ పైన పుదీనా, కొత్తిమీర చల్లాలి. ఆ పైన వేయించిన చేప ముక్కలు కొన్ని ఉంచాలి. వాటి మీదుగా మళ్లీ అన్నం.. దాని మీద కొత్తిమీర–పుదీన– ఉల్లిపాయలు, కుంకుమ పువ్వు పాలు.. ఆ పైన మళ్లీ చేప ముక్కలు.. ఆ పైన అన్నం.. ఇలా అన్ని లేయర్లు పూర్తి చేయాలి. ● గిన్నె పైన మందపాటి మూత పెట్టి గోధుమపిండి ముద్దతో సీల్ చేయాలి. మంట పెంచి 2 నిమిషాలు ఆ తర్వాత మంట బాగా తగ్గించి 10 నుంచి 15 నిముషాలు ఉంచాలి ● మంట ఆర్పేసి మరో పది నిమిషాలు ఉంచి మూత తీయాలి. వడ్డించడానికి ఫిష్ బిర్యానీ రెడీ. సన్నని స్లైసులుగా తరిగిన ఉల్లిపాయలు, కొత్తిమీర, పెరుగు లేదా రైతాతో వడ్డించాలి.

చేపలు

జీవనయాన తెరచాపలు

ప్రాచీన భారతీయ వైద్య శాస్త్రమైన ఆయుర్వేదం ప్రకృతి సిద్ధమైన ఆహారపదార్థాల్ని అనేక రకాలుగా విభజించింది. కృతాన్నాలను (వండుకొని తయారుచేసినవి) కూడా వివరించింది. వీటిలోని పోషక విలువలు, ఔషధ ప్రయోజనాలను కూడా సమీక్షించింది. వీటిలో ఒకటి 'మత్స్య (చేపలు) వర్గం'. ఆకారం, రంగు, పరిమాణం, అవి పెరిగే ప్రదేశం... వీటిని బట్టి వివిధ రకాలైన చేపల గుణగణాలు 'భావప్రకాశ సంహిత'లో గోచరిస్తాయి. ఆయుర్వేదం భూప్రదేశాన్ని మూడుగా విభజించింది. జాంగల దేశం (చెట్లు ముమ్మరంగా ఉండే అరణ్య ప్రదేశాలు), ఆనూప దేశం (నీటి ప్రాబల్యం అధికంగా ఉండే ప్రాంతాలు), సాధారణ దేశం (పైన చెప్పిన రెండింటి కంటె భిన్నమైన జనావాస ప్రాంతాలు). చేపలు ఆనూప దేశపు జీవులు. కనుక స్థూలంగా కఫ ప్రకోపకారకాలు. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని పరిశీలిద్దాం.

రోహిత: (ఎర్ర మీను): వీటి పొట్ట, మూతి, కళ్లు, రెక్కలు ఎర్రగా ఉండి, తోక మాత్రం నల్లగా ఉంటుంది. అన్ని రకాలలోనూ తియ్యగా ఉంటుంది. కొద్దిపాటు వగరు కూడా ఉంటుంది.

గుణాలు: వాతహరం. అతిగా వేడి చేయదు. వృష్యం (శుక్ర, వీర్యవర్ధకమై కామోత్తేజకరం), అర్దిత వాతాన్ని (ముఖంలో సగ భాగానికి వచ్చే పక్షవాతం) తగ్గిస్తుంది. శాలాక్య తంత్రరోగాల్ని (మెడకు పైభాగాన ఉండే వివిధ అవయవాలకు వచ్చే వ్యాధులు) చాలా వరకు పోగొడుతుంది. (చేప తలకు ఈ ప్రభావం ఉంది).

రోహితః సర్వమత్స్యానాం వరో। వృష్యః అర్దితారిక్తజిత్॥
కషాయానురసః స్వాదుః వాతఘ్నో న అతి పిత్త కృత్
ఊర్ధ్వ జత్రుగతాన్ రోగాన్ హన్యాత్ రోహిత ముండకమ్॥

శిలీంధ్ర (పుట్టకొక్కు): రుచిగా ఉంటుంది. బలాన్ని చేకూరుస్తుంది. బరువైన ఆహారం, కఫకరం. వాతపిత్త లక్షణాలను హరిస్తుంది. ఆమవాతాన్ని కలుగచేస్తుంది. (జీర్ణప్రక్రియ కొరవడి, కండరాలకు, కీళ్లకు ఇబ్బంది కలిగిస్తుంది)

పాఠీనః (వేయి కోరలు గల చేప): ఇది మాంసాహారి. ఎక్కువగా నిద్రపోతుంది. ఇది తిన్నవారి రక్తాన్ని దూషించి చర్మరోగాలు కలిగిస్తుంది.

(పాఠీనః శ్లేష్మలో బల్యో నిద్రాళుః పిశితాశనః। దూషయేత్ రుధిరం పిత్తం, కుష్ఠరోగం కరోతి చ)

ఇంకా చాలా రకాలను చెప్పారు. భంగుర, మోచికా, శృంగి, ఇల్లీస, శుష్కులీ, గుర్గర, కవికా, వర్మ.. మొదలైనవి.

సపాద మత్స్యః (కాళ్లు గలది): ఇది శరీరంలోని కొవ్వుని కరిగిస్తుంది. (మేదోహరం). మెదడుకి పదును పెట్టి తెలివితేటలు పెంచుతుంది (మేధాకరం). నాలుకకు రుచిని కలిగిస్తుంది. వాత పిత్తకరం. (సపాద మత్స్యో మేధాకృత్ మేదః క్షయకరః, చ సః వాతపిత్త కరశ్చాపి, రుచికృత్ పరమో మతః)

క్షుద్ర మత్స్యాలు: (చిన్న చేపలు): తేలికగా జీర్ణమై, బలకరమై, త్రిదోష వికారాలను పోగొడుతుంది. మరీ చిన్నవిగా ఉన్న చేపలు (అతి సూక్ష్మాలు) దగ్గును తగ్గిస్తాయి. కాని పుంస్త్వమును (మగతనపు శక్తిని) కూడా పోగొడతాయి.

మత్స్యాండః (చేప గుడ్లు): నీరసాన్ని పోగొట్టి బలాన్ని వృద్ధి చేస్తాయి. కామశక్తిని విపరీతంగా పెంచుతాయి.

ఎండు చేపలు: (శుష్క మత్స్య): కొత్తవి బలకరమే గాని సరిగా జీర్ణం కావు. మలబంధం చేస్తాయి.

దగ్ధ మత్స్యాః (కాల్చిన చేపలు): చాలా శ్రేష్ఠం. పుష్టికరం.

నివాసభేదాన్ని బట్టి గుణాలు:

నూతులలో పుట్టినవి: శుక్రకరం, మూత్రకరం, చర్మరోగ కారకం.

సరస్సునందు పుట్టినవి: జిడ్డుగా ఉండి రుచికరంగా ఉంటాయి. బలకరం, వాతహరం.

నదిలో పుట్టినవి: బరువాహారం, కొంచెం వేడి చేస్తాయి. వాతహరం, రక్తాన్ని స్రవింపచేసే గుణం ఉంది. వృష్యం.

మడుగులోనివి: తేలికగా జీర్ణమై కొంచెం వేడి చేస్తాయి. జిడ్డుగా, చల్లగా ఉంటాయి.

చెరువులోనివి: బరువాహారం. వీర్యవర్ధకం. మలమూత్రాల్ని సాఫీ చేస్తాయి. ఆయువును, దృష్టిని, బుద్ధిని పెంచుతాయి.

ఋతువుల్ని బట్టి – శ్రేష్ఠత్వం

హేమంతంలో నూతిలోనివి, శిశిరంలో సరస్సులోనివి, వసంతంలో నదిలోనివి, గ్రీష్మంలో మడుగులోనివి, వర్ష రుతువులో చెరువులోనివి, శరదృతువులో ప్రవాహం (నదులు) లోనివి శ్రేష్ఠం. వర్ష రుతువులో నది చేపలు అపథ్యం (హాని చేస్తాయి)

ఆధునిక జీవశాస్త్రం రీత్యా: (కొన్ని ముఖ్య రకాలు: సాల్మన్, తునా, రెయిన్‌బో ట్రౌట్, పాసిఫిక్ హాలిబట్, మకెరెల్, కాడ్, సార్డైన్, హెర్రింగ్

జిడ్డుగా ఉండే రకాలైన సాల్మన్, తునా చేపలలో మాంసకృత్తులు హెచ్చుగా ఉంటాయి. కొలెస్టరాల్, శాట్యురేటెడ్ కొవ్వులు తక్కువగా ఉంటాయి. విటమినులు (ఎ, బి, డి) లవణాలు, జింక్, ఐరన్ మెండుగా ఉంటాయి. గుండె ఆరోగ్యానికి దోహదపడే ఒమేగా – 3 ఫాటీ యాసిడ్స్ బాగా ఉంటాయి. శరీర బరువు తగ్గటానికి చేపలు మంచి ఆహారం.

గమనిక: చేపలను వండేటప్పుడు వాడే ఉప్పు, ఇతర మసాలా ద్రవ్యాలు, నూనెల వల్ల, పచ్చి చేపలలో ఉండే పోషక విలువలు, గుణ ధర్మాలు చాలావరకు తగ్గిపోతాయి,

టిప్స్ అండ్ ట్రిక్స్

➡ చేప ముక్కలను చువ్వలు లేదా స్టిక్స్‌కు గుచ్చి గ్రిల్ చేస్తుంటారు. దీనికి ముందు చేప ముక్కలను శుభ్రం చేసి, నిమ్మరసం రాసి 15 నిమిషాలు అలాగే ఉంచాలి. దీని వల్ల గ్రిల్ చేసినా చువ్వలు/ స్టిక్స్‌కు చేపముక్కలు గట్టిగా పట్టి ఉంటాయి ➡ ఫిష్ ఫిల్లెట్స్ కరకరలాడాలంటే వాటిని వేయించడానికి ముందు బ్రెడ్ క్రంబ్స్ లేదా కార్న్ ఫ్లేక్స్ పొడిలో రోల్ చేయాలి. దీనివల్ల చేపముక్కలు నూనె తక్కువ పీల్చుకుంటాయి ➡ చేప ముక్కల కండ గట్టిపడాలంటే ఐదు నిమిషాల సేపు నూనెలో రెండువైపులా వేయించాలి ➡ ఫ్రీజర్‌లో పెట్టిన చేప ముక్కలు ఐస్‌తో ఉండి త్వరగా తీయడానికి రావు. ఇలాంటప్పుడు వాటిలో పాలు పోసి, పది నిమిషాలు ఉంచితే త్వరగా తీసుకొని వండుకోవచ్చు. కొద్దిగా వెన్న, నిమ్మరసం కోటింగ్ వేస్తే వాడుకోవడానికి చేపముక్కలు తాజాగా ఉంటాయి.

హెల్దీ డైట్

స్ప్రౌటెడ్ మిలెట్ దోసె, ఇడ్లీ విత్ జింజర్ చట్నీ

పిండి కోసం కావలసినవి: స్ప్రౌట్స్ – ఒక కప్పు (జొన్నలు, రాగులు, సజ్జలు); ఉప్పుడు బియ్యం – ఒక కప్పు; మినప్పప్పు – ఒక కప్పు; మెంతులు – ఒక టీ స్పూను; ఉప్పు – తగినంత.

చట్నీ కోసం కావలసినవి: ధనియాలు – 2 టేబుల్ స్పూన్లు; పచ్చి సెనగ పప్పు – 2 టేబుల్ స్పూన్లు; అల్లం – చిన్న ముక్క; వెల్లుల్లి రెబ్బలు – 3 (లేకపోయినా పరవాలేదు); మెంతులు – అర టీ స్పూను; జీలకర్ర – ఒక టీ స్పూను; ఎండు మిర్చి – 12; కరివేపాకు – పావు కప్పు; ఇంగువ – అర టీ స్పూను; చింతపండు – పావు కప్పు కంటె ఎక్కువ; బెల్లం పొడి – పావు కేజీ

పిండి తయారీ: ఉప్పు మినహా పిండి కోసం చెప్పిన మిగతా పదార్థాలకు తగినన్ని నీళ్లు జత చేసి, సుమారు నాలుగు గంటలసేపు నానబెట్టాలి ● నీళ్లు ఒంపేసి, నానబెట్టిన వాటిని గ్రైండర్‌లో వేసి మెత్తగా రుబ్బాక, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● సుమారు ఎనిమిది గంటలపాటు ఈ పిండిని నానబెట్టాలి ● ఈ పిండితో దోసెలు, ఇడ్లీలు తయారుచేసుకోవచ్చు ● అల్లం చట్నీతో అందించాలి ● ఈ అల్పాహారం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

అల్లం చట్నీ తయారీ: చింతపండుకు తగినన్ని నీళ్లు జత చేసి కొద్దిసేపు నానబెట్టాలి ● స్టా మీద బాణలిలో నూనె వేసి కాగాక, ధనియాలు, పచ్చి సెనగ పప్పు, లవంగాలు, మెంతులు, జీలకర్ర, ఎండు మిర్చి, కరివేపాకు, అల్లం ముక్క వేసి వేయించి ఒక పాత్రలోకి తీసుకోవాలి ● బాగా చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా చేయాలి ● నానబెట్టిన చింతపండు, కొద్దిగా నీళ్లు జత చేసి మరోమారు మిక్సీ పట్టాలి ● బెల్లం పొడి, ఉప్పు జత చేసి పచ్చడి మెత్తగా అయ్యేవరకు మిక్సీ పట్టాలి ● దోసె, ఇడ్లీలతో అందించాలి. ఇటువంటి ఆరోగ్యకరమైన వంటకాలను బామ్మలు, అమ్మమ్మలు మాత్రమే చెప్తారు. ఇందులో నూనె ఎక్కువగా వాడలేదు. మినుముకు విరుగుడైన అల్లం చట్నీతో తినడం వల్ల శరీరం గట్టి పడుతుంది.

బాలీవుడ్ / ఇర్ఫాన్ ఖాన్

అతనిది హిట్ మీడియమ్

శుక్రవారం 'అంగ్రేజీ మీడియం' సినిమా రిలీజైంది. విశేషం ఏమిటి?
ఇర్ఫాన్ ఖాన్ హీరో. అయితే?
రెండేళ్లుగా బ్రెయిన్ ట్యూమర్‌తో లండన్‌లో పోరాడుతూ,
ధైర్యం సడలనివ్వక, పూర్తిగా ఆరోగ్యవంతుడు కాకపోయినా,
ప్రేక్షకుల కోసం నటించాడు.
సినిమా ఎలా ఉంది?
ఇంతకు ముందు 'హిందీ మీడియమ్' చేశాడు. హిట్.
ఇప్పుడు 'అంగ్రేజీ మీడియమ్' చేశాడు. హిట్. సినిమా ఏదైనా అతడి నటన హిట్.
అతనిది గుండెల్ని హిట్ చేసే మీడియమ్.

ఇర్ఫాన్ ఖాన్

2017లో ఇర్ఫాన్ ఖాన్‌తో 'హిందీ మీడియమ్' సినిమా తీశారు. బడ్జెట్ 14 కోట్లు. ఎంత వసూలు చేసిందో తెలుసా? 300 కోట్లు. ఇర్ఫాన్‌ఖాన్ రేంజ్ అది. అతను మాస్ హీరో కాదు. గాల్లో కార్లు లేపడు. విమానాలు నడపడు. వందమందిని తన్నడు. మరేం చేస్తాడు? నటన చేస్తాడు. మనసుకు ఎక్కేలా డైలాగ్ చెబుతాడు. మనం క్యారెక్టర్ ఫీలయ్యేలాగా మనల్ని తనతోపాటు తీసుకెళతాడు. హిందీలో ముగ్గురు ఖాన్‌లు ఆమిర్, సల్మాన్, షారుక్‌లకు ఎంతమంది ఫ్యాన్లు ఉన్నారో ఇర్ఫాన్‌కు కూడా అంతమందే ఉన్నారు. ఈ ముగ్గురు ఖాన్‌లు ఈ దేశంలోనే సూపర్ స్టార్లు. ఇర్ఫాన్ హాలీవుడ్‌లో కూడా స్టార్. రాజస్థాన్‌లోని ఒక చిన్న ఊరి నుంచి ఇంత ఎదిగిన ఖాన్... ఓర్పుకు, కృషికి, నవ్యతకు, మన సమయం వచ్చే వరకూ చూడాల్సిన ఎదురుచూపులకు ఉదాహరణ.

'టోక్' నుంచి మొదలు

ఇర్ఫాన్ ఖాన్‌ది రాజస్థాన్‌లోని 'టోక్' అనే చిన్న ఊరు. వాళ్ల నాన్న జమిందారి ఫ్యామిలీకి చెందిన వాడు. కాని ఆ జమిందారీని ఏవో గొడవల రీత్యా తీసుకోకుండా చిన్న ఇంట్లో ఉండేవాడు. ఆయన వేట గాడు. అందుకని ఎప్పుడూ అడవుల్లో తిరుగుతుండే వాడు. పిల్లలను పట్టించుకునేవాడు కాదు. ఇర్ఫాన్ గాలిపటం కొనుక్కోలేక చెట్టుకు వేళ్లాడుతున్న గాలి పటం కోసం ప్రయత్నించి కిందపడ్డాడు. కుడిచేతి మణికట్టు విరిగిపోయింది. ఆ సంగతి ఇంట్లో ఎవరికీ తెలియలేదు. హాస్పిటల్‌కు తీసుకెళ్లలేదు. కొద్దిరోజుల్లోనే పూర్తిగా చేతి మీద పట్టుపోయింది. దానిని సరి చేయించాలంటే ఇర్ఫాన్‌కు రెండేళ్లు పట్టింది. ఇంతటి సుకుమారమైన ఇర్ఫాన్‌కు రోజూ మధ్యాహ్నం పూట వెనుక గదిలో స్నేహితులతో ఏదో ఒక డ్రామా వేయడం ఉత్సాహం నింపేది. అమాయక గ్రామీణ పిల్లల నాటకాలు అవి. జైపూర్ రేడియోలు నాటకాలు వస్తే వదలకుండా వినేవాడు. నటుడు అవుతానని అనుకోలేదు. కాని వయసు వచ్చే కొద్దీ అందరూ అతణ్ణి 'మిథున్ చక్రవర్తి'లా ఉన్నావని అనడం మొదలుపెట్టారు. కొంచెం పోలికలు కూడా కనిపించేవి. దాంతో మిథున్‌లాగా జుట్టు పెంచడం, మిథున్‌లాగా డైలాగులు చెప్పడం ప్రాక్టీసు చేసేవాడు. మెల్లగా యాక్టింగ్ మీద ఆసక్తి కలిగింది. జైపూర్‌లో నాటకాలు వేసే ఒక గురువు 'యాక్టింగ్ రావాలంటే నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా అని ఢిల్లీలో ఉంటుంది. అందులో చేరు' అని సలహా ఇచ్చాడు. అలా నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా విద్యార్థి అయ్యాడు ఇర్ఫాన్.

ముంబై పాఠాలు

ముంబైలో ఇర్ఫాన్ జీవితం సులువు కాలేదు. 1985-86 ప్రాంతం అంటే నాటకీయ సినిమాలు, అసహజ నటనలు ఉన్న సినిమాలు రాజ్యమేలే సమయం. ఇర్ఫాన్‌కు పని దొరకలేదు. టీవీ సీరియల్స్‌లో పని చేయడం మొదలెట్టాడు. 'చాణక్య', 'చంద్రకాంత', 'బనేగీ అప్‌నీ బాత్' ఈ సీరియల్స్ అన్నింటిలో అతడి పాత్రకు చాలా పేరొచ్చింది. 'సలాం బాంబే'లో నటిస్తే అతని పాత్ర ఎడిటింగ్‌లో ఎగిరిపోయింది. చివరకు 'జై హనుమాన్' సీరియల్‌లో 'వాల్మీకి' రుషి వంటి చిన్న పాత్రలు కూడా చేశాడు. మధ్యలో చాలా డిప్రెషన్ వచ్చింది. ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చింది. చివరకు విశాల్ భరద్వాజ్ 'మేక్‌బెత్' ఆధారంగా తీసిన 'మక్బూల్' సినిమాతో ఇర్ఫాన్‌కు పేరొచ్చింది. ఆ సమయంలోనే తెలుగులో మహేష్‌బాబు 'సైనికుడు'లో విలన్ వేషం వేశాడు కాని సినిమా సక్సెస్ కాక పోవడం వల్ల ఇర్ఫాన్‌కు ఇక్కడ మళ్లీ ఆఫర్లు రాలేదు. కాని బాలీవుడ్‌లో మెల్లిగా అతడి గిరాకీ పెరిగింది. 2007లో అతడు నటించిన రెండు సినిమాలు ఇర్ఫాన్‌కు విశేషమైన పేరు తెచ్చి పెట్టాయి. ఒకటి 'నేమ్‌సేక్'. ఇది ఝుంపా లాహిరి నవల. రెండు 'లైఫ్ ఇన్ ఏ మెట్రో'. నేమ్‌సేక్‌లో ఇర్ఫాన్ నటన చూసి 'నేను నీ ఫ్యాన్‌ని' అని షబానా ఆజ్మీ మెసేజ్ పెట్టింది. అనురాగ్ బసు తీసిన 'లైఫ్ ఇన్ ఏ మెట్రో'తో ఇర్ఫాన్ సామాన్య ప్రేక్షకులకు కూడా చేరువయ్యాడు.

పాన్‌సింగ్ తోమార్

2012 నుంచి ఇర్ఫాన్ ఖాన్ దశ తిరిగింది. తన స్నేహితుడు తిగ్‌మాన్షు ధులియా దర్శకత్వంలో ఇర్ఫాన్ నటించిన సినిమా సూపర్‌డూపర్ హిట్‌గా నిలిచింది. ఇది సైన్యంలో పని చేసి బందిపోటుగా మారిన పాన్‌సింగ్ తోమార్ అనే వ్యక్తి కథ. ఇర్ఫాన్ ఇందులో ప్రదర్శించిన నటనకు జనం చాలా మెచ్చుకున్నారు. ఇర్ఫాన్‌కు అవార్డులు వచ్చి పడ్డాయి. అదే సమయంలో హాలీవుడ్‌లో అతడు నటించిన 'లైఫ్ ఆఫ్ పై', 'ది అమేజింగ్ స్పైడర్‌మేన్' ఇర్ఫాన్ నటనను ఖండాలు దాటించాయి. ఇప్పుడు ఇర్ఫాన్ దేశంలోనే కాదు ప్రపంచంలో కూడా స్టార్ అయ్యాడు.

అతని కోసం కథలు

ఇప్పుడు రచయితలు ఇర్ఫాన్ కోసమే కథలు రాయడం మొదలుపెట్టారు. 'లంచ్‌బాక్స్', 'పికూ', 'మదారి' ఇవన్నీ ఇర్ఫాన్ గొప్పగా చూపించాడు. 'పికూ'లో అమితాబ్‌తో కలిసి తెర మీద అతడు నవ్వులే పూయించాడు. సినిమా వెంట సినిమా అతడు ప్రేక్షకులకు దగ్గరవుతూ వెళ్లాడు. 'హిందీ మీడియమ్' సినిమా అతణ్ణి టాప్‌స్టార్‌గా నిలిపింది. 'కరీబ్ కరీబ్ సింగల్' మరో హిట్.

దిష్టి తగిలింది

ఇంత సక్సెస్‌లో ఉన్న ఇర్ఫాన్‌కు దిష్టి తగిలింది. హటాత్తుగా అనారోగ్యం కబళించింది. డాక్టర్లు పరీక్షలు చేసి 'న్యూరోఎండ్రోసిన్ ట్యూమర్' అని చెప్పారు. ఇదొక ప్రమాదకరమైన మెదడు వ్యాధి. దీని వైద్యం కోసం ఇర్ఫాన్ లండన్ వెళ్లాడు. లండన్‌లోనే ఉన్నాడు. ఇండస్ట్రీ అంతా అతని ఆరోగ్యం కోరుకుంది. నటుడు షారుక్ ఖాన్ అయితే లండన్‌లోని తన ఇంటి తాళాన్ని ఇర్ఫాన్‌కు ఇచ్చి నీ ఇల్లే అనుకుని ఉండు... బాగయ్యి రా అని పంపించాడు. వైద్యం, ప్రార్థనలు ఫలించాయి. ఇర్ఫాన్ చాలావరకు కోలుకున్నాడు. వైద్యం కొనసాగుతూ ఉంది. ప్రేక్షకుల కోసం, అభిమానుల కోసం ఇప్పుడు 'అంగ్రేజీ మీడియం' సినిమాను కానుకగా ఇచ్చాడు. లండన్‌లో చదువుకోవాలని తపన పడే కూతురి కలను ఇండియాలో ఉండే ఒక సామాన్య తండ్రి ఎలా నెరవేర్చాడనేది కథ.

ఇర్ఫాన్‌కు గట్టిగా పునఃస్వాగతం చెప్పడానికి ఈ సినిమా చూడొచ్చు.

ఇర్ఫాన్‌ను చాలా రోజుల తర్వాత చూడటానికి కూడా చూడొచ్చు. వీలైతే చూసేయండి.

– సాక్షి ఫ్యామిలీ

పరిపరిశోధన

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
14-3-2020



ఈ బ్యాటరీల్లో బోలెడంత విద్యుత్తు

స్మార్ట్‌ఫోన్లతోపాటు విద్యుత్తు వాహనాల్లోనూ లిథియం అయాన్ బ్యాటరీలదే రాజ్యం. ఒక కాథోడ్, ఆనోడ్‌తోపాటు ద్రవ ఎలక్ట్రోలైట్ ఉండే ఈ బ్యాటరీల భద్రతపై చాలా కాలంగా సందేహాలు ఉన్నాయి. అదే సమయంలో నిల్వ చేసుకోగల విద్యుత్తు కూడా తక్కువే. ఈ సమస్యను అధిగమించేందుకు సింగపూర్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఓ సరికొత్త బ్యాటరీని ఆవిష్కరించారు. ఇందులోనూ లిథియంను వాడుతున్నప్పటికీ ద్రవ ఎలక్ట్రోలైట్ స్థానంలో సెమీ లిక్విడ్ సల్ఫర్‌ను వాడతారు. లిథియం సల్ఫర్ బ్యాటరీలపై గతంలోనూ కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ఈ కొత్త బ్యాటరీలు ఐదు రెట్లు ఎక్కువ విద్యుత్తును నిల్వ చేసుకోగలవు. కానీ ఎక్కువ కాలం పనిచేయవు. సెమీ లిక్విడ్ ఎలక్ట్రోలైట్‌ను వాడినప్పుడు మాత్రం బ్యాటరీలు ఎక్కువ కాలం మన్నుతున్నట్లు సింగపూర్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రత్యేక పద్ధతులను ఉపయోగించి ఈ సెమీ లిక్విడ్ ఎలక్ట్రోలైట్‌తో తయారైన త్రీడీ పలకలను వాడతామని, తద్వారా పాత బ్యాటరీల్లోని సమస్యలను విజయవంతంగా అధిగమించగలిగామని ఈ పరిశోధనల్లో పాల ్గొన్న శాస్త్రవేత్త జాకీ వై.ఇంగ్ తెలిపారు. ఈ కొత్త రకం బ్యాటరీల ఛార్జింగ్, డిశ్చార్జింగ్ కూడా మెరుగ్గా జరుగుతున్నాయని చెప్పారు. విపరీతమైన వేడి వాతావరణాల్లోనూ బ్యాటరీ సామర్థ్యంలో ఎలాంటి మార్పు కనిపించలేదని చెప్పారు. ఈ పరిశోధన వివరాలు నానో ఎనర్జీ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

దీర్ఘకాలం నిరాహారంతో మెరుగైన కాలేయం

ఇంటెరిట్మెంట్ ఫాస్టింగ్ గురించి మీరు వినే ఉంటారు. ఒక రోజులో 16 గంటలపాటు ఆహారం లేకుండా గడపడం.. మిగిలిన ఎనిమిది గంటల్లో నచ్చినంత తినడం ఈ పద్ధతిలోని ముఖ్యమైన అంశం. ఆహారం లేని సందర్భంలో శరీరం అందుబాటులో ఉన్న కొవ్వులను ఉపయోగించుకుంటుందని, ఫలితంగా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నది ఇంటెరిట్మెంట్ ఫాస్టింగ్ వెనుక ఉన్న సూత్రం. ఈ కొత్త పద్ధతితో లాభాలు ఇక్కడితో ఆగిపోలేదు. కాలేయం పనితీరును మెరుగుపరిచేందుకు కూడా ఉపయోగపడుతుందని అంటున్నారు సిడ్నీ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. ఇంటరిట్మెంట్ ఫాస్టింగ్ వల్ల కాలేయంలో జరిగే మార్పులకు కారణాలను వెతికేందుకు తాము ఎలుకలపై ప్రయోగాలు చేశామని ఒక రోజు ఆహారం, మరో రోజు ఉపవాసం చేసిన ఎలుకలను పరిశీలించినప్పుడు 12 రోజుల్లోనే కాలేయంలో మార్పులు కనిపించడం మొదలైందని, అదే సమయంలో హెచ్‌ఎన్‌ఎఫ్4 ప్రొటీన్‌ల క్రియలు ఎక్కువయ్యాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త మార్క్ లారెన్స్ తెలిపారు. ఈ ప్రొటీన్‌తో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నది గతంలోనే రుజువు అయ్యిందని మార్క్ చెప్పారు. ఆరోగ్యంలో ఈ ప్రొటీన్ పాత్ర ఏమిటన్నది స్పష్టమైన నేపథ్యంలో భవిష్యత్తులో ఈ ప్రొటీన్‌ను కృత్రిమంగా తయారు చేసేందుకు అవకాశం ఏర్పడిందని వివరించారు.

పక్కా లోకల్

బీయింగ్ హైద్రాబాదీ దేడ్ దిమాగ్

'ఏక్ గిలాస్ పానీ దే భాయ్'
'కైకూ?'
'భేజా నక్కో ఖావ్.. '
'కైకూ?'
'దిమాగ్ ఖరాబ్ హై?'
'ఏక్‌దమ్ కిర్రాక్ హై భాయ్'

ఇది పక్కా హైదరాబాదీ జుబాన్. హైదరాబాద్ లోకల్ లాంగ్వేజే అయినా ఇటు సౌత్ అటు నార్త్ అందరికీ సమజ్ అయితది. అందుకే దేశమంతా పాపులర్ అయింది. దక్కనీ ప్రత్యేకత అది. దీని మీదున్న ప్రేమను ప్రకటించుకోవడానికి .. పదబంధాలుగా మారిన ఈ భాషలోని కొన్ని మాటలను టీషర్ట్స్ మీద ముద్రిస్తున్నాడు సయ్యద్ సైఫ్. 28 ఏళ్ల ఈ యువకుడు వృత్తిరీత్యా గ్రాఫిక్ డిజైనర్. దక్కనీ ఉర్దూ, సంస్కృతి అంటే అతనికి ప్రాణం. ఇలా టీ షర్ట్స్ మీద ప్రింట్ చేస్తూ ఆ భాషను, సంస్కృతిని ప్రమోట్ చేస్తున్నాడు.. 'బీయింగ్ హైదరాబాద్' బ్రాండ్‌తో. ఇదివరకు టీ మగ్స్, పెయింటింగ్స్‌తో కూడా దక్కనీ మాటలను ప్రమోట్ చేసి తన ఇష్టాన్ని చాటుకున్నాడు. 'అపన్ హైదరాబాదీ హై, అప్నేసే కామ్ (calm) ఆర్ కామ్(పని)దోనో నహీ హోతా', 'సబ్ బోలో మేర్కో కామ్ నక్కో బోలో', 'లైట్ లే బాప్', 'బైగాన్ కో బోలో', 'ఏక్ తో అపన్ హైదరాబాదీ ఊపర్‌సే కిర్రాక్', 'అపన్ టెన్షన్ లేతే నహీ.. దేతే' వంటి ఉర్దూ మాటలే కాదు 'బిర్యానీ పవర్', 'బీవేర్ ఆఫ్ సర్కాజమ్, బార్న్ హైదరబాదీ', 'ఛాయ్ ఇన్ మై వెయిన్స్' అనే ఆంగ్ల పదాలనూ టీషర్ట్స్ మీద ముద్రించి ఆన్‌లైన్‌లో అమ్ముతున్నాడు.

ఈ స్లోగన్స్‌తో ఇ - స్టోర్ ఐడియా ఎలా వచ్చింది?

'2014లో హైదరాబాద్‌లో జరిగిన కామిక్ కాన్ ఇండియాకు వెళ్లా. అక్కడ వచ్చింది ఈ ఐడియా. భాషగా దక్కనీకి చాలా డెప్త్ ఉంది. ఈ భాషలోని పదబంధాలకి ఓ ప్రత్యేకత ఉంది. దీన్ని ఎందుకు ప్రమోట్ చేయకూడదు? అనిపించింది. వెంటనే ఇంప్లిమెంట్ చేశా కామిక్ కాన్ అనే స్టాల్ పెట్టి. మగ్స్ మీద, పెయింటింగ్స్‌కి ఈ ఫ్రేజెస్ డిజైన్ చేసి ఇచ్చేవాడిని. తర్వాతే టీ షర్ట్స్ మీదా ప్రింట్ చేయాలనే ఆలోచన వచ్చి.. ఇ - స్టోర్ స్టార్ట్ చేశా' అంటూ 'బీయింగ్ హైదరాబాదీ' నేపథ్యం చెప్పుకొచ్చాడు.

డిమాండ్

'సప్లయ్ క్వాంటిటీని పెంచేలా ఉంది. హైదరాబాదీ యంగ్‌స్టర్స్ చాలా మంది గల్ఫ్, యూరప్ దేశాలకు వెళ్లారు ఉద్యోగులుగా. వాళ్లంతా ఈ 'బీయింగ్ హైదరాబాదీ' టీ షర్ట్స్ ఆలోచనకు అట్రాక్ట్ అయి.. ఆర్డర్సు ఇచ్చారు. అలా పక్కా లోకల్ బ్రాండ్ ఇక్కడి నుంచి అబ్రాడ్ హైదరబాదీస్‌కీ చేరి.. డిమాండ్‌ను స్థిరంగా ఉంచుతూ దక్కనీ నా సోర్స్ ఆఫ్ బిజినెస్‌గా మారింది' అంటాడు నవ్వుతూ సైఫ్.

హైదరాబాద్‌లో అయితే ఐటీ సెక్టార్‌లో పనిచేసే ఉద్యోగుల్లో ఈ టీషర్ట్స్ పట్ల చాలా క్రేజ్ కనపడుతోంది. వీకెండ్స్‌కి సరదాగా ఈ టీషర్ట్స్ మీద స్లోగన్స్‌తో థీమ్ పార్టీలూ చేసుకుంటున్నారట.

తెలుగు సినిమా డైలాగ్స్‌తోనూ...



తెలుగు సినిమాల్లో బాగా పేలిన డైలాగ్స్, హిట్టయిన సినిమా టైటిల్స్‌ను ఇలా టీ షర్ట్స్ మీద ప్రింట్ చేసే సరదాను మార్కెట్‌లోకి తెచ్చారు మహీ ఇల్లంద్ర, హరీష్ వాసిరెడ్డి అనే టెకీ, స్క్రిప్ట్ రైటర్ 'దేడ్ దిమాగ్' పేరుతో. 'నా చావు నేను చస్తా నీకెందుకు?', 'ఫసక్', 'కుదిరితే కప్పు కాఫీ', 'ఇది నా పిల్ల' వంటి ఎన్నో ఫేమస్ డైలాగ్స్, హిట్ సినిమా టైటిల్స్‌తో ప్రింట్ అవుతోన్న వీళ్ల టీ షర్ట్స్‌కూ దేశ, విదేశాల్లో చాలానే డిమాండ్ ఉంటోంది. 'ఐ లవ్ న్యూయార్క్', 'గ్రేట్ అమెరికన్' వంటి ఇంగ్లీష్ పేర్లతో వరల్డ్ ఫేమస్ బ్రాండ్స్ టీ షర్ట్స్ తెస్తున్నాయి. తెలుగులో ఎందుకు రాకూడదు... అనుకున్నాం. పైగా తెలుగును ప్రమోట్ చేయడానికి దీన్నో సాధనంగా కూడా ఉపయోగించుకోవాలనుకున్నాం. ముందు జనాలను అట్రాక్ట్ చేయడానికి ఇలా సినిమా డైలాగ్స్‌ను వాడుతున్నాం' అంటారు మహీ, హరీష్.

ఫ్యామిలీ డాక్టర్

గర్భవతిగా ఉన్నప్పుడు పైల్స్... తగ్గుతుందా?

నా వయసు 27 ఏళ్లు. గర్భధారణ సమయంలో నాకు పైల్స్ సమస్య మొదలైంది. ఎన్ని మందులు వాడినా సమస్య తిరగబడుతూనే ఉంది. దయచేసి నా సమస్య హోమియోతో నయమయ్యే అవకాశం ఉందా? సలహా ఇవ్వగలరు.

- ఒక సోదరి, విశాఖపట్నం

గర్భధారణ సమయంలో కొన్ని హార్మోన్ల కారణంగా రక్తనాళాలు రిలాక్స్ అవుతాయి. దాంతో కొంతమంది మహిళల్లో పైల్స్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. పైల్స్ సమస్యలో మలద్వారం దగ్గర ఉండే రక్తనాళాలు ఉబ్బిపోయి, వాపు రావడం జరుగుతుంది. తీవ్రమైన నొప్పి, రక్తస్రావం కూడా అవుతాయి.

కారణాలు: దీర్ఘకాలికంగా మలబద్ధకం, పొత్తికడుపు ఎక్కువ కాలం ఒత్తిడికి గురికావడం, దీర్ఘకాలిక దగ్గు, గర్భధారణ సమయంలో కాలేయ సంబంధిత వ్యాధుల వల్ల పైల్స్ వచ్చే అవకాశం ఉంది. పైన పేర్కొన్న కారణాలతో మలద్వారం వద్ద ఉండే రక్తనాళాలపై దీర్ఘకాలికంగా ఒత్తిడి ఏర్పడుతుంది. వాటిలో రక్తం నిల్వ ఉండటం వల్ల మలవిసర్జన సమయంలో మలద్వారం దగ్గరి ఒత్తిడి పెరుగుతుంది. ఫలితంగా తీవ్రమైన నొప్పి వస్తూ, రక్తనాళాలు చిట్లి, రక్తస్రావం అవుతుంది.

డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ,
హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

పైల్స్‌లో రకాలు ఉంటాయి. అవి... 1. ఇంటర్నల్ పైల్స్ 2. ఎక్స్‌టర్నల్ పైల్స్.

మలద్వారం వద్ద ఏర్పడే సమస్యల్లో పైల్స్ మాత్రమే గాక ఫిషర్, ఫిస్టులా వంటి ఇతర సమస్యలను కూడా మనం గమనించవచ్చు.

ఫిషర్స్: మలద్వారం దగ్గర ఏర్పడే చీలికను యానల్ ఫిషర్ అంటారు. ఈ చీలిక వల్ల ఆ ప్రాంతంలో ఉండే కండర కణజాలం బహిర్గతం కావడం వల్ల అది మలవిసర్జన సమయంలోగానీ, మలవిసర్జన అనంతరం గానీ తీవ్రమైన నొప్పిని కలిగిస్తుంది. రక్తస్రావం కూడా అవుతుంది.

ఫిస్టులా: మలద్వారం వద్ద రెండు ఎపిథీలియల్ కణజాలాల మధ్య భాగంలో ఒక గొట్టం లాంటి నిర్మాణాన్ని ఫిస్టులా అంటారు. ఇది శరీరంలో ఎక్కడైనా ఏర్పడవచ్చు. కానీ మలద్వారం వద్ద యానల్ ఫిషర్ ఏర్పడటం సర్వసాధారణం. మలద్వారం పక్కన ముందుగా చిన్న బుడిపెలాగా ఏర్పడి నొప్పి, వాపుతో రెండు రోజులలో పగిలి చీమును వెలువరుస్తుంది. దీని తీవ్రతను బట్టి తరచూ తిరగబెడుతుంటుంది. సాధారణ జీవనానికి అడ్డంకిగా నిలుస్తూ తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తుంది. ఆపరేషన్ చేసినా, 90 శాతం మందిలో మళ్లీ మళ్లీ తిరగబెడుతుంటుంది.

చికిత్స: జెనెటిక్ కన్‌స్టిట్యూషన్ చికిత్స విధానం ద్వారా పైల్స్, ఫిషర్స్, ఫిస్టులా సమస్యలను హోమియో వైద్యంతో పూర్తిగా నయం చేయవచ్చు. అంతేకాదు... మళ్లీ తిరగబెట్టకుండా పూర్తిస్థాయి చికిత్స అందించవచ్చు.

హోమియో కౌన్సెలింగ్స్

సైనసైటిస్ నయం అవుతుందా?

నా వయసు 36 ఏళ్లు. చాలాకాలంగా సైనసైటిస్‌తో బాధపడుతున్నాను. గాలిపీల్చుకోవడం కష్టం కావడంతో పాటు తలనొప్పితో బాధపడుతుంటాను. చాలా రకాల మందులు వాడాను. వాడినప్పుడు కొద్దిపాటి ఉపశమనమేగానీ సమస్య తగ్గడం లేదు. హోమియోలో శాశ్వత చికిత్స ఉందా?

- ఎస్.వి. శాస్త్రి, మంచిర్యాల

సైనస్ అంటే గాలి గది. మన ముఖంలోని ఎముకల మధ్యల్లో నాలుగు జతలుగా ఖాళీగా ఉండే గాలి గదులు ఉన్నాయి. సైనస్‌ల లోపలి వైపున మ్యూకస్ మెంబ్రేన్ అనే లైనింగ్ పొర ఉంటుంది. సైనస్‌లు అన్నీ ఆస్టియం అనే రంధ్రం ద్వారా ముక్కులోకి తెరచుకుంటాయి. మనం పీల్చుకునే గాలి వేడిమిని మన శరీర ఉష్ణోగ్రతకు దగ్గరగా ఉండేలా చేయడానికి సైనస్‌లు ఉపయోగపడతాయి. సైనస్‌లకి ఇన్ఫెక్షన్ వస్తే అది సైనసైటిస్‌కు దారితీస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ ఫ్యారింగ్స్ లేదా టాన్సిల్స్‌కు వ్యాపిస్తే ఫారింజైటిస్, టాన్సిలైటిస్‌కు దారితీయవచ్చు. ఒకవేళ చెవికి చేరితే ఒటైటిస్ మీడియా అనే చెవి ఇన్ఫెక్షన్ వస్తుంది.

డా॥ ఎ.ఎం.రెడ్డి
సీఎండీ,
పాజిటివ్ హోమియోపతి,
హైదరాబాద్

సైనసైటిస్ వచ్చిన వారికి ● తరచూ జలుబు ● గాలిపీల్చుకోవడం కష్టం కావడం ● ముక్కు, గొంతులో కఫం లేదా చీముతో కూడిన కఫం చేరడం ● కొందరిలో ఈ కఫం చెడువాసన రావడం ● నుదుటి పైభాగంలో లేదా కళ్లకింద, కనుబొమల మధ్య నొప్పి రావడం ● తల ముందుకు వంచినప్పుడు లేదా దగ్గినప్పుడు తలనొప్పి ఎక్కువ రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి వచ్చినప్పుడు సైనస్‌ల నుంచి ఇతర భాగాలకు అంటే... గొంతు, శ్వాసనాళాలకు ఇన్ఫెక్షన్ వ్యాపించవచ్చు.

ఎక్స్-రే, సీటీస్కాన్ వంటి పరీక్షల ద్వారా సైనసైటిస్‌ను నిర్ధారణ చేస్తారు.

సైనస్ వ్యాధిని సరైన సమయంలో గుర్తిస్తే ఎలాంటి ఆపరేషన్ లేకుండానే హోమియో మందుల ద్వారా సమర్థంగా నివారించవచ్చు. హోమియో ప్రక్రియలో రోగి వ్యక్తిగత ఆహార అలవాట్లు, ఆలోచన విధానం, నడవడిక, వ్యాధి లక్షణాలు... ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మందులు సూచిస్తారు. ఈ వ్యాధికి వాడే కొన్ని ముఖ్యమైన మందులివి...

● **హెపార్ సల్ఫూరికమ్:** కోపం, చికాకు ఉండేవారిలో, చల్లగాలికి తిరిగే సైనస్ లక్షణాలు ఎక్కువయ్యే వారికి ఇది మంచి మందు ● **మెర్క్ సాల్:** రక్తహీనత, అతినీరసం, అల్సర్లు త్వరగా మానకపోవడం, నోటిపూత, నోరు తడిగా ఉన్నప్పటికీ దాహంగా అనిపించడం వంటి లక్షణాలు ఉన్నవారికి ఈ మందు మేలు. ఈ మందులే గాక... మరిన్ని రకాల మందులను వ్యక్తుల శరీరక, మానసిక లక్షణాల ఆధారంగా ఇస్తారు. ఇందులో ఫాస్ఫరస్, ఆర్సినికమ్ ఆల్బ్, కాలీ కార్బ్, సైలీషియా, రస్టక్స్ మొదలైనవి ఉన్నాయి. అయితే ఈ మందులను కేవలం నిపుణులైన హోమియో వైద్యుల ఆధ్వర్యంలోనే తీసుకోవాలి. వాళ్లు రోగిని చూసి, సమస్య తీవ్రత ఆధారంగా తగిన మందును, మోతాదును నిర్ణయిస్తారు.

epaper.sakshi.com

కాంబినేషన్ షురూ

వక్కంతం వంశీ
రవితేజ

మంచి జోరు మీద ఉన్నారు రవితేజ. వరుసగా సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ కెరీర్‌లో ఎక్స్‌ప్రెస్‌లా దూసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'క్రాక్' చిత్రంలో రవితేజ హీరోగా నటిస్తున్నారు. అలాగే రవితేజ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్నట్లు ఇటీవల ప్రకటన వచ్చిన విషయం గుర్తుండే ఉంటుంది. తాజాగా అల్లు అర్జున్ 'నాపేరు సూర్య-నా ఇల్లు ఇండియా' సినిమాతో దర్శకుడిగా మారిన రైటర్ వక్కంతం వంశీ దర్శకత్వంలో రవితేజ హీరోగా నటింబోతున్నారన్న ప్రకటన శుక్రవారం వెల్లడైంది. గతంలో రవితేజ హీరోగా నటించిన సినిమాలకు వంశీ రచయితగా వర్క్ చేశారు. ఈ సినిమా గురించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

దసరాకు రాకీ భాయ్ వస్తున్నాడు

యష్

రెండేళ్ల క్రితం వెండితెరపై రాకీ భాయ్ సత్తా ఏంటో బాక్సాఫీస్‌కు తెలిసింది. ఇప్పుడు రాకీ భాయ్ మళ్లీ వస్తున్నాడు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యష్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'కేజీఎఫ్: చాప్టర్ 2'. 2018లో వచ్చిన 'కేజీఎఫ్: చాప్టర్1' చిత్రానికి ఇది సీక్వెల్. ఇందులో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో హోంబలే ఫిలిమ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాత సాయి కొర్రపాటి ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. ఇందులో రాకీ పాత్రలో నటించారు యష్. 'కేజీఎఫ్: చాప్టర్ 2' చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 23న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ''అధీర పాత్రలో నటిస్తున్న సంజయ్ దత్, రవీనాటాండన్, యశ్‌లపై చిత్రీకరించిన సన్నివేశాలతో ఈ సినిమా మేజర్ షెడ్యూల్ పూర్తయింది'' అని చిత్రబృందం వెల్లడించింది. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. భువన్ గౌడ కెమెరామేన్. తమిళ, కన్నడ, తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో విడుదలైన 'కేజీఎఫ్' ఫస్ట్ పార్ట్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభించింది. దీంతో సీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి.

పర్ఫెక్ట్ కోచ్

తమన్నా

'జ్వాల' క్యారెక్టర్‌ను ఓ చాలెంజ్‌గా తీసుకున్నానంటున్నారు తమన్నా. గోపీచంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో 'సీటీమార్' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో తెలంగాణ మహిళల కబడ్డీ జట్టు కోచ్ జ్వాల పాత్రలో నటిస్తున్నారు తమన్నా. ఈ పాత్ర కోసం తాను సిద్ధమవుతున్న విధానం గురించి తమన్నా మాట్లాడుతూ- ''నా కెరీర్‌లో తొలిసారి ఓ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమా చేస్తున్నాను. కబడ్డీ ప్లేయర్స్‌కు కోచ్‌గా నేను నటిస్తానని అస్సలు ఊహించలేదు. జ్వాల పాత్రను పర్ఫెక్ట్‌గా చేసేందుకు ఫుల్‌గా ప్రిపేర్ అవుతున్నాను. తెలంగాణ యాస నేర్చుకోవడాన్ని ఓ సవాల్‌గా తీసుకున్నాను. వీగన్ (శాకాహారి)గా మారిపోయి గ్లూటెన్ డైట్ ఫాలో అవుతూ యోగా కూడా చేస్తున్నాను. కోచ్‌గా నా హావభావాలు, బాడీ లాంగ్వేజ్ పర్ఫెక్ట్‌గా ఉండేందుకు జాగ్రత్త పడుతున్నాను. సంపత్ నంది సూచనలతో పాటు మా సెట్లో ఉన్న జాతీయ స్థాయి కబడ్డీ ప్లేయర్స్ సలహాలను తీసుకుంటున్నాను. 'జ్వాల' క్యారెక్టర్ ప్రేక్షకులకు గుర్తుండిపోవాలనే ఇంతలా కష్టపడుతున్నాను'' అని పేర్కొన్నారు తమన్నా. ఈ సినిమాలో ఆంధ్రా మహిళల కబడ్డీ జట్టు కోచ్‌గా కనిపించనున్నారు గోపీచంద్.

ఆచార్య నుంచి అవుట్

త్రిష

'ఆచార్య' చిత్రం నుంచి తప్పుకున్నారు త్రిష. చిరంజీవి హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆచార్య'. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్, నిరంజన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిషను కథానాయికగా తీసుకున్నారు. అయితే క్రియేటివ్ డిఫెర్సెన్స్ వల్ల 'ఆచార్య' చిత్రం నుంచి తాను తప్పుకున్నట్లు త్రిష సోషల్ మీడియా ద్వారా త్రిష వెల్లడించారు. ''కొన్నిసార్లు మొదట్లో మనకు చెప్పిన విషయాలు, చర్చలు మారిపోతుంటాయి. క్రియేటివ్ డిఫర్సెన్స్ వల్ల నేను చిరంజీవిగారి 'ఆచార్య' సినిమాలో నటించడం లేదు. త్వరలో ఓ ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో నా తెలుగు అభిమానులను కలుస్తాను'' అని పేర్కొన్నారు త్రిష. 2016లో 'నాయికి' అనే తమిళ, తెలుగు చిత్రం తర్వాత త్రిష అంగీకరించిన చిత్రం 'ఆచార్య'. ఇప్పుడీ సినిమా నుంచి తప్పుకున్నారామె. ఇదిలా ఉంటే 2006లో వచ్చిన 'స్టాలిన్'లో చిరంజీవి, త్రిష జంటగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

కథ కంప్లీట్

తరుణ్ భాస్కర్

'పెళ్లి చూపులు, ఈ నగరానికి ఏమైంది' వంటి సినిమాలతో ఆకట్టుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్. 'మీకు మాత్రమే చెప్తా' సినిమాతో యాక్టర్ అయ్యారు. ప్రస్తుతం యాంకర్‌గానూ మారారు. ఎన్ని పనులు చేసినా కథలు చెప్పడమే నా అంతిమ లక్ష్యం అంటారాయన. తరుణ్ భాస్కర్ తన తదుపరి చిత్రాన్ని సురేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో వెంకటేశ్‌తో చేయనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన కథ రాయడం పూర్తయిందని తెలిపారు తరుణ్. వెంకటేశ్ 'నారప్ప' తర్వాత ఈ సినిమాను సెట్స్ మీద తీసుకెళ్తారని సమాచారం. అలాగే నెట్‌ఫ్లిక్స్ 'లస్ట్ స్టోరీస్' ఆంథాలజీలో ఓ కథను డైరెక్ట్ చేశారు తరుణ్. ఆయన డైరెక్ట్ చేసిన భాగంలో మంచు లక్ష్మీ ఓ కీలక పాత్ర చేశారు. ఇందులోనే మేఘనా శానీ అనే కొత్త అమ్మాయి పరిచయం కాబోతున్నారు. త్వరలో ఈ ఆంథాలజీ ప్రసారం కానుంది.

తేదీలు తారుమారు

'మరక్కార్'లో మోహన్‌లాల్



టాలీవుడ్‌పై ప్రభావం?

పలు తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్‌పై కరోనా ప్రభావం పడినప్పటికీ ప్రస్తుతానికి రిలీజ్ తేదీల్లో ఇప్పటివరకూ ఏ సినిమా వాయిదా పడలేదు. తెలుగు రాష్ట్రాల్లో థియేటర్స్ మూసివేస్తున్నట్టు ఇంకా ఎటువంటి ప్రకటన రాలేదు.

క్యా కరోనా?

ఎటు చూసినా మాస్కులు తొడుక్కున్న ముఖాలే. ఏ నలుగురి సంభాషణ విన్నా సారాంశం అదే. దీనంతటికీ కారణం.. 'కరోనా వైరస్'. ప్రస్తుతం ప్రపంచాన్ని ప్రశాంతంగా బయట తిరగనివ్వడం లేదు. రాకపోకలు తగ్గిపోయాయి. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. కరోనా ప్రభావం అన్ని పరిశ్రమల మీదా పడింది. చిత్రపరిశ్రమ మీద కూడా పడింది. షూటింగులు, రిలీజ్‌లు, ప్రమోషన్లను కరోనా చిత్రవిచిత్రంగా ఇబ్బంది పెడుతోంది. రిలీజ్‌కు రెడీ అయిన సినిమాల విడుదల తేదీలు తారుమారయ్యేలా చేస్తోంది. రెవెన్యూ దెబ్బ తీస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రేక్షకుల భద్రత, సినిమా భద్రతను (కలెక్షన్లు) ఆలోచించి నిర్మాతలు తమ సినిమాల విడుదలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కొన్ని చోట్ల థియేటర్లు మూతపడ్డాయి. కొన్ని షూటింగ్ షెడ్యూల్స్ తలకిందులయ్యాయి. కోవిడ్ 19 ఎఫెక్ట్ ఇది. 'క్యా కరోనా?' అనుకోవడం మినహా ఏమీ చేయలేం. ఇక తారుమారైన సినిమాల పరిస్థితి తెలుసుకుందాం.

పోలీస్ నహీ ఆ రహా హై

సూపర్ పోలీస్‌ల పాత్రలతో బాక్సాఫీస్‌ను కొల్లగొడుతుంటారు బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి. అజయ్ దేవగన్‌తో 'సింగం', రణ్‌వీర్ సింగ్‌తో 'సింబా' సినిమాలు తీశాక అక్షయ్ కుమార్‌ను 'సూర్యవన్షీ'గా మార్చారు రోహిత్. 'పోలీస్ ఆ రహా హై' అన్నది క్యాప్షన్ (పోలీస్ వస్తున్నాడని అర్థం). కానీ టైమ్‌కి రావడంలేదు. ఈ సినిమాలో అజయ్ దేవగన్, రణ్‌వీర్ అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. మార్చి 24న ఈ సినిమా విడుదలవ్వాలి. ''ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని 'సూర్యవన్షీ' చిత్రం విడుదలను వాయిదా వేస్తున్నాం. సరైన టైమ్ వచ్చినప్పుడు 'సూర్యవన్షీ' వస్తాడు'' అని చిత్రబృందం పేర్కొంది.

సింహం వాయిదా?

మోహన్ లాల్ హీరోగా మలయాళంలో తెరకెక్కిన భారీ పీరియాడికల్ చిత్రం 'మరక్కార్: అరబికడలింటె సింహం'. ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను మార్చి 26న ఐదు భాషల్లో దేశవ్యాప్తంగా విడుదల చేయాలనుకున్నారు. అయితే కేరళలో మార్చి 31 వరకూ థియేటర్లను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. దీంతో ఈ సినిమా ఏప్రిల్ నెలకు వాయిదా పడుతుందని టాక్.

హాలీవుడ్‌లో...

అటు హాలీవుడ్‌కి వెళితే నాలుగైదు సినిమాల విడుదల ప్రస్తుతానికి ఆగింది. 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా మంచి ఫాలోయింగ్ ఉంది. ఈ ఫ్రాంచైజీలో 9వ సినిమా 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ 9'ని ఈ ఏడాది మే 22న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలనుకున్నారు. అయితే వచ్చే ఏడాది ఏప్రిల్‌కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ''మా కొత్త చిత్రం కోసం మీ అందరూ (ఫ్యాన్స్) ఎంతగా ఎదురు చూస్తున్నారో మాకు తెలుసు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితుల దృష్ట్యా విడుదలను వాయిదా వేశాం'' అని చిత్రబృందం పేర్కొంది.

అలాగే డిస్నీ సంస్థ భారీ వ్యయంతో తెరకెక్కించిన 'ములాన్' చిత్రం మార్చి 27న థియేటర్స్‌లోకి రావాలి. 2018లో సూపర్ హిట్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ 'ఎ క్వయిట్ ప్లేస్'కి సీక్వెల్‌గా వస్తున్న 'ఎ క్వయిట్ ప్లేస్ 2' చిత్రం మార్చి 18న విడుదల కావాలి. అయితే ఈ రెండు చిత్రాలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కొత్త విడుదల తేదీలను ఇంకా ప్రకటించలేదు.

పోయిన వారమే జేమ్స్ బాండ్ కొత్త చిత్రం 'నో టైమ్ టు డై' విడుదల తేదీని నవంబర్‌కి మార్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. కరోనా ప్రభావం ఇంకా చాలా సినిమాల రిలీజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. అనుకున్న టైమ్‌కి సినిమాని రిలీజ్ చేయకపోతే సినిమా నిర్మాణానికి తీసుకున్న డబ్బుకి ఇంట్రస్ట్ పెరుగుతుంది.. ఆడియన్స్‌లో ఆ సినిమాపై ఇంట్రెస్ట్ తగ్గే ప్రమాదం కూడా ఉంది. అలాగే ఇప్పుడు విడుదల కావాల్సిన చిత్రాలు వాయిదా పడితే.. ఆ తర్వాతి నెలల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకున్న చిత్రాల రిలీజ్‌కు క్లాష్ ఏర్పడుతుంది. మొత్తం మీద కరోనా ఇండస్ట్రీని బాగానే కలవరపెడుతోంది.

– గౌతమ్ మల్లాది

థియేటర్లు క్లోజ్

కరోనా తీవ్రత పెరుగుతున్న కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాల్లో థియేటర్స్‌ను స్వచ్ఛందంగా మూసి వేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఆల్రెడీ కేరళలో కొన్ని రోజులుగా థియేటర్స్‌లో ప్రదర్శనను ఆపేశారు. తాజాగా కర్ణాటక, ఢిల్లీ, మహారాష్ట్ర, జమ్ము కాశ్మీర్, ఒడిస్సాలో థియేటర్స్‌ను ఈ నెల 31 వరకూ మూసి వేస్తున్నట్టు ప్రకటించారు.


'ములాన్' చిత్రంలో లియూ

కోబ్రాకు బ్రేక్

7 విభిన్న పాత్రల్లో విక్రమ్ నటిస్తున్న చిత్రం 'కోబ్రా'. అజయ్ జ్ఞానముత్తు దర్శకుడు. ఈ సినిమాకి సంబంధించిన ఓ షెడ్యూల్‌ను రష్యాలో ప్లాన్ చేసి, కొన్ని రోజులుగా అక్కడ షూటింగ్ జరుపుతున్నారు. అయితే విదేశీ రాకపోకలను తగ్గించేయాలని మన ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో షూటింగ్ షెడ్యూల్ పూర్తి కాకముందే 'కోబ్రా' టీమ్ ఇండియా వచ్చేయాల్సి వస్తోందని దర్శకుడు ట్వీట్ చేశారు.

మహిళల్ని గౌరవించండి

అక్షిత్ శశికుమార్, అనహిత

తెలుగు, కన్నడ, తమిళ చిత్రాలతో ప్రేక్షకుల్లో తనకంటూ గుర్తింపు పొందారు కన్నడ హీరో శశి కుమార్. ఇప్పుడు ఆయన తనయుడు అక్షిత్ శశి కుమార్‌ని హీరోగా పరిచయం చేస్తూ తెలుగు, కన్నడ భాషల్లో రూపొందిన చిత్రం 'సీతాయణం'. 'రెస్పెక్ట్ ఉమెన్' అన్నది ఉపశీర్షిక. ప్రభాకర్ ఆరిపాక దర్శకత్వం వహించారు. అనహిత భూషణ్ కథానాయికగా నటించారు. కలర్ క్లౌడ్స్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రోహన్ భరద్వాజ్ సమర్పణలో లలిత రాజ్యలక్ష్మి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లలిత రాజ్యలక్ష్మి మాట్లాడుతూ– ''లవ్, క్రైమ్, డ్రామాగా నడిచే చిత్రమిది. కథ, కథనాలు నేటి ట్రెండ్‌కి తగ్గట్టుగా ఉంటాయి. ఈ నెలలోనే మా చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు. ప్రభాకర్ మాట్లాడుతూ– ''నేటి తరానికి నచ్చే చక్కని అంశాలు, సన్నివేశాలతో రాసుకున్న కథ ఇది. నిర్మాతలు, నటీనటుల సహకారంతో అనుకున్న విధంగా తెరకెక్కించాం. అక్షిత్‌కి ఈ చిత్రం చాలా పెద్ద అవకాశాల్ని తెస్తుంది. అనహిత చాలా బాగా నటించింది. ఈ చిత్రాన్ని తమిళంలో అనువదించి, విడుదల చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: దుర్గాప్రసాద్ కొల్లి, సంగీతం: పద్మనాభ్ భరద్వాజ్.

దేవుడే సమాధానం చెప్పాలి

శ్రీనివాస్, మహేంద్రన్

మహేంద్రన్, శ్రీ పల్లవి, కారుణ్య చౌదరి, కరోన్య కత్రిన్ ప్రధాన పాత్రల్లో శ్రీనివాస్ బండారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అసలు ఏం జరిగిందంటే'. అనిల్ బొద్దిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న రిలీజ్ కానున్న సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. శ్రీనివాస్ బండారి మాట్లాడుతూ – ''మనిషి జీవితంలో జరగబోయేది ఎవరికీ తెలియదు. దీనికి సమాధానం దేవుడే చెప్పాలి. కాలంతో పాటు పరిగెత్తడం తప్ప ఏమీ చేయలేం. అదే మా చిత్రంలో చెప్పాను. సెన్సార్ నుంచి 'యు' సర్టిఫికెట్ వచ్చింది'' అన్నారు. ''శ్రీనివాస్ బండారి తెరకెక్కించిన తీరు అందర్నీ ఆకట్టుకుంటుంది. మా సినిమాని అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నా'' అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ షానీ సాల్మన్. ''చైల్డ్ ఆర్టిస్ట్‌గా నన్ను ఆదరించారు. ఇప్పుడు హీరోగా ఓ మంచి సినిమాతో తెలుగులో పరిచయం అవుతున్న నాపై అదే ఆదరణ చూపుతారని ఆశిస్తున్నాను'' అన్నారు మహేంద్రన్. కిషోర్ తటవర్తి, కుమనన్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: కర్ణ ప్యారసాని.

సాక్షి స్పోర్ట్స్
శనివారం
14-3-2020

వన్డే సిరీస్ ముగిసింది

భారత్, దక్షిణాఫ్రికా మ్యాచ్‌లు కొనసాగించరాదని నిర్ణయం

కరోనా నేపథ్యంలో సిరీస్‌ను మధ్యలోనే రద్దు చేసిన బీసీసీఐ

శుక్రవారం లక్నో విమానాశ్రయంలో మాస్క్‌లతో భారత కెప్టెన్ కోహ్లి, బ్యాట్స్‌మన్ లోకేశ్ రాహుల్

ముంబై: ఐపీఎల్‌కు ముందే కోవిడ్-19 ప్రభావం భారత క్రికెట్ జట్టుపై పడింది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్‌లో భాగంగా రేపు, బుధవారం జరగాల్సి ఉన్న రెండు మ్యాచ్‌లను రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. ఈ రెండు వన్డేలను ప్రేక్షకులు లేకుండా నిర్వహించాలని గురువారమే నిర్ణయం తీసుకున్న బోర్డు... ఇప్పుడు వాటిని పూర్తిగా నిర్వహించకపోవడమే మేలని భావించింది. ఇరు జట్లు శుక్రవారం లక్నో చేరుకున్న తర్వాత బీసీసీఐ తమ నిర్ణయాన్ని ప్రకటించింది. 'ఐపీఎల్ ఎలాగూ వాయిదా పడింది. ప్రస్తుతం మన దేశంలో నెలకొన్న తీవ్ర పరిస్థితుల నేపథ్యంలో వన్డే సిరీస్ కూడా రద్దు చేయడమే మంచిది. భారత్‌లో కరోనా కేసుల సంఖ్య పెరుగుతుండటంతో దక్షిణాఫ్రికా జట్టు ఆటగాళ్లు కూడా ఆడేందుకు ఇష్టపడటం లేదు. వారంతా తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వీలైనంత తొందరగా స్వదేశం చేరుకోవాలని భావిస్తున్నారు' అని బీసీసీఐ ఉన్నతాధికారులు వెల్లడించారు. అన్ని చక్కబడిన తర్వాత రాబోయే రోజుల్లో ఈ సిరీస్‌ను ఎప్పుడైనా మళ్లీ నిర్వహిస్తామని కూడా బోర్డు కార్యదర్శి జై షా పేర్కొన్నారు. వన్డే సిరీస్ రద్దుపై కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ... 'ఆరోగ్య సమస్యలకంటే ఆర్థికపరంగా కలిగే నష్టం ఇప్పుడు పెద్దగా ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు.

'ఫిడే' గ్రాండ్‌ప్రి టోర్నీ: హారికకు ఏడో స్థానం

లుసానే: 'ఫిడే' మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక 5.5 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచింది. మరియా ముజిచుక్ (ఉక్రెయిన్)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌ను హారిక 26 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఏడు పాయింట్లతో నానా జాగ్‌నిద్జే (జార్జియా), గోర్యాచికినా (రష్యా) సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు.

2019 విజేత ముంబై ఇండియన్స్ జట్టు (ఫైల్)

ఐపీఎల్ ఆలస్యం

- ఏప్రిల్ 15 దాకా మ్యాచ్‌లు లేవని బీసీసీఐ ప్రకటన
- విదేశీ ఆటగాళ్లు వచ్చాకే ఆడించాలంటోన్న ఫ్రాంచైజీలు
- ప్రత్యామ్నాయ వేదికలపై బోర్డు కసరత్తు

న్యూఢిల్లీ: 'కరోనా' మజాకా... ఇది వచ్చాకా అన్నీ వేగంగా మారిపోతున్నాయి. నేడు తీసుకోవాల్సిన నిర్ణయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఓ రోజు ముందుగానే తీసుకుంది. ఈనెల 29న ప్రారంభం కావాల్సిన ఐపీఎల్ సీజన్‌ను ఏప్రిల్ 15 వరకు వాయిదా వేసింది. అప్పటిదాకా మ్యాచ్‌ల్ని నిలిపివేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆ తర్వాతైనా ఆయా వేదికల్లో సవ్యంగా జరుగుతుందా... లేదా అనేది కూడా అనుమానంగానే ఉంది. ఎందుకంటే ఢిల్లీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని రకాల క్రీడా ఈవెంట్లను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. 'కోవిడ్-19' మహమ్మారి వ్యాప్తిని నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఢిల్లీ హోమ్ గ్రౌండ్. ఢిల్లీ సర్కారు నిర్ణయం వెలువరించిన కొన్ని గంటల వ్యవధిలోనే బీసీసీఐ కూడా స్పందించింది. 'ఐపీఎల్-2020ని ఏప్రిల్ 15వ తేదీ వరకు నిలిపివేస్తున్నాం. నోవల్ కరోనా వైరస్ వ్యాపించకుండా ముందుజాగ్రత్త చర్య ల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నాం' అని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. అయితే బీసీసీఐ వచ్చేనెల 15 వరకు మ్యాచ్‌ల్ని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపింది. అయితే ఏప్రిల్ 16 నుంచైనా షెడ్యూల్ ప్రకారం జరుగుతుందా లేదా అనే విషయంపై స్పష్టత లేదు. ఎందుకంటే ఢిల్లీ ప్రభుత్వం ఈవెంట్ల రద్దు నిర్ణయం తీసుకోగా... మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు మ్యాచ్‌లకు అనుమతిని నిరాకరిస్తున్నాయి. పైగా విదేశీ ఆటగాళ్లు ఆడాలంటే వచ్చే నెల 15 వరకు వీసా నిబంధనలపై ఆంక్షలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యం లో బోర్డు, ఐపీఎల్ పాలక మండలి ప్రత్యామ్నాయ వేదికలపై కసరత్తు చేస్తున్నాయి. విదేశీ స్టార్లు లేకపోతే ఐపీఎల్ కూడా ఓ దేశవాళీ టోర్నీగా మారిపోతుందని దీంతో లీగ్ మజానే ఉండదని ఫ్రాంచైజీలు బోర్డుకు తెలిపాయి. అందుకే బోర్డు తాత్కాలికంగా పోటీలను రద్దు చేసింది. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు ఆడనివ్వకపోతే ప్రత్యామ్నాయ వేదికలుగా విశాఖపట్నం, లక్నో, రాజ్‌కోట్, ఇండోర్, రాయ్‌పూర్‌లను పరిశీలిస్తుంది.

ప్రస్తుతానికి ఐపీఎల్ వాయిదా వేయడం ముఖ్యం. అది జరిగిపోయింది. ప్రజల భద్రతకే అన్నింటికంటే ప్రథమ ప్రాధాన్యత కాబట్టి మేం వాయిదా వేశాం. ఏప్రిల్ 15 తర్వాత నిర్వహించగలమా అనేది ఇప్పుడే చెప్పలేం. అది మరీ తొందరపాటు అవుతుంది. ముందు ఏం జరుగుతుందో చూద్దాం. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ఇష్టమున్నా, లేకపోయినా మరో ప్రత్యామ్నాయమైతే లేదు.
-గంగూలీ,
బీసీసీఐ అధ్యక్షుడు

ఏం జరగొచ్చు...

- ఐపీఎల్‌ను పూర్తిగా వాయిదా వేసే అవకాశమే లేదు. ఎందుకంటే భవిష్యత్ పర్యటనల కార్యక్రమం (ఎఫ్‌టీపీ) ఎప్పుడో ఖరారైంది. బిజీ షెడ్యూలు వల్ల మార్పులకు అవకాశముండదు
- మార్చి 29 నుంచి మే 24 వరకు మొత్తం 56 రోజుల ఈవెంట్ కాస్తా ఇప్పుడు 39 రోజులకే (ఏప్రిల్ 16 నుంచి మే 24) పరిమితం అవుతుంది.
- ప్రతి రోజూ రెండేసి మ్యాచ్‌లు నిర్వహించాల్సిందే. ఇన్నాళ్లు శని, ఆదివారాల్లోనే రెండు మ్యాచ్‌లు జరిగేవి.
- ఫ్రాంచైజీలు టికెట్ల రూపేణా కోల్పోయే రాబడిని బీసీసీఐ సర్దుబాటు చేయాల్సి ఉంటుంది.
- వేల కోట్ల రూపాయలు వెచ్చించిన స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌కు కూడా ఆర్థిక వెసులుబాటు కల్పించాలి.
- ఇటీవలే ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించే రాష్ట్ర సంఘాలకు మ్యాచ్‌కు రూ. 30 లక్షలకు బదులుగా రూ.50 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. తాజాగా దీన్ని సమీక్షించే అవకాశం ఉంది.

సింధు నిష్క్రమణ

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నమెంట్‌లో ఈసారైనా టైటిల్ సొంతం చేసుకోవాలని ఆశించిన భారత స్టార్ ప్లేయర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. ప్రపంచ మాజీ చాంపియన్ ఒకుహారా (జపాన్)తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ పీవీ సింధు 21-12, 15-21, 13-21తో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. 68 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌లో అద్భుతంగా ఆడినా... రెండో గేమ్ నుంచి తడబడింది. అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది.

డబ్ల్యూహెచ్‌ఓ ఎలా చెబితే అలా!

టోక్యో ఒలింపిక్స్ నిర్వహణపై ఐఓసీ చీఫ్ థామస్ బాచ్ వివరణ

బెర్లిన్: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) చెప్పినట్లే తాము నడుచుకుంటామని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) తెలిపింది. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ (కోవిడ్-19) నేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలా లేదంటే రద్దు చేయాలా అనేది డబ్ల్యూహెచ్‌ఓ సిఫార్సులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని, ఆ సంస్థ ఎలా చెబితే అలా నడుచుకుంటామని ఐఓసీ చీఫ్ థామస్ బాచ్ తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఇప్పటికై తే విశ్వక్రీడల్ని విజయవంతంగా నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నాం. అయితే ఏ నిర్ణయమైనా డబ్ల్యూహెచ్‌ఓ సూచనల మేరకే ఉంటుంది. ఎప్పటికప్పుడు ఆ సంస్థతో మా ప్రతినిధులు సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. ఏదేమైనా కరోనా మహమ్మారి వల్ల ఆయా దేశాల్లో వాయిదా, రద్దయిన క్వాలిఫయింగ్ టోర్నీలతో పెను సవాళ్లు ఎదురవుతున్నాయి' అని అన్నారు. జపాన్ మాత్రం తమ దేశంలో జూలై 24 నుంచి ఆగస్టు 8 వరకు జరిగే టోక్యో ఒలింపిక్స్‌పై గంపెడు ఆశలతో స్టేడియాలకు కొత్తసొబగులు అద్దుతోంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒలింపిక్స్‌ను వాయిదా వేస్తేనే మేలని సలహా ఇచ్చారు. దీన్ని జపాన్ తోసిపుచ్చింది. 'ఐఓసీ, టోక్యో ఆర్గనైజింగ్ కమిటీ... ఒలింపిక్స్‌ను వాయిదా లేదంటే రద్దు చేయాలని ఎప్పుడూ అనుకోలేదు' అని ఒలింపిక్ కాంస్య పతక విజేత అయిన సీకో హషిమొటొ తెలిపింది.

అవీ... ఇవీ... అన్నీ కరోనా వల్లే!

- కొనసాగుతున్న జాతీయ, అంతర్జాతీయ టోర్నీల వాయిదా పర్వం
- క్రికెట్ మొదలుకొని ఫార్ములావన్, టీటీ, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ టోర్నీలకు దెబ్బ

న్యూఢిల్లీ: కరోనా వలయంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలు విలవిలలాడుతున్నాయి. ఆటలన్నీ వాయిదా లేదంటే రద్దవుతున్నాయి.

అథ్లెటిక్స్

- భోపాల్‌లో ఏప్రిల్ 6 నుంచి 8 వరకు జరగాల్సిన ఫెడరేషన్ కప్ జాతీయ జూ. టోర్నీ వాయిదా.
- ఏప్రిల్ 20న జరగాల్సిన బోస్టన్ మారథాన్ సెప్టెంబర్ 14కు... ఏప్రిల్ 26న జరగాల్సిన లండన్ మారథాన్ అక్టోబర్ 4కు వాయిదా.

బ్యాడ్మింటన్

- మార్చి 16 నుంచి ఏప్రిల్ 12 మధ్యకాలంలో వేర్వేరు వేదికలపై జరగాల్సిన స్విస్ ఓపెన్, ఇండియా ఓపెన్, ఓర్లీన్స్ మాస్టర్స్ ఓపెన్, మలేసియా ఓపెన్, సింగపూర్ ఓపెన్ టోర్నమెంట్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ప్రకటించింది.

బాస్కెట్‌బాల్

- ఈ నెల 18 నుంచి 22 వరకు బెంగళూరులో జరగాల్సిన ఎఫ్ఐబీఏ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ వాయిదా.

చెస్

- మే 31 వరకు జాతీయ చెస్ టోర్నీలు వాయిదా

టెన్నిస్

- ఆరు వారాలపాటు దేశవాళీ టోర్నమెంట్లు రద్దు

క్రికెట్

- ఐపీఎల్ ఏప్రిల్ 15 వరకు నిలిపివేత.
- భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ రద్దు
- శ్రీలంకలో ఉన్న ఇంగ్లండ్ క్రికెట్ జట్టు తమ పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా శ్రీలంకతో ఇంగ్లండ్ ఈ సిరీస్‌లో రెండు టెస్టులు ఆడాల్సింది.
- పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) టి20 టోర్నీలో ఆడుతున్న పలువురు విదేశీ క్రికెటర్లు అలెక్స్ హేల్స్, జేసన్ రాయ్, టైమల్ మిల్స్, లియామ్ డాసన్, లియామ్ లివింగ్‌స్టోన్, లూయిస్ గ్రెగెరీ, జేమ్స్ విన్సీ (ఇంగ్లండ్), కార్లోస్ బ్రాత్‌వైట్ (వెస్టిండీస్), రిలీ రోసూ (దక్షిణాఫ్రికా), జేమ్స్ ఫాస్టర్ (కోచ్) పీఎస్ఎల్‌ను వీడి వారి సొంత దేశాలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు.
- మార్చి 22 నుంచి ఏప్రిల్ 4 వరకు దక్షిణాఫ్రికాలో పర్యటించాల్సిన ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు ఈ పర్యటనను రద్దు చేసుకుంది. ఈ సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా జట్టు మూడు వన్డేలు, మూడు టి20 మ్యాచ్‌లు ఆడాల్సింది.

ఫుట్‌బాల్

- అట్లెటికో కోల్‌కతా, చెన్నైయిన్ ఎఫ్‌సీ జట్ల మధ్య గోవాలో నేడు జరగాల్సిన ఫైనల్ ప్రేక్షకులు లేకుండా గప్‌చుప్‌గా నిర్వహణ.
- ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఏప్రిల్ 4 వరకు వాయిదా. ఈపీఎల్‌లో పాల్గొనే అర్సెనల్ జట్టు మేనేజర్ మికెల్ అర్టెటా, చెల్సీ జట్టు సభ్యుడు కాలమ్ హడ్సన్‌లు కోవిడ్-19 బారిన పడ్డారు.
- భారత్, ఖతర్ ఫుట్‌బాల్ మధ్య భువనేశ్వర్‌లో ఈ నెల 26న... భారత్, అఫ్గానిస్తాన్‌ల మధ్య కోల్‌కతాలో జూన్ 9న జరగాల్సిన 'ఫిఫా' ప్రపంచకప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లు వాయిదా.
- ఐజ్వాల్‌లో వచ్చే నెల 14 నుంచి 27 వరకు జరగాల్సిన సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ ఫైనల్ రౌండ్ పోటీలు వాయిదా

గోల్ఫ్

- ఇండియా ఓపెన్ (న్యూఢిల్లీలో 19-22 వరకు) వాయిదా
- ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పీజీటీఐ) టోర్నీలన్నీ నిరవధికంగా వాయిదా

షూటింగ్

- ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ (న్యూఢిల్లీలో ఈ నెల 15-25) వాయిదా

ఫార్ములావన్

- మార్చి 15న ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి, మార్చి 22న బహ్రెయిన్, ఏప్రిల్ 5న జరగాల్సిన వియత్నాం గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ రేసులు రద్దు.

టేబుల్ టెన్నిస్

- ఏప్రిల్ చివరి వారం వరకు అన్ని అంతర్జాతీయ టోర్నీలు రద్దు చేస్తున్నట్లు అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ప్రకటించింది.

సౌరాష్ట్రకు 'జై'

- మొదటిసారి రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచిన జట్టు
- బెంగాల్‌తో ఫైనల్ మ్యాచ్ 'డ్రా'
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్
- గెలిపించిన కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్

గత ఏడు సీజన్లలో మూడుసార్లు ఫైనల్‌కు చేరినా... ఒక్కసారి కూడా రంజీ ట్రోఫీ గెలవలేకపోయిన సౌరాష్ట్ర ఎట్టకేలకు విజయబావుటా ఎగరేసింది. జైదేవ్ ఉనాద్కట్ నాయకత్వంలో తొలిసారి విజేతగా అవతరించింది. సొంత మైదానంలో హోరాహోరీగా సాగిన తుది పోరులో బెంగాల్‌పై సాధించిన 44 పరుగుల స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సౌరాష్ట్రను చాంపియన్‌ను చేసింది. చివరి రోజు నాలుగు వికెట్లతో ఆధిక్యం కోసం బెంగాల్ పోరాడినా లాభం లేకపోయింది. చివరకు రంజీ చరిత్రలో ఎక్కువ సార్లు ఫైనల్లో ఓడిన జట్టుగా బెంగాల్ నిలిచింది.

రాజ్‌కోట్: భారత దేశవాళీ క్రికెట్ ప్రధాన టోర్నీ రంజీ ట్రోఫీలో కొత్త చాంపియన్ అవతరించింది. జైదేవ్ ఉనాద్కట్ నేతృత్వంలోని సౌరాష్ట్ర జట్టు మొదటిసారి విజేతగా నిలిచింది. సౌరాష్ట్ర, బెంగాల్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ శుక్రవారం 'డ్రా'గా ముగిసింది. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా సౌరాష్ట్రకు ట్రోఫీ ఖరారైంది. చివరి రోజు 72 పరుగులు చేస్తే ఆధిక్యం అందుకునే స్థితిలో ఆట కొనసాగించిన బెంగాల్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 381 పరుగులకు ఆలౌటైంది. దాంతో మొదటి ఇన్నింగ్స్‌లో 425 పరుగులు చేసిన సౌరాష్ట్రకు 44 పరుగుల ఆధిక్యం దక్కింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 4 వికెట్లకు 105 పరుగులు చేసింది. అయితే విజేత ఖరారైన నేపథ్యంలో ముందుగానే ఆటను నిలిపివేసేందుకు ఇరు జట్లు అంగీకరించాయి. ఆ వెంటనే సొంత గడ్డపై సౌరాష్ట్ర సంబరాలు మొదలయ్యాయి. విజేత సౌరాష్ట్రకు రూ. 2 కోట్లు ప్రైజ్‌మనీ లభించింది.

ఉనాద్కట్ జోరు...

సీజన్ మొత్తం తన అద్భుత బౌలింగ్, కెప్టెన్సీతో సౌరాష్ట్రను నడిపించిన ఉనాద్కట్ చివరి రోజు కూడా కీలక పాత్ర పోషించాడు. ఓవర్‌నైట్ స్కోరు 354/6తో బరిలోకి దిగిన బెంగాల్ జట్టు అనుస్తుప్ మజుందార్ (151 బంతుల్లో 63; 8 ఫోర్లు)పైనే తమ ఆశలు పెట్టుకుంది. అయితే ఆరో ఓవర్లోనే ఆ జట్టుకు దెబ్బ పడింది. ఉనాద్కట్ బౌలింగ్‌లో అనుస్తుప్ ఎల్బీడబ్ల్యూగా దొరికిపోయాడు. బ్యాట్స్‌మన్ రివ్యూ చేసినా లాభం లేకపోయింది. అదే ఓవర్లో మరో రెండు బంతులకే ఆకాశ్ దీప్ (0) రనౌటయ్యాడు. సింగిల్ తీసేందుకు అవకాశం లేకపోయినా షాట్ ఆడిన ఆకాశ్ ముందుకు వచ్చాడు. కీపర్ బారోత్ విసిరిన బంతి స్టంప్స్‌ను తాకలేదు. అయితే చురుగ్గా వ్యవహరించిన ఉనాద్కట్ వెంటనే దాన్ని అందుకొని వికెట్లపైకి విసిరాడు. అప్పటికీ క్రీజ్‌లో వెనక్కి రాని ఆకాశ్ వెనుదిరిగాడు. ముకేశ్ కుమార్ (5)ను ధర్మేంద్ర జడేజా పెవిలియన్‌కు పంపగా... కొద్ది సేపటికే ఇషాన్ పొరెల్ (1)ను అవుట్ చేసి ఉనాద్కట్ బెంగాల్ ఆట ముగించాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర తరపున అవి బారోత్ (39) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హార్విక్ దేశాయ్ (21), విశ్వరాజ్ జడేజా (17), అర్పిత్ వసవాడ (3) వికెట్లు తీయడంలో బెంగాల్ సఫలమైంది. ఇన్నింగ్స్ 34వ ఓవర్ చివరి బంతికి బారోత్ అవుట్ కాగానే ఇరు జట్లు ఆటగాళ్లు కరచాలానికి సిద్ధపడ్డారు.

1 సౌరాష్ట్ర జట్టు రంజీ ట్రోఫీ గెలవడం ఇదే మొదటిసారి. 1950-51 సీజన్ నుంచి జట్టు ఈ పేరుతో బరిలోకి దిగుతోంది. అంతకుముందు సౌరాష్ట్రకు పూర్వ రూపంగా ఉన్న, ఇదే ప్రాంతానికి చెందిన రెండు జట్లు నవానగర్ (1936-37), వెస్టర్న్ ఇండియా (1943-44) రంజీల్లో విజేతలుగా నిలిచాయి. ఆ రెండు సార్లు ఫైనల్లో బెంగాలే ఓడింది.

12 రంజీల్లో అత్యధిక సార్లు ఫైనల్లో ఓడిన జట్టుగా బెంగాల్ నిలిచింది. 14 సార్లు తుది పోరుకు అర్హత సాధించిన బెంగాల్ 2 సార్లు మాత్రమే టైటిల్ అందుకోగలిగింది. బెంగాల్ ఆఖరిసారిగా 1989-90లో టైటిల్ సాధించింది.

67 ఈ సీజన్‌లో జైదేవ్ ఉనాద్కట్ తీసిన వికెట్లు. రంజీ చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో జైదేవ్ రెండో స్థానంలో నిలిచాడు. గత ఏడాది బిహార్ బౌలర్ అశుతోష్ అమన్ 68 వికెట్లు పడగొట్టాడు.

రిచర్డ్సన్‌కు కరోనా లేదు

కరోనా అనుమానంతో కివీస్‌తో తొలి వన్డేకు దూరమైన ఆస్ట్రేలియా పేసర్ కేన్ రిచర్డ్సన్‌కు ప్రమాదం ఏమీ లేదని తేలింది. ఉదయం అతనికి జరిపిన పరీక్షల్లో 'నెగెటివ్' రిపోర్టు వచ్చింది. తొలి వన్డేకు ముందు రిచర్డ్సన్ గొంతు నొప్పితో బాధపడ్డాడు. అతడిని పరిశీలించి వైద్య బృందం సూచన మేరకు జట్టు నుంచి తప్పించి విడిగా ఉంచారు. ఇటీవలే అతను విదేశాల నుంచి తిరిగి రావడంతో సందేహం పెరిగింది. దాంతో మ్యాచ్‌లో ఆడనివ్వకుండా వైద్య పరీక్షలకు పంపారు.

మూడో టైటిల్ ఎవరికో?

- నేడు చెన్నైయిన్, అట్లెటికో మధ్య ఐఎస్ఎల్-6 ఫైనల్
- ప్రేక్షకులు లేకుండానే తుది పోరు
- రాత్రి గం. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్షప్రసారం

గోవా: మూడోసారి ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టైటిల్‌ను గెల్చుకోవడానికి చెన్నైయిన్ ఎఫ్‌సీ, అట్లెటికో డి కోల్‌కతా జట్లు సిద్ధమయ్యాయి. నేడు జరిగే ఐఎస్ఎల్ సీజన్-6 ఫైనల్లో ఈ రెండు జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే చెరో రెండు సార్లు ఐఎస్ఎల్ చాంపియన్స్‌గా నిలిచిన కోల్‌కతా (2014, 2016)... చెన్నైయిన్ (2015, 17-18) మూడోసారి కూడా నెగ్గి ఈ లీగ్ చరిత్రలో అత్యధిక టైటిల్స్ గెలిచిన జట్టుగా అవతరించాలని ఉవ్విళ్లూరుతున్నాయి. సెమీఫైనల్ తొలి లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు చేతిలో 1-0తో వెనకబడిన కోల్‌కతా... రెండో లీగ్‌లో మాత్రం 3-1తో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. దాంతో ఓవరాల్ గోల్స్‌లో కోల్‌కతా 3-2తో బెంగళూరుపై గెలిచి ఫైనల్ చేరింది. మరోవైపు గోవా ఎఫ్‌సీతో జరిగిన సెమీఫైనల్ తొలి మ్యాచ్‌లో 4-1తో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన చెన్నైయిన్... రెండో మ్యాచ్‌లో మాత్రం 2-4తో వెనుకబడింది. అయితే ఓవరాల్ గోల్స్‌లో 6-5తో ఆధిక్యంలో ఉండటంతో చెన్నై తుది పోరులో నిలిచింది. కోల్‌కతా తరపున 15 గోల్స్ చేసిన రాయ్ కృష్ణ.. సెమీస్ రెండో లీగ్‌లో రెండు గోల్స్‌తో చెలరేగిన డేవిడ్ విలియమ్స్ మరోసారి కీలకం కానున్నారు. చెన్నై జట్టులో 14 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా ఉన్న వాల్‌స్కీస్, మిడ్ ఫీల్డ్‌లో రాఫెల్ ఫైనల్‌లో ఏ మాత్రం ప్రభావం చూపుతారో చూడాలి. కోవిడ్-19 భయంతో ఈ ఫైనల్ మ్యాచ్ ప్రేక్షకులు లేకుండానే జరగనుంది.

తొలి వన్డే ఆసీస్‌దే

సిడ్నీ: కోవిడ్-19 వైరస్ నేపథ్యంలో... ఖాళీ మైదానంలో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 71 పరుగుల తేడాతో గెలిచింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలుత ఆస్ట్రేలియా జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లకు 258 పరుగులు చేసింది. ఓపెనర్లు వార్నర్ (67; 9 ఫోర్లు), ఫించ్ (60; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 124 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. సోధికి 3 వికెట్లు దక్కాయి. అనంతరం న్యూజిలాండ్ 41 ఓవర్లలో 187 పరుగులకే ఆలౌటై ఓడింది. కమిన్స్, మిచెల్ మార్ష్ చెరో మూడు వికెట్లు తీశారు. కోవిడ్-19 వైరస్ నేపథ్యంలో మ్యాచ్ ముగిశాక ఇరు జట్ల ఆటగాళ్లు కరచాలనం కూడా చేసుకోలేదు.

సాక్షి బిజినెస్
శనివారం
14-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
1,325 ▲	365 ▲
34,103	9,955

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,494	▲ 292
డోజోన్స్	22,164	▲ 963
ఎఫ్‌టీఎస్‌ఈ 100	5,366	▲ 129
డాక్స్	9,232	▲ 71
షాంఘై	2,887	▼ 36
నికాయ్	17,431	▼ 1,129

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	73.35	75.00
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.54	94.76
€	యూరో	ఎస్‌బీఐ	81.71	84.71
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	68.96	71.53
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	45.77	47.89
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.78	53.53
SAR	సౌదీ రియాల్	ఫామ్‌సకుక్	18.65	20.51
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామ్‌సకుక్	18.78	21.01
¥	చైనా యువాన్	ఫామ్‌సకుక్	9.44	11.21

'కోవిడ్' కోస్టర్..!

భారీ నష్టాల నుంచి భారీ లాభాల్లోకి సూచీల యూ-టర్న్

- సెన్సెక్స్, నిఫ్టీలు ఆరంభంలోనే 10 శాతం డౌన్ • 45 నిమిషాల పాటు ట్రేడింగ్ నిలిపివేత
- మధ్యాహ్నం తర్వాత లాభాలు • జోరుగా వ్యాల్యూ బయింగ్ • అమెరికా ఉద్దీపన ఊసులు
- లాభాల్లో యూరప్, అమెరికా ఫ్యూచర్స్ • స్వల్పంగా పుంజుకున్న జనవరి తయారీ రంగం
- రెండు నెలల కనిష్టానికి ఫిబ్రవరి రిటైల్ ద్రవ్యోల్బణం • పెరిగిన రేట్ల కోత అంచనాలు
- ఇంట్రాడేలో 3,389 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ • 1,325 పాయింట్ల లాభంతో 34,103 వద్ద ముగింపు
- ఇంట్రాడేలో 1,035 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ • 365 పాయింట్ల లాభంతో 9,955 వద్ద ముగింపు

శుక్రవారం స్టాక్ మార్కెట్ చిత్ర, విచిత్ర గతులతో ఇన్వెస్టర్లకు, ట్రేడర్లకు చుక్కలు చూపించింది. ఆరంభంలోనే సెన్సెక్స్, నిఫ్టీలు 10 శాతం నష్టపోవడంతో 45 నిమిషాల పాటు ట్రేడింగ్‌ను నిలిపేశారు. ఆ తర్వాత సెన్సెక్స్, నిఫ్టీలు నష్టాల్లో ట్రేడైనా, మెల్లగా కోలుకొని, లాభాల్లోకి వచ్చాయి. కోవిడ్-19 వైరస్ భయాలున్నప్పటికీ, వేల్యూ బయింగ్, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు చోటు చేసుకోవడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాల దన్నుతో భారీ లాభాల్లో ముగిసింది. ఇంట్రాడేలో 3,389 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరకు 1,325 పాయింట్ల లాభంతో 34,103 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 1,035 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ చివరకు 365 పాయింట్ల లాభంతో 9,955 పాయింట్ల వద్దకు చేరింది. శాతం పరంగా చూస్తే, సెన్సెక్స్ 4%, నిఫ్టీ 3.8% లాభపడ్డాయి. అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ముగిశాయి. కరోనా భయాలను అరికట్టడానికి ఆర్‌బీఐతో కలిసి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోగలదని ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణ్యన్ భరోసానివ్వడం సానుకూల ప్రభావం చూపించింది.

5,380 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్.....

కోవిడ్ 19 వైరస్ కల్లోలం ఆర్థిక మాంద్యానికి దారితీస్తుందనే భయాలతో గురువారం ప్రపంచ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 10-12 శాతం, అమెరికా స్టాక్ సూచీలు 8 శాతం మేర క్షీణించాయి. ఈ ప్రభావంతో శుక్రవారం ఆసియా మార్కెట్లు నష్టాల్లోనే ఆరంభమయ్యాయి. ఈ ప్రభావంతో సెన్సెక్స్ 1,564 పాయింట్లు, నిఫ్టీ 482 పాయింట్ల నష్టాలతో మొదలయ్యాయి. పదినిమిషాల్లోనే సెన్సెక్స్ 3,389 పాయింట్ల నష్టంతో 29,389 పాయింట్లకు, నిఫ్టీ, 1,035 పాయింట్ల నష్టంతో 8,555 పాయింట్లకు పడిపోయాయి. ఈ రెండు సూచీలు 10 శాతం లోయర్ సర్క్యూట్ లిమిట్‌ను తాకడంతో ట్రేడింగ్‌ను 45 నిమిషాలు నిలిపేశారు. ఉ.10.20ని. తర్వాత మళ్లీ ట్రేడింగ్ ఆరంభమైంది. నష్టాలు మెల్లగా రికవరీ అయ్యాయి. మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీలు దూసుకుపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,991 పాయింట్ల లాభంతో 34,769 పాయింట్లకు, నిఫ్టీ 569 పాయింట్లతో 10,159 పాయింట్లకు చేరాయి. ఇంట్రాడే కనిష్ట స్థాయి నుంచి చూస్తే, సెన్సెక్స్ 4,714 పాయింట్లు, నిఫ్టీ 1,410 పాయింట్లు రికవరీ అయ్యాయి. మొత్తంమీద సెన్సెక్స్ రోజంతా 5,380 పాయింట్లు, నిఫ్టీ 1,604 పాయింట్ల రేంజ్‌లో కదలాడాయి.

అధ్వాన వారం...

ఇక వారం పరంగా చూస్తే, సెన్సెక్స్, నిఫ్టీలు భారీ స్థాయిలోనే నష్టపోయాయి. భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో అధ్వాన వారాల్లో ఒకటిగా ఈ వారం నిలిచిపోతుంది. హోలీ కారణంగా మంగళవారం సెలవు కావడంతో నాలుగు రోజులే జరిగిన ఈ వారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 3,473 పాయింట్లు, నిఫ్టీ 1,034 పాయింట్లు చొప్పున పతనమయ్యాయి. ఈ రెండు సూచీలు చెరో 9 శాతం నష్టపోయాయి. ఈ రెండు సూచీలు ఈ వారం జరిగిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో రెండింటిలో ఒక్క రోజులో అత్యధిక పాయింట్లు నష్టపోయాయి.

లాభాలు ఎందుకంటే...

- **వాల్యూ బయింగ్...**
  ఈ వారంలో స్టాక్ మార్కెట్ దాదాపు 8 శాతం మేర నష్టపోయింది. ఈ నష్టాల కారణంగా పలు షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. కొనుగోళ్లకు ఆకర్షణీయంగా ఉండటంతో ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లకు ఎగబడ్డారు.
- **'ఉద్దీపన' ఊసులు.. లాభాల్లో ప్రపంచ మార్కెట్లు**
  కోవిడ్-19 వైరస్ కల్లోలంతో అంతర్జాతీయంగా మాంద్యం తప్పదన్న భయాలు నెలకొన్నాయి. దీనిని నివారించేందుకు అమెరికాతో సహా పలు దేశాలు ఉద్దీపన చర్యలపై కసరత్తు చేస్తున్నాయి. శుక్రవారం నాడే అమెరికా ప్రభుత్వం ఉద్దీపన చర్యలను ప్రకటించే అవకాశాలున్నాయన్న అంచనాలతో అమెరికా స్టాక్ సూచీల ఫ్యూచర్లు భారీగా లాభపడ్డాయి. ఈ ప్రభావంతో ఆసియా మార్కెట్లు నష్టాల నుంచి రికవరీ కాగా, యూరప్ మార్కెట్లు 3 శాతం లాభాల్లో ఆరంభమయ్యాయి. ఈ సానుకూల అంతర్జాతీయ సంకేతాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి.
- **జోష్‌నిచ్చిన గణాంకాలు...**
  జనవరిలో తయారీ రంగం స్వల్పంగా పుంజుకుందని, అలాగే ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం రెండు నెలల కనిష్టానికి పడిపోయిందని గణాంకాలు వెల్లడించాయి. దీంతో ఆర్‌బీఐ వడ్డీరేట్లను తగ్గించగలదన్న అంచనాలు నెలకొన్నాయి. దీంతో కొనుగోళ్ల జోరుగా సాగాయి. .
- **రూపాయి రికవరీ....**
  గురువారం భారీగా నష్టపోయిన రూపాయి శుక్రవారం కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 47 పైసలు పుంజుకొని 73.81కు రికవరీ కావడం సానుకూల ప్రభావం చూపించింది.
- **భారత్‌లో కోవిడ్ ప్రభావం తక్కువే...**
  భారత్‌లో కోవిడ్-19 వైరస్ సోకిన వారి సంఖ్య 75కు పెరిగింది. వీరిలో 17 మంది విదేశీయులు. ఇతర దేశాలతో పోల్చితే భారత్‌పై కోవిడ్ ప్రభావం తక్కువగానే ఉంది. ఇక ప్రపంచవ్యాప్తంగా ఈ వైరస్ బాధితుల సంఖ్య 1.30 లక్షలకు, మరణించిన వారి సంఖ్య 4.900కు చేరింది.



సెన్సెక్స్ ఆరంభం 31,214 (-1,564)

మరిన్ని విశేషాలు...

- సెన్సెక్స్ షేర్లలో 5 షేర్లే నష్టపోగా, మిగిలిన 25 షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఎస్‌బీఐ 14% లాభంతో రూ. 242 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో భారీగా పెరిగిన షేర్ ఇదే కావడం గమనార్హం.
- దాదాపు 1,300కు పైగా షేర్లు ఇంట్రాడేలో ఏడాది కనిష్టానికి పడిపోయాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ, జిల్లెట్ ఇండియా, బజాజ్ ఆటో తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- ఈ నెల 17న జరిగే బోర్డ్ సమావేశంలో షేర్ల బైబ్యాక్ అంశాన్ని పరిశీలించనుండటంతో సన్ ఫార్మా షేర్ 8% లాభంతో రూ.384కు పెరిగింది.
- టెలికం రంగానికి ప్రభుత్వం ప్యాకేజీని ప్రకటించగలదన్న వార్తల కారణంగా భారతీ ఎయిర్‌టెల్ 5 శాతం, వొడాఫోన్ ఐడియా షేరు 34 శాతం మేర లాభపడ్డాయి. ఈ కంపెనీలకు రుణాలిచ్చిన పలు ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల షేర్లు కూడా భారీగానే ఎగబాకాయి.

ప్రపంచమార్కెట్లలో కరోనా ప్రళయం కొనసాగుతూనే ఉంది. మహా పతనాల బాటలో స్టాక్‌మార్కెట్లు శుక్రవారం కూడా మరింత అధఃపాతాళానికి పడిపోయాయి. భారత్‌లో తొలి కరోనా మరణం నమోదు కావడంతో మార్కెట్ మరోమారు అత్యంత ఘోరంగా కుప్పకూలింది. అయితే, అంతేవేగంతో నేలక్కొట్టిన బంతిలా మార్కెట్ దూసుకెళ్లి ఇన్వెస్టర్లకు అసలుసిసలు రోలర్ కోస్టర్ రైడ్‌ను చూపించింది. గడిచిన 12 ఏళ్లలో ఎన్నడూ జరగని రీతిలో తొలిసారి మన స్టాక్ మార్కెట్లో మళ్లీ ట్రేడింగ్ నిలిపేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఒకానొక దశలో సెన్సెక్స్ 3,389 పాయింట్లు నష్టపోయి... ఆ కనిష్ట స్థాయి నుంచి 5,380 పాయింట్లు దూసుకెళ్లడం తీవ్రమైన ఒడిదుడుకులకు నిదర్శనం. చివరకు 1,325 పాయింట్లు లాభపడి 34,103 వద్ద ముగిసింది. ఒకేరోజు ఇంత ఘోరంగా పడిపోవడం, మళ్లీ ఈస్థాయిలో రికవరీ.. ఈ రెండూ కూడా కొత్త రికార్డులే కావడం గమనార్హం. కాగా, శుక్రవారం ఆరంభంలో 15 నిమిషాల్లోనే రూ.12.9 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద తుడిచిపెట్టుకుపోగా... చివరికి ఈ నష్టాలన్నింటినీ పూడ్చుకోవడంతోపాటు రూ.3.5 లక్షల కోట్ల మార్కెట్ విలువ పెరగడం విశేషం!!

కనిష్టం 29,389 (-3,389)

గరిష్టం 34,769 (+1,991) కనిష్టం నుంచి 5,380 పాయింట్ల రికవరీ

ముగింపు 34,103 (+1,325)

సెన్సెక్స్, నిఫ్టీలు ఆరంభంలోనే 10 శాతం మేర నష్టపోయాయి. సెన్సెక్స్ 3,389 పాయింట్లు, నిఫ్టీ 1,035 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. 15 నిమిషాల్లో 12 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. ఉదయం. గం.10.20ని. లకు ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్

15 నిమిషాల్లో... 12 లక్షల కోట్లు హాం ఫట్!

ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.12.9 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.1,12,78,173 కోట్లకు పడిపోయింది. మధ్యాహ్నం తర్వాత సూచీలు లాభాల్లోకి మళ్లాయి. చివరకు భారీ లాభాల్లో ముగిశాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపద రూ.3.55 లక్షల కోట్లు ఎగసి రూ.1,29,26,243 కోట్లకు పెరిగింది. కాగా గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో రూ.15 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది.

12 ఏళ్లలో మొదటిసారి...

నిఫ్టీ, సెన్సెక్స్‌లు 10 శాతం లోయర్ సర్క్యూట్ పరిమితిని తాకడంతో స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్‌ను 45 నిమిషాల పాటు నిలిపేశారు. ఇలా సర్క్యూట్ బ్రేకర్ కారణంగా ట్రేడింగ్ నిలిచిపోవడం గత 12 ఏళ్లలో ఇదే మొదటిసారి. ఈ సర్క్యూట్ బ్రేకర్స్ సంగతేంటో చూద్దాం...

స్టాక్ మార్కెట్లో అధిక స్థాయిల్లో నెలకొనే ఒడిదుడుకులను నివారించే ఉద్దేశంతో సర్క్యూట్ బ్రేకర్ విధానాన్ని అనుసరిస్తారు. సెన్సెక్స్, నిఫ్టీలు 10, 15, 20 శాతం... ఈ మూడు స్థాయిల్లో పెరిగినా, పతనమైనా, సర్క్యూట్ బ్రేకర్లు వర్తిస్తాయి.

- **10 శాతం:** ఉదయం సెషన్‌లో ట్రేడింగ్‌ను 45 నిమిషాల పాటు ఆపేస్తారు. ఒంటి గంట నుంచి గం.2.30 ని. మధ్య అయితే 15 నిమిషాల పాటు ట్రేడింగ్‌ను నిలిపేస్తారు. గం.2.30.ని. తర్వాత ట్రేడింగ్ నిలిపివేత ఉండదు.
- **15 శాతం:** మధ్యాహ్నం ఒంటి గంటకు ముందు ట్రేడింగ్‌ను గం.1.45 నిమిషాలు నిలిపేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల మధ్య అయితే 45 నిమిషాల పాటు ట్రేడింగ్‌ను ఆపేస్తారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అయితే ఆ రోజుకు పూర్తిగా ట్రేడింగ్‌ను నిలిపేస్తారు.
- **20 శాతం ఉంటే...:** ట్రేడింగ్‌ను ఆ రోజుకు పూర్తిగా ఆపేస్తారు.
- **2008, జనవరి 22:** సర్క్యూట్ బ్రేకర్ల కారణంగా ట్రేడింగ్ నిలిచిపోయింది. లేమాన్ బ్రదర్స్ దివాలా తీయడంతో ప్రపంచ మార్కెట్లు భారీగా పతనం కావడంతో సెన్సెక్స్ 1,408 పాయింట్లు పతనమైంది. సెన్సెక్స్ వెయ్యి పాయింట్లకు పైగా పతనం కావడం ఇదే మొదటిసారి.
- **2009, మే 18:** యూపీఏ ప్రభుత్వం రెండోసారి భారీ మెజార్టీతో అధికారంలోకి రావడంతో సెన్సెక్స్ 17 శాతం (2,111 పాయింట్లు) లాభపడి 14,284 పాయింట్లకు ఎగసింది. ఆ ఒక్క రోజే రెండు సార్లు సెన్సెక్స్ సర్క్యూట్ బ్రేకర్లను తాకింది. 1992, మార్చి 2న అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ఉదార ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టడంతో సెన్సెక్స్ 21 శాతం ఎగసింది. ఈ సందర్భంలో కూడా ట్రేడింగ్‌ను నిలిపేశారు.

పసిడికీ 'వైరస్'

70 డాలర్లకు పైగా పతనం

న్యూయార్క్: పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్- నైమెక్స్‌లో భారీ పతనాన్ని చూసింది. ఈ వార్తరాసే 11 గంటల సమయంలో పసిడి ధర 71 డాలర్ల నష్టంతో (4.5%) 1,520 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో 1,504 డాలర్ల స్థాయికీ పడిపోయింది. 2020లో ఈ స్థాయికి పసిడి ధరలు పడిపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. గడచిన 52 వారాల్లో 1,266 డాలర్ల కనిష్టాన్ని చూసిన బంగారం ధర, వాణిజ్య యుద్ధం, భౌగోళిక ఉద్రిక్తతలు, కోవిడ్-19 భయాలతో మూడు వారాల క్రితం 1,704.30 గరిష్ట స్థాయిలనూ చూసింది.

కారణమేమిటి?: ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో బడా ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను సురక్షిత సాధనాల నుంచి వేగంగా మార్చేస్తున్నారు. భారీగా పెరిగిన బంగారం ధర నేపథ్యంలో... వారి ఇన్వెస్ట్‌మెంట్లను శుక్రవారం ఈక్విటీల్లోకి మళ్లించినట్లు సంకేతాలు అందుతున్నాయి.

దేశీయంగానూ భారీ తగ్గుదల: దేశీయంగానూ పసిడి ధర దిగివస్తోంది. ఈ వార్త రాసే సమయానికి దేశీయ ఫ్యూచర్స్ ఎంసీఎక్స్‌లో పసిడి 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత ధర రూ.1,885 తగ్గి, రూ.40,321 వద్ద ట్రేడవుతోంది. శుక్రవారం పలు దేశీయ స్పాట్ మార్కెట్లలో పసిడి ధర రూ.1,500 వరకూ పడింది. కాగా, డాలర్ మారకంలో రూపాయి మారకం విలువ బలహీనత వల్ల ధర మరింతగా పడడం లేదు.

రూపాయికి ఆర్‌బీఐ బూస్ట్

ముంబై: ద్రవ్య లభ్యత (లిక్విడిటీ) విషయంలో భయాందోళన పడాల్సింది ఏదీ లేదని, ఇందుకు తగిన చర్యలు అన్నింటినీ తీసుకుంటున్నామనీ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇచ్చిన హామీ శుక్రవారం రూపాయికి వరమయ్యింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ మారకంలో రూపాయి విలువ ఒకేరోజు 48 పైసలు బలపడి 73.80 వద్ద ముగిసింది. ఒకదశలో 74.50 స్థాయినీ చూసింది. సోమవారం 2 బిలియన్ డాలర్లను బ్యాంకింగ్‌కు విక్రయించనున్నట్లు కూడా ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. గురు, శుక్రవారాల్లో ఇంట్రాడేలో 74.50ని చూసినా, ఇప్పటి వరకూ కనిష్ట స్థాయి ముగింపు 74.39 మాత్రమే.

'యస్' ప్రణాళికకు కేంద్రం ఓకే..

- త్వరలో మారటోరియం ఎత్తివేత
- ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ.. చెరి రూ.1,000 కోట్లు
- రూ. 600 కోట్లు దాకా యాక్సిస్ బ్యాంక్, రూ. 500 కోట్లు కోటక్ మహీంద్రా పెట్టుబడి

న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్‌ను గట్టెక్కించేందుకు ఉద్దేశించిన పునరుద్ధరణ ప్రణాళికకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రణాళికను నోటిఫై చేసిన 3 రోజుల్లోగా బ్యాంకుపై మారటోరియంపరమైన ఆంక్షలను ఎత్తివేయనున్నట్లు, 7 రోజుల్లోగా కొత్త బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం తెలిపారు. 'ఆర్‌బీఐ ప్రతిపాదించిన యస్ బ్యాంక్ పునరుద్ధరణ ప్రణాళికకు కేబినెట్ ఆమోదం తెలిపింది. డిపాజిటర్ల ప్రయోజనాలు పరిరక్షించేందుకు, యస్ బ్యాంక్‌ను స్థిరపర్చేందుకు, బ్యాంకింగ్ వ్యవస్థలో పరిస్థితులు స్థిరంగా ఉండేలా చూసేందుకు ఈ స్కీమ్ తోడ్పడుతుంది' అని మంత్రి తెలిపారు. ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)..49 శాతం వాటాలు కొనుగోలు చేస్తోందని, యస్ బ్యాంకు కొత్త బోర్డులో ఎస్‌బీఐ డైరెక్టర్లు ఇద్దరు ఉంటారని ఆమె చెప్పారు. కొత్త బోర్డు ఏర్పాటైన 7 రోజుల్లోగా అడ్మినిస్ట్రేటర్ తప్పకుంటారన్నారు. ఎస్‌బీఐ వాటాలకు సంబంధించి 26%కి మాత్రమే మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుందని, మిగతా ఇన్వెస్టర్లకు 75% వాటాలకు ఇది వర్తిస్తుందని మంత్రి చెప్పారు. ఇక, పెరుగుతున్న మూలధన అవసరాలకు అనుగుణంగా యస్ బ్యాంక్ అధీకృత మూలధనాన్ని రూ. 6,200 కోట్లకు పెంచినట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆర్‌బీఐ ముసాయిదా పునరుద్ధరణ ప్రణాళిక ప్రకారం.. అధీకృత మూలధనం రూ. 5,000 కోట్లు.

ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ పెట్టుబడులు..

యస్ బ్యాంకులో రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఐసీఐసీఐ బ్యాంకు తెలియజేసింది. ఇది 5 శాతం పైగా వాటాలకు సమానమవుతుంది. అయితే, పునరుద్ధరణ స్కీమ్ ప్రకారం తుది వాటాల సంగతి వెల్లడవుతుందని పేర్కొంది. అటు రుణాల సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ కూడా రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వెల్లడించింది. యాక్సిస్ బ్యాంక్ సైతం రూ. 600 కోట్లతో 60 కోట్ల దాకా షేర్లు కొనుగోలు చేయనుంది. కోటక్ మహీంద్రా బ్యాంకు కూడా రూ. 500 కోట్లతో 50 కోట్ల షేర్లు తీసుకోనున్నట్లు స్ఛేంజీలకు తెలిపింది.

కేబినెట్ భేటీ అనంతరం మాట్లాడుతున్న నిర్మలా సీతారామన్. చిత్రంలో మంత్రులు ప్రకాశ్ జవదేకర్, పియూష్ గోయల్

యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్, ఆయన భార్య బిందుపై సీబీఐ మరో కేసు నమోదు చేసింది. అవంత రియల్టీ గ్రూప్ సంస్థలకు యస్ బ్యాంక్ ద్వారా రుణాలిప్పించి, రాణా కపూర్ ప్రతిఫలంగా ఢిల్లీలోని ఓ భవంతిని అత్యంత చౌకగా తీసుకున్నారనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. వివరాల్లోకి వెడితే.. అవంత సంస్థలకు రూ. 1,900 కోట్ల రుణాలిచ్చినందుకు ప్రతిగా బ్లిస్ అబోడ్ అనే సంస్థ ద్వారా ఢిల్లీలోని బంగళాను రూ. 378 కోట్లకు కపూర్ కొనుగోలు చేశారు. ఈ బ్లిస్ అబోడ్ అనే సంస్థ ఇద్దరు డైరెక్టర్లలో బిందు కూడా ఒకరు. బంగళాను కొన్న వెంటనే రాణా కపూర్.. దాన్ని ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టి రూ. 685 కోట్లు తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి బ్లిస్ అబోడ్, అవంత రియల్టీ, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ కార్యాలయాల్లో సీబీఐ సోదాలు నిర్వహించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, తమ కార్యాలయాల్లో సోదాల వార్తలను ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ తోసిపుచ్చింది.

రాణా కపూర్‌పై మరో సీబీఐ కేసు..

పరిశ్రమలకు ఉపశమనం కల్పిస్తాం

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

దేశీయ, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లను ప్రభుత్వం, ఆర్‌బీఐ నిశితంగా పరిశీలిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కరోనా వైరస్ కారణంగా తీవ్రంగా ప్రభావితమైన పరిశ్రమలకు ఉపశమనం కల్పించే చర్యల కోసం ప్రభుత్వంలోని భిన్న శాఖలు కలసికట్టుగా పనిచేస్తున్నాయని ఆమె చెప్పారు. ''కరోనా వైరస్ కారణంగా ఎదురైన సవాళ్ల నుంచి బయటకు వచ్చేందుకు అన్ని రంగాలతో నేను సమావేశం నిర్వహించిన విషయం మీకు తెలుసు. ఆయా పరిశ్రమలు సవాళ్ల నుంచి బయటకు వచ్చేందుకు తాము ఎంత మేరకు మెరుగ్గా సాయం అందించొచ్చన్న దానిపై ప్రతి శాఖా ఎంతో సమయం వెచ్చిస్తోంది'' అని మంత్రి వివరించారు.

అస్థిరతల కట్టడికి చర్యలు: సెబీ

న్యూఢిల్లీ: కరోనా వైరస్ కారణంగా ఇన్వెస్టర్లలో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు సెబీ, కేంద్రం చొరవ తీసుకున్నాయి. స్టాక్ మార్కెట్లలో అస్థిరతలను కట్టడి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సెబీ ప్రకటించింది. తీవ్ర అమ్మకాలతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రారంభంలోనే 10 శాతం కుప్పకూలడంతో ట్రేడింగ్‌ను 45 నిమిషాల పాటు నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో సెబీ ఓ ప్రకటన విడుదల చేసింది. ''కరోనా వైరస్ మహమ్మారి వల్ల ఆర్థిక మందగమనం, చమురు ధరల పతనంపై ఆందోళనలతో గత కొన్ని రోజులుగా భారత స్టాక్ మార్కెట్.. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లకు అనుగుణంగా చలిస్తోంది. అవసరమైతే తగిన చర్యలు తీసుకునేందుకు సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు సన్నద్ధంగా ఉన్నాయి'' అని సెబీ తన ప్రకటనలో పేర్కొంది.

సీఐఐ సౌత్ చైర్మన్‌గా సతీష్ రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సీఐఐ దక్షిణ ప్రాంత చైర్మన్‌గా డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్‌గా కెవిన్ కేర్ ప్రై.లి. సీఎండీ సీకే రంఘనాథన్ ఎంపిక య్యారు. 2020-21 సంవత్సరానికి గాను వీళ్లు ఈ పదవిలో కొనసాగుతారని సీఐఐ ఒక ప్రకట నలో తెలిపింది. గతంలో సతీష్ రెడ్డి 2019-20 కాలానికి సీఐఐ సౌత్ రీజియన్‌కు డిప్యూటీ చైర్మ న్‌గా, 2003-04లో సీఐఐ నేషనల్ ఫార్మా కమిటీకి, సీఐఐ ఏపీ స్టేట్ కౌన్సిల్‌లకు మాజీ చైర్మన్‌గా కూడా పని చేశారు.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	43,100	▼ 1470
బంగారం (22 క్యారెట్లు)	41,050	▼ 1400
వెండి (కిలో)	46,000	▼ 2900
హైదరాబాద్/చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	42,140	▼ 1510
బంగారం (22 క్యారెట్లు)	40,130	▼ 1440
వెండి (కిలో)	46,000	▼ 2900
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	42,300	▼ 700
బంగారం (22 క్యారెట్లు)	39,170	▼ 640
వెండి (కిలో)	44,300	▼ 2200
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	43,000	▼ 950
బంగారం (22 క్యారెట్లు)	39,990	▼ 880
వెండి (కిలో)	45,000	▼ 1500
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	43,400	▼ 1680
బంగారం (22 క్యారెట్లు)	40,130	▼ 1440
వెండి (కిలో)	44,100	▼ 2700

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	32.11 (రాత్రి 11.30కు)	$ 31.50 (గురువారం ముగింపు)
బ్రెంట్	34.27 (రాత్రి 11.30కు)	$ 33.22 (గురువారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 14-3-2020

విశాఖ	355-00
చిత్తూరు	323-00
వరంగల్	298-00
విజయవాడ	324-00
గోదావరి	324-00
13-3-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	295-00

ఆరు నెలల క్షీణతకు తెర!

- ఫిబ్రవరి ఎగుమతుల్లో 2.91 శాతం వృద్ధి
- దిగుమతులూ వృద్ధిబాటలోకి...
- వాణిజ్యలోటు 9.85 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: భారత్ ఎగుమతులు ఆరు నెలల తర్వాత ఫిబ్రవరిలో 2.91 శాతం స్వల్ప వృద్ధిరేటును నమో దుచేసుకున్నాయి. అంటే 2019 ఫిబ్రవరితో పోల్చితే 2020 ఫిబ్రవరిలో ఎగుమతులు 2.91 శాతం పెరిగాయన్నమాట. విలువ రూపంలో 27.65 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. పెట్రోలియం, ఇంజనీరింగ్, కెమికల్స్ వంటి రంగాల ఎగుమతుల్లో వృద్ధి నమోదుకావడం దీనికి కారణం. వాణిజ్య మంత్రిత్వశాఖ శుక్రవారం తాజా గణాంకాలను విడుదల చేసింది.

దిగుమతుల్లో 2.48 శాతం వృద్ధి

ఇక గడచిన ఎనిమిది నెలలుగా క్షీణతలో ఉన్న భారత్ ఎగుమతులూ వృద్ధిబాటలోకి వచ్చాయి. ఫిబ్రవరిలో 2.48 శాతం వృద్ధి రేటు నమోదయ్యిం ది. విలువ రూపంలో ఈ మొత్తం 37.50 బిలియన్ డాలర్లు. వెరసి ఎగుమతులు- దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు ఫిబ్రవరిలో 9.85 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గడచిన 12 నెలలుగా ఇంత తక్కువ వాణిజ్యలోటు ఇదే తొలిసారి.

కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- ఫిబ్రవరిలో పసిడి దిగుమతులు 8.5 శాతం పడి పోయి 2.36 బిలియన్ డాలర్లుగా నమో దయ్యాయి.

- సుగంధ ద్రవ్యాలు, జీడిపప్పు, ఆయిల్ సీడ్స్, సముద్ర ఉత్పత్తులు, ముడి ఇనుము, ఔషధాలు, తివాచీ, హస్త కళల ఉత్పత్తుల ఎగుమతులు సానుకూల ఫలితాలను నమోదుచేసుకున్నాయి.
- ఎలక్ట్రానిక్ గూడ్స్ ఎగుమతులు 37 శాతం పెరిగాయి. రసాయనాల ఎగుమతులు 16 శాతం ఎగశాయి.
- చమురు దిగుమతులు 14.26 శాతం పెరిగి 10.76 బిలియన్ డాలర్లుగా నమోదయితే, చమురు యేతర దిగుమతులు 1.6 శాతం ఎగసి 26.74 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకూ..

ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకూ చూస్తే, ఎగుమతులు 1.5 శాతం క్షీణతతో 292.91 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే కాలంలో దిగుమతులూ 7.30 శాతం పడిపోయి 436 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి వాణిజ్యలోటు 143.12 బిలియన్ డాలర్లుగా ఉంది.

ఎగుమతిదారులకు పన్ను రిఫండ్ స్కీమ్!

అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పోటీ పూర్వక పరిస్థితులను భారత్ ఎగుమ తిదారులు ఎదుర్కొనడానికి కేంద్రం శుక్రవారం కీలక నిర్ణయాన్ని తీసుకుంది. వివరాల్లోకి వెళితే, ఎగుమతిదారులు చెల్లిస్తున్న కొన్ని పన్నులు, సుంకాల రిఫండ్‌లకు సంబంధించి ఒక స్కీమ్‌ను ప్రకటించింది. విలువ జోడింపు పన్ను, బొగ్గు సెస్, మండీ పన్ను, విద్యుత్ సుంకాలు, రవాణాకు వినియోగించే ఇంధన వ్యయాలు తత్సంబంధ అంశాలకు సంబంధించి ఎగుమతిదారులపై వార్షికంగా రూ.50,000 కోట్ల భారం పడుతోంది. ప్రస్తుతం ఉన్న ఏ పథకం కిందా వీటికి మినహాయింపులు లభించడంలేదు. అయితే ఎగుమతిదారులు చెల్లిస్తున్న ఈ పన్నులు, సుంకాలు, వ్యయాలను తిరిగి ఇచ్చేయడానికి ఆర్ఓడీటీఈపీ (రెమిషన్ ఆఫ్ డ్యూటీస్ ఆర్ ట్యాక్సెస్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ప్రొడక్ట్స్) పేరుతో ఒక పథకాన్ని ప్రవేశపె డతామని గత ఏడాది ఆర్థికమంత్రి నిర్మలాసీ తారామన్ ప్రకటించారు. ఈ దిశలో తాజా స్కీమ్‌ను కేంద్ర క్యాబినెట్ శుక్రవారం ఆమోదిం చింది. అయితే పునఃచెల్లింపు (ఆర్ఓడీటీఈపీ) రేటు ఏ మేర ఉండాలన్న విషయాన్ని సంబంధిత వర్గాలతో సంప్రదింపుల ద్వారా 6 నుంచి 8 నెలల్లో నిర్ణయించడం జరుగుతుందని వాణిజ్య, పారిశ్రామిక వ్యవహారాల శాఖ మంత్రి పియూష్ గోయెల్ ప్రకటించారు. నిజా నికి భారత్‌లో మర్చెండైస్ ఎక్స్‌పోర్ట్ ఫ్రమ్ ఇండియా స్కీమ్ (ఎంఈఐఎస్) అమల్లో ఉంది. ఈ పథకం కింద ఎగుమతిదారులకు కొన్ని ప్రయోజనాలూ లభిస్తున్నాయి. అయితే వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నేపథ్యంలో ఈ పథకాన్ని దశలవారీగా తొలగిస్తున్నారు. దీని స్థానంలోనే ఆర్ఓడీటీ ఈపీని ప్రవేశపెడుతున్నట్లు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి.

సేవల రంగం ఇలా...

ఇదిలావుండగా, జనవరిలో సేవల రంగం ఎగుమ తులు 19 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. సేవల దిగుమతుల విలువ 12 బిలియన్ డాలర్లు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ గణాంకాలను విడుదల చేసింది.

ఎయిరిండియా బిడ్డింగ్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా విక్రయానికి సంబం ధించి బిడ్డింగ్ గడువును ఏప్రిల్ 30 దాకా పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ఇది మార్చి 17తో ముగుస్తుంది. ప్రస్తుతం కరోనా వైరస్‌పరమైన ప్రతికూల పరిస్థితులు, ఆసక్తి గల బిడ్డర్ల నుంచి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని ఆఖరు తేదిని పొడిగించినట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం ఒక నోటిఫికే షన్‌లో తెలిపింది.

అర్బన్ కోపరేటివ్ బ్యాంకుల రుణ నిబంధనల్లో సవరణ

ముంబై: అర్బన్ కోపరేటివ్ బ్యాంకుల రుణాల పంపిణీ నిబంధనలను ఆర్‌బీఐ సవ రించింది. ఈ తరహా బ్యాంకులు ఇప్పటి వరకు ఒక రుణ గ్రహీతకు అయితే తమ టైర్-1 క్యాపిటల్‌లో గరిష్టంగా 15%, ఒక గ్రూపునకు అయితే 40% వరకు రుణాన్ని ఇచ్చేందుకు ఆర్‌బీఐ అనుమతించేది. ఇక మీదట సవరించిన నిబంధనల ప్రకారం.. టైర్-1 క్యాపిటల్‌లో ఒక రుణ గ్రహీతకు గరిష్టంగా 15%, గ్రూపునకు 25% వరకే రుణం మంజూరు చేయవచ్చు.

వివాద్ సే విశ్వాస్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారులు తమ వివా దాలను సరళతరమైన రీతిలో పరిష్కరించు కోడానికి వీలుకల్పిస్తున్న వివాద్ సే విశ్వాస్ బిల్లుకు రాజ్యసభ మూజువాణీ ఓటుతో ఆమోదముద్ర వేసింది. మార్చి 4వ తేదీనే బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. శుక్రవారం రాజ్యసభ కూడా దీనికి ఆమోద ముద్ర వేయడంతో బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందింది. జూన్ 30వ తేదీలోపు వడ్డీ, జరిమానాలు లేకుండా కేవలం పన్ను చెల్లింపుల ద్వారా సంబంధిత వివాదాల పరి ష్కారానికి ఈ బిల్లు వీలుకల్పిస్తోంది.

ఫిబ్రవరిలో తగ్గిన వాహన విక్రయాలు

న్యూఢిల్లీ: దేశీ వాహన అమ్మకాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో భారీగా తగ్గాయి. సియామ్ వెల్ల డించిన తాజా సమాచారం ప్రకారం.. గత నెల్లో మొత్తం వాహన రంగ విక్రయాలు 16,46,332 యూనిట్లుగా ఉన్నాయి. అంతక్రితం ఏడాది (2019) ఇదే కాలంలోని 20,34,597 యూనిట్ల అమ్మకాలతో పోల్చితే ఏకంగా 19.08 శాతం క్షీణత నమోదైంది.

కేటీఆర్ చేతుల మీదుగా అవార్డులు

కేటీఆర్ చేతుల మీదుగా వింగ్స్ ఇండియా అవార్డుల కార్యక్రమం జరిగింది. మోస్ట్ డెడికేటెడ్ ఔట్‌లుక్ ఫర్ ఏరోస్పేస్ ఇండస్ట్రీ అవార్డును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందుకుంది. టర్బో మేఘా ఎయిర్‌వేస్ (ట్రూజెట్) బెస్ట్ ఉడాన్ ఎయిర్ లైన్ అవార్డు దక్కించుకుంది. 2.5 కోట్లకుపైగా ప్రయాణికుల విభాగంలో బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, బెస్ట్ డొమెస్టిక్ ఎయిర్‌లైన్‌గా (షెడ్యూల్డ్) విస్తారా, ఏవి యేషన్ సస్టేనబిలిటీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ అవార్డును స్పైస్‌జెట్, జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ స్వీకరించాయి. వెంచర్ ఎయిర్‌కనెక్ట్, ఢిల్లీ కార్గో సర్వీస్ సెంటర్, ఇండియన్ ఏవియేషన్ అకాడమీ (న్యూఢిల్లీ), ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీస్, ఇండియన్ ఆయిల్ స్కై ట్యాంకింగ్ తదితర కంపెనీలు పలు అవార్డులకు ఎంపికయ్యాయి.

భారత్ నుంచి రెట్టింపు కొనుగోళ్లు

- త్వరలో 2 బిలియన్ డాలర్లకు సోర్సింగ్
- బోయింగ్ వెల్లడి

బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ సలిల్ గుప్తే (ఎడమ)తో డరెన్ హస్ట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత సరఫరాదారుల నుంచి కొనుగోళ్లను మరికొన్నాళ్లలో 2 బిలియన్ డాలర్లకు పెంచుకోను న్నట్లు విమానాల తయారీ దిగ్గజం బోయింగ్ కమ ర్షియల్ ఎయిర్‌ప్లేన్స్ వైస్ ప్రెసిడెంట్ డరెన్ హస్ట్ తెలిపారు. ప్రస్తుతం ఇది ఏటా 1 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉందని ఆయన చెప్పారు. భారత్‌లోని 200 మంది పైగా సరఫరాదారులు బోయింగ్‌కు చెందిన అత్యాధునిక ఉత్పత్తులకు అవసరమైన విడి భాగాలు అందిస్తున్నారని హస్ట్ వివరించారు. భారత్ ఎయిర్‌లైన్స్‌కి 2040 నాటికి కొత్తగా 2,500 పైచిలుకు విమానాలు అవసరమవుతాయన్న అంచనాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. భారత్‌లోనే విమానాల లీజింగ్, ఫైనాన్సింగ్ కార్యకలపాలు అందుబాటులోకి తెచ్చేలా పౌర విమానయాన శాఖతో సంప్రతింపులు జరుపుతున్నట్లు హస్ట్ పేర్కొన్నారు.

విమానాశ్రయాల కోసం ఏటా 5,000 కోట్లు

ఏఏఐ చైర్మన్ అరవింద్ సింగ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విమానాశ్రయాల అభివృద్ధి కోసం ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఏటా సగటున రూ.3,000-4,000 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ ఏడాది నుంచి రూ.5,000 కోట్లు వ్యయం చేయ నున్నట్టు ఏఏఐ చైర్మన్ అరవింద్ సింగ్ వెల్లడిం చారు. వింగ్స్ ఇండియా ప్రదర్శన, సదస్సులో శుక్రవారం పాల్గొన్న ఆయన మీడియాతో ప్రత్యే కంగా మాట్లాడారు. 'వచ్చే అయిదేళ్లు రూ.25,000 కోట్లు ఖర్చు చేయనున్నాం. ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్ విధానంలో వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.2,220 కోట్లు సమీకరించనున్నాం. ఉడాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.4,500 కోట్లు కేటాయించింది' అని వివరించారు.

హైదరాబాద్ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్ట్ అనుబంధ సంస్థ జీహెచ్ఏఎస్ఎల్‌తో ఒప్పందం చేసుకుంది. తొలి దశలో 33 వేల చ.అ. విస్తీర్ణంలో ఈ వేర్ హౌజ్, డిస్ట్రిబ్యూషన్, ట్రేడ్ జోన్‌ను ఏర్పాటు చేస్తు న్నామని, డిమాండ్‌ను బట్టి లక్ష చ.అ.లకు విస్తరి స్తామని స్పైస్‌జెట్ సీఎండీ అజయ్ సింగ్ తెలిపారు. ఒక దేశీయ విమానయాన సంస్థ జీహెచ్ఏఎస్ఎ ల్‌తో భాగస్వామ్యం కావటం ఇదే తొలిసారి.

హెచ్ఏఎల్‌తో సీఎస్ఐఆర్-ఎన్ఏఎల్ ఒప్పందం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సరస్ ఎంకే2 విమానాల రూపకల్పన, అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ రంగ హెచ్ఏఎల్, సీఎస్ఐఆర్-ఎన్ఏఎల్ (నేష నల్ ఏరోస్పేస్ ల్యాబ్స్) అవగాన ఒప్పందం కుదుర్చుక న్నాయి. వింగ్స్ ఇండియా-2020 సందర్భంగా ఇరు సంస్థలు ఈ ఒప్పందానికి వచ్చాయి.

హైదరాబాద్‌లో స్పైస్‌జెట్ వేర్‌హౌజ్

జీహెచ్ఏఎస్ఎల్‌తో ఒప్పందం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ విమాన యాన కంపెనీ స్పైస్‌జెట్ జీఎంఆర్ హైదరాబాద్ ఏవియేషన్ సెజ్ (జీహెచ్ఏఎస్ఎల్)లో వేర్‌హౌజ్ ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు జీఎంఆర్

రాష్ట్రీయం

మావోయిస్టుల చేతిలో డ్రోన్లు!

ఔను..ఇది తరగతి గదే..!

బట్టలు, బ్యాగులు, దుప్పట్లు, బకెట్లు.. వాటి మధ్యనే విద్యార్థులకు తరగ తులు. ఇదీ నిర్మల్ జిల్లా భైంసాలోని జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి. ఈ పాఠశాల కుభీర్‌లో ఉండగా, అక్కడ సరైన వసతులు లేని కారణంగా భైంసాకు తరలించారు. ఇక్కడా విద్యార్థుల సంఖ్యకు సరిపడా వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కూర్చోవడానికి బెంచీలు లేక నేలపైనే కూర్చుంటున్నారు. - భైంసా టౌన్

విద్యార్థిగా మారిన కలెక్టర్

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ బయ్యారం మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. అరగంట పాటు విద్యార్థిగా మారారు. తొమ్మిదో తరగతి గదికి వచ్చిన ఆయన విద్యార్థు లతో పాటు కలసి కూర్చున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బోధి స్తున్న గణితం పాఠాలు విన్న ఆయన.. ఆ తర్వాత విద్యార్థులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. - బయ్యారం

పోలీసుల కదలికలు తెలుసుకునేందుకు వినియోగం

- ఛత్తీస్‌గఢ్ నుంచి ఏడు యాక్షన్ టీంలు రాష్ట్రంలోకి..!
- అప్రమత్తమైన పోలీసులు.. గోదావరి తీరం వెంబడి కూంబింగ్
- నలుగురు అనుమానితుల అరెస్టుతో కలకలం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్టుల సంచారం కలకలం రేపు తోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి ఏడు యాక్షన్ టీంలు తెలంగాణలోకి ప్రవేశించాయన్న సమాచా రంతో అప్రమత్తమైన పోలీసులు నిఘా పెంచారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని చెన్నూ రు నుంచి పాత ఖమ్మం జిల్లాలోని చర్ల వరకు గాలింపు ముమ్మరం చేశారు. ఈ ప్రాంతా లన్నీ నదీ పరీవాహకాలే. దీంతో మావోయి స్టులు తెలంగాణలోకి ప్రవేశించాలంటే.. తప్పనిసరిగా గోదావరి నదిని దాటాలి. రెండు నుంచి మూడు కిలోమీటర్ల వెడల్పున్న నదిని దాటేముందు గట్టుకు అవతల పోలీ సులు ఉన్నారో లేదో ధ్రువీకరించుకునేందుకు మావోయిస్టులు డ్రోన్లను వినియోగిస్తు న్నారని సమాచారం. మార్చి ఆఖరివారంలో ముఖ్యమంత్రి కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టు లను సందర్శించే అవకాశాలున్నాయి. దీంతో పోలీసులు డిపార్ట్‌మెంట్ ఈ ప్రాంతంలో అణువణువూ గాలిస్తున్నాయి.

పోస్టర్లు విడుదల

దండకారణ్యంలో గుత్తికోయ తెగలకు చెందినవారే మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం సభ్యులుగా ఉన్నారు. వీరికి తెలుగుభాష కూడా రావడంతో ఇక్కడికి వచ్చి సులువుగా జనాల్లో కలసిపోవడం, రిక్రూట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారు. వీరిలో మావోయిస్టు పార్టీ కార్యదర్శి అగ్రనేత హరిభూషణ్, ఆయన భార్య శారద కూడా ఉన్నట్లు సమాచారం. వీరిని సులువుగా గుర్తించేందుకు వీలుగా పోలీసులు వారి ఫొటోలతో ఉన్న పోస్టర్లు చెన్నూరు నుంచి చర్ల వరకు అంటించారు. వీరి సమాచారం చెప్పినవారికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నగదు బహుమతి ప్రకటించారు. వాస్తవానికి ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు ప్రాబ ల్యం బాగానే ఉంది.

మావోయిస్టుల పోస్టర్‌ను విడుదల చేసిన పోలీసులు

ఇటు 'సూదో' వసూళ్లు..

పోలీ సులు గాలిం పులు తీవ్రతరం చేయడం, మావోయి స్టుల పోస్టర్లు విడుదల చేశారు. ముఖ్యంగా ఏజెన్సీలోని స్థానిక వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులను అప్ర మత్తంగా ఉండాలని హెచ్చ రించారు. ఇదే అదనుగా.. సందట్లో సడేమియా అన్నట్లుగా.. కొత్త గూడెం, భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతాల్లో నకిలీ నక్సలైట్ల గోల మొదలైంది. స్థానిక వ్యాపారులు, అధికారపార్టీ నాయకులను డబ్బులు ఇవ్వాలంటూ బెదిరింపు లేఖలు పంపుతున్నారు.

అంతా అలర్ట్..!

కొత్తగూడెం పరిధిలోని నీలాద్రిపేట వద్ద మావో యిస్టులు పోలీసులు తారసపడ్డారు. పోలీసులను చూసిన ఏడుగురు మావోలు తప్పించుకుని పారిపో యారు. ఈ సందర్భంగా వంటసామగ్రి, విప్లవ సాహి త్యం, ఐఈడీ (ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్)లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరి కోసం పోలీ సులు ఇంకా గాలిస్తున్నారు. భద్రాచలం జిల్లాలో ఎస్పీ సునీల్ దత్ ఆధ్వర్యంలో పోలీసులు హెలికాప్టర్, డ్రోన్ల సాయంతో వెదుకుతున్నారు. గతేడాది జూలై 12న ఎంపీటీసీ నల్లూరి శ్రీనివాసరావు హత్య తరువాత మళ్లీ ఇప్పుడే మావోల కదలికలు మొదలవడం గమనార్హం. ఎలాగైనా తెలంగాణలో ఉనికిని చాటుకోవాలని ప్రయత్నిస్తోన్న హరిభూషణ్-శారద దంపతులే శ్రీనివాసరావు హత్యలోనూ నిందితులు కావడం గమనార్హం. దూకుడుగా వెళ్లడం, యువతను ఆకర్షించడమే లక్ష్యంగా వీరు పావులు కదుపుతున్నారు. మొత్తానికి అటు ఆపరేషన్ ప్రహార్, ఇటు తెలంగాణ పోలీసుల కూంబింగ్‌తో రెండు వైపులా మావోయిస్టులను ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు. ముఖ్యంగా చెన్నూరు, ఏటూరునాగారం, కాటారం, ముత్తా రం, చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు మండ లాల్లో తనిఖీలు పెంచారు. ఆదివాసీలు, గూడేలలో నలుగురు అనుమానితులను పోలీసులు అరెస్టు చేయడంతో మరింత కలకలానికి దారి తీసింది. మరోవైపు పోలీసులు ఎప్పుడు ఎవరిని పట్టుకుపోతారో తెలియక.. ఆదివాసీలు బిక్కుబి క్కుమంటున్నారు.

హైదరాబాద్‌కు కరోనా అనుమానితులు

- జగిత్యాల నుంచి ఒకరు.. ఖమ్మం నుంచి మరొకరు..
- వరంగల్‌లో దంపతులకూ వైరస్ లక్షణాలు

పెగడపల్లి/ఖమ్మం వైద్యవిభాగం: జగిత్యాల, ఖమ్మం జిల్లాలకు చెందిన ఇద్ద రు కరోనా వైరస్ అనుమానితులను శుక్రవారం హైదరాబాద్ తరలించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన మహ్మద్ రఫీ ఫిబ్రవరి 26న దుబాయ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. దగ్గు, జ్వరంతో బాధ పడుతున్న ఆయనను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రఫీని పరీక్షించిన వైద్యులు కరోనా లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో హైదరా బాద్ తరలించినట్లు డీఎంహెచ్‌వో శ్రీధర్ తెలిపారు. అలాగే.. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వైద్య విద్యార్థిని ప్రత్యేక అంబు లెన్స్‌లో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇదే జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామానికి చెందిన ఓ విద్యార్థి లండన్ నుంచి వచ్చాడు. ఇతనికి కరోనా వైరస్ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానించి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. కాగా, వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండకు చెందిన దంపతులు వైరస్ లక్షణాలు ఉన్నట్లు తెలిసింది.

షార్ట్ సర్క్యూట్‌తో ట్రావెల్స్ బస్సు దగ్ధం

ప్రయాణికులు సురక్షితం

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం వద్ద ఘటన

రామచంద్రాపురం: ముంబై నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో జరిగింది. ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు గురువారం సాయంత్రం ముంబై నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో రామచంద్రాపురం నాగులమ్మ దేవాలయం సమీపంలోకి వచ్చేస రికి బస్సులో నుంచి పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ అనిల్ అప్రమత్తమై ప్రయాణికులను కిందకు దింపాడు. అంత లోనే బస్సులో పెద్దఎత్తున మంటలు అంటు కున్నాయి. బస్సు దగ్ధమైన చోట పక్కనే పెట్రోల్ బంకు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ఉన్న 26 మంది ప్రయాణి కులందరూ సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

పసుపు రైతుకు 'అకాల' దెబ్బ

- వర్షంతో తడిసి ముద్దయిన వైనం
- లబోదిబోమంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కనీస ధర దక్కక నష్టాల పాలవుతున్న పసుపు రైతుపై మరో దెబ్బ పడింది. చేతికందిన పంటను అకాల వర్షం ముంచేసింది. గురువారం కురిసిన అకాల వర్షానికి మార్కెట్ యార్డుకు తరలించేందుకు కల్లాల్లో ఎండ బెట్టుకున్న పసుపు తడిసి ముద్దయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాల్లోని పలు గ్రామాల్లో అకాల వర్షానికి వందలాది మంది రైతుల కల్లాల్లో ఉన్న పసుపు తడిసిపోయింది. దీంతో పసుపునకు ఫంగస్ వస్తుందని.. తమ పంటను అమ్ముకునేదెలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం నష్టపోయిన రైతుల్లో చిన్న, సన్నకారు రైతులే అధి కంగా ఉన్నారు. కాగా, అకాల వర్షానికి వరి, మొక్కజొన్న పంటలు కూడా దెబ్బతిన్నాయి.

చేతులెత్తేసిన అధికారులు

నిబంధనల ప్రకారం చేనులో నష్టపోయిన పంటనే పరిగణనలోకి తీసుకుంటామని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పైగా పంటలో 33 శాతానికి మించి నష్టం వాటిల్లి తేనే పరిహారం అందుతుందని అంటున్నారు. తమ శాఖ అధికారులు పంట నష్టం వివరాలను సేకరిస్తున్నారని ఉద్యానవన శాఖాధికారి నర్సింగ్ దాస్ 'సాక్షి'తో పేర్కొన్నారు.

వణికిపోతున్న అమెరికా..

కోవిడ్ దెబ్బకు మూతపడ్డ అమెరికా విశ్వవిద్యాలయాలు
పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు నిరవధిక సెలవులు
ఇంటి నుంచే పని చేయాలన్న మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఆపిల్, గూగుల్
'వర్క్ ఫ్రమ్ హోం'తో సందడి కోల్పోయిన సిలికాన్ వ్యాలీ
సెలవులు ఇవ్వడంతో ఇంటి ముఖం పడుతున్న తెలుగు విద్యార్థులు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: కరోనా వైరస్ విజృంభిస్తున్న వేళ అమెరికా ప్రభుత్వం అక్కడి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ కార్యాలయాలు, వైట్‌హౌస్ సహా (అత్యవసర సేవలు మినహా) ఇంటి నుంచే పని చేయాలని ఆదేశించింది. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో సభలు, సమావేశాలు పెట్టుకోరాదని సూచించింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఆపిల్, ఫేస్‌బుక్ తన ఉద్యోగులను ఇంటి నుంచే పని చేయాలని కోరాయి. వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, లాస్ ఏంజెలిస్, సియాటిల్, షికాగో విమానాశ్రయాల్లో ఇప్పుడు సందడి లేదు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి, ఒక నగరం నుంచి మరో నగరానికి కూడా రాకపోకలు దాదాపు తగ్గాయి. యూరోపియన్ దేశాల నుంచి విమానాలు రద్దు చేయడంతో అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ప్రయాణికులు తక్కువగా కన్పిస్తున్నారు. సిలికాన్ వ్యాలీగా పేరొందిన శాన్‌జోస్, శాన్‌ఫ్రాన్సిస్కోలో పనిచేసే వేలాది మంది ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచే పని చేస్తుండటంతో రోడ్లు నిర్మానుష్యంగా కన్పిస్తున్నాయి. న్యూయార్క్ డౌన్‌టౌన్‌లో రాత్రి 10 గంటలయ్యే సరికి జన సంచారం తగ్గిపోతోంది. న్యూయార్క్‌లో అత్యవసర సర్వీసులకు చెందిన ఉద్యోగులు మాత్రమే తగిన జాగ్రత్తలతో విధులకు హాజరవుతున్నారు.

ఇంటి బాట పడుతున్న మనోళ్లు..

అమెరికాలోని స్కూళ్లు, కాలేజీలకు నిరవధిక సెలవులు ప్రకటించడంతో అక్కడి విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న వేలాది మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు తిరుగుముఖం పడుతున్నారు. విమాన చార్జీలు తక్కువగా ఉండటంతో విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు భారీ సంఖ్యలో భారత్‌కు తిరిగి వెళ్తున్నారని 'న్యూయార్క్ టైమ్స్' ఓ కథనంలో పేర్కొంది. భారత్‌లో కోవిడ్ వైరస్ ఉన్నా అమెరికాతో పోలిస్తే తక్కువగా ఉండటమే దీనికి కారణమని ఆ పత్రిక పేర్కొంది. వర్క్ ఫ్రం హోం వల్ల ఐటీ ఉద్యోగులు కూడా స్వస్థలాలకు పయనమయ్యారు. కనీసం నెల రోజుల కంటే ఎక్కువ వర్క్ ఫ్రం హోం ఉంటుందని, ఈ సమయాన్ని తల్లిదండ్రులతో గడపాలని హైదరాబాద్ వచ్చినట్లు అమెజాన్ ఉద్యోగి రవికిషోర్ చెప్పారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తనను పరీక్షించి, ఆరోగ్యంగా ఉన్నానని నిర్ధారించాకే ఇంటికి పంపినట్లు నూకల అనూష గుర్తుచేసుకున్నారు. జర్మనీ నుంచి వచ్చిన ఓ ఐటీ ఉద్యోగి దగ్గుతో బాధపడుతుండటంతో అతడిని గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డుకు తరలించారు.

ప్రయాణాలు రద్దు చేసుకున్న భారతీయులు

మార్చి 15 నుంచి జూన్ 30 వరకు అమెరికా, యూరప్ దేశాల్లో పర్యటించాలనుకున్న భారతీయులు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నారు. మార్చి 15-31 మధ్య తమ విమానాల్లో అమెరికాలోని వివిధ నగరాలకు వెళ్లాలనుకుని టికెట్లు బుక్ చేసుకున్న వారిలో 88 శాతం మంది రద్దు చేసుకోవడమో లేదా గడువు పెంచుకోవడమో చేశారని ఎమిరేట్స్ ప్రతినిధి తెలిపారు. కోవిడ్ వైరస్ తీవ్రత తక్కువగా ఉన్నా.. సింగపూర్, బ్యాంకాక్, దుబాయ్ నగరాలకు హైదరాబాద్ నుంచి వెళ్లే వారి సంఖ్య 50 శాతం పైగా తగ్గిందని చెబుతున్నారు. 'హైదరాబాద్ నుంచి దుబాయ్‌కు రోజుకు సగటున 1,500 మంది రాకపోకలు సాగిస్తారు. ఇప్పుడు ఆ సంఖ్య 250 నుంచి 300 లోపే. బ్యాంకాక్‌కు సగటున 600 మంది వెళ్తారు. ఇప్పుడు పదుల సంఖ్యలో కూడా వెళ్లట్లేదు' అని ఓ ట్రావెల్ ఏజెన్సీ ప్రతినిధి చెప్పారు.

కోవిడ్‌ను జయించాడు

- గాంధీ ఆస్పత్రి నుంచి వైరస్ బాధితుడి డిశ్చార్జి
- మీడియా కంటపడకుండా కుటుంబ సభ్యులకు అప్పగింత

హైదరాబాద్: ప్రపంచ దేశాలను వణికిస్తున్న కోవిడ్ వైరస్‌ను అతను జయించాడు. వివిధ దేశాల్లో వేలాది మందిని కబళించిన మహమ్మారి బారి నుంచి క్షేమంగా బయటపడ్డాడు. 13 రోజులపాటు గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందిన కోవిడ్ బాధితుడు శుక్రవారం రాత్రి నాటకీయ పరిణామాల మధ్య డిశ్చార్జి అయ్యాడు. సికింద్రాబాద్‌లోని మహేంద్రాహిల్స్‌కు చెందిన యువకుడు కోవిడ్ లక్షణాలతో ఈ నెల 1న గాంధీ ఐసోలేషన్ వార్డులో చేరాడు. నిర్ధారణ పరీక్షల్లో కోవిడ్ పాజిటివ్ రావడంతో తెలంగాణ ప్రభుత్వంతోపాటు వైద్య ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు. బాధిత యువకుడిని గాంధీ అత్యవసర విభాగంలోని కోవిడ్ అక్యూట్ ఐసీయూలో ఉంచి వైద్యసేవలు అందించారు. మూడు రోజుల క్రితం నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా నెగటివ్ రిపోర్టు వచ్చింది. మరోమారు నమూనాలు సేకరించి పుణేలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపగా అక్కడ కూడా నెగటివ్ రావడంతో శుక్రవారం రాత్రి బాధిత యువకుడిని డిశ్చార్జి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నాటకీయ పరిణామాల మధ్య...

బాధిత యువకుడిని శుక్రవారం రాత్రి డిశ్చార్జి చేస్తారని తెలుసుకున్న మీడియా ప్రతినిధులు గాంధీ ఆస్పత్రి అత్యవసర విభాగం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో రాత్రి 8 గంటలకు కోవిడ్ అక్యూట్ ఐసీయూ వద్ద విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బంది, అటెండర్లను 'మీరంతా భోజనం చేసి రండి'అంటూ వైద్యాధికారులు అక్కడి నుంచి పంపించేశారు. బాధిత యువకుడిని అక్యూట్ ఐసీయూ నుంచి కాలినడకన ఇన్-పేషెంట్ బ్లాక్‌కు తీసుకొచ్చి ఆస్పత్రి ప్రధాన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లోని హెల్ప్ డెస్క్ వద్ద అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో వారు ప్రైవేటు వాహనంలో బాధిత యువకుడిని తీసుకెళ్లిపోయారు. విషయం తెలియని మీడియా ప్రతినిధులు ఆస్పత్రి అత్యవసర విభాగం వద్ద గంటల తరబడి వేచి ఉన్నారు. బాధిత యువకుడిని డిశ్చార్జి చేసి పంపినట్లు రాత్రి 10.15 గంటలకు మీడియాకు సమాచారం అందించారు.

మరో 15 రోజులు హోం ఐసోలేషన్‌లో...

కోవిడ్‌ను జయించిన యువకుడిని మరో 15 రోజులపాటు హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది. బాధిత యువకుడి కుటుంబ సభ్యులకు గతంలోనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా అందరికీ కోవిడ్ నెగటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో బాధిత యువకుడితో పాటు అతని కుటుంబ సభ్యులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను ఆస్పత్రి అధికారులు వివరించారు.

మరో పాజిటివ్ కేసు?

కోవిడ్ బాధితుడు డిశ్చార్జి అయిన కొద్దిసేపటికే మరో పాజిటివ్ కేసు గాంధీ ఆస్పత్రిలో అడ్మిట్ అయినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కోవిడ్ లక్షణాలతో చికిత్స పొందుతున్న మహిళకు నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిందని తెలిసింది. దీంతో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ప్రైవేటు ఆస్పత్రి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో గాంధీ ఐసోలేషన్ వార్డుకు ఆమెను తరలించినట్లు సమాచారం. ఆమె నుంచి నమూనాలు సేకరించి పుణే ల్యాబ్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఇటీవల సౌదీ వెళ్లొచ్చిన ఇద్దరు నగర యువకులు కోవిడ్ లక్షణాలతో బాధపడుతుండడంతో వారికి నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా, కోవిడ్ వైరస్ నేపథ్యంలో రెండో శనివారం, ఆదివారం కూడా వైద్య సిబ్బంది విధుల్లోనే ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. కమాండ్ కంట్రోల్ రూం కూడా 24 గంటలు పనిచేస్తుందని అధికారులు పేర్కొన్నారు.

అలా ఇవ్వలేం..

- కోవిడ్ లేదంటూ సర్టిఫికెట్ ఇవ్వాలని గాంధీ ఆస్పత్రి వద్ద పలువురి ఆందోళన
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించలేమన్న పాలనాయంత్రాంగం

హైదరాబాద్: ఇతర ప్రాంతాలు, వివిధ దేశాలకు వెళ్లే ప్రయాణికులకు కోవిడ్ లేదని సర్టిఫికెట్ ఇచ్చే ప్రసక్తేలేదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించలేమని గాంధీ ఆస్పత్రి పాలనాయంత్రాంగం స్పష్టం చేసింది. సౌదీ అరేబియా వెళ్లేందుకు సర్టిఫికెట్ కావాలంటూ శుక్రవారం గాంధీ ఆస్పత్రి వద్ద ఆందోళన చేసిన పలువురికి నచ్చజెప్పి పంపారు. సుమారు 15 మంది కొన్ని నెలల కింద ఉపాధి పనుల కోసం సౌదీ అరేబియా వెళ్లి సెలవుపై ఇటీవలే స్వస్థలాలకు వచ్చారు. సెలవులు ముగియడంతో తిరిగి సౌదీకి వెళ్లేందుకు విమాన టికెట్లు బుక్ చేసుకున్నారు. కోవిడ్ నేపథ్యంలో వైరస్ లేదని ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్ ఉంటేనే ఎయిర్‌పోర్టు అధికారులు దేశంలోకి అనుమతిస్తున్నారని సౌదీలో వీరు పనిచేస్తున్న సంస్థ యాజమాన్యాలు తెలిపాయి. దీంతో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 15 మంది గాంధీ ఆస్పత్రి కోవిడ్ హెల్ప్‌డెస్క్ వద్దకు చేరుకుని తమకు వైరస్ లేదని సూచిస్తూ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. దీనికి హెల్ప్‌డెస్క్ సిబ్బంది నిరాకరించడంతో అక్కడే కొంతసేపు ఆందోళన నిర్వహించారు. అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న ఆస్పత్రి పాలనాయంత్రాంగం వారితో సమావేశమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు విరుద్ధంగా తాము ఎటువంటి సర్టిఫికెట్ ఇవ్వలేమన్నారు. కోవిడ్ లక్షణాలతో వచ్చే వారి నుంచి మాత్రమే నమూనాలు సేకరించి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని, నివేదికలో కోవిడ్ నెగిటివ్ వస్తే అదే విషయాన్ని ధృవీకరిస్తామని, ప్రత్యేకంగా వైరస్ లేదనే సర్టిఫికెట్ ఇవ్వలేమని నచ్చజెప్పడంతో వారంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆరోగ్యశ్రీలో కేన్సర్‌ను చేర్చేందుకు ప్రయత్నిస్తా

- ప్రజల్లో కేన్సర్‌పై మరింత అవగాహన పెరగాలి: గవర్నర్
- ముందు జాగ్రత్తగా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి
- 'కోవిడ్' నేపథ్యంలో అధికారిక కార్యక్రమాలు రద్దు చేసుకున్న తమిళిసై

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం ఆయుష్మాన్ భారత్ దేశంలోని అత్యధిక మంది ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తోందని.. అత్యంత క్లిష్టమైన కేన్సర్ల చికిత్సకూ ఇందులో అవకాశం ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. కొన్ని రాష్ట్రాలు ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాల్లో పాలు పంచుకోవట్లేదని పేర్కొన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకంలో కేన్సర్ చికిత్సను కూడా చేర్చేందుకు ప్రయత్నిస్తానని ఆమె చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం మొదలైన ఇండియన్ కోఆపరేటివ్ ఆంకాలజీ నెట్‌వర్క్ (ఐకాన్) సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై గవర్నర్ మాట్లాడారు. కేన్సర్ పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సి ఉందన్నారు. తమిళనాడులో రాజకీయ పార్టీ అధ్యక్షురాలిగా మారనంత వరకూ తాను వైద్యం చేశానని చెప్పారు. తుదిదశలో ఉన్న కేన్సర్ రోగుల్ని చాలామందిని చూశానని, టెక్నాలజీ వైద్యం ఎంతో అభివృద్ధి చెందినా ప్రస్తుత పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదన్నారు. చాలామంది చివరిదశ వరకూ కేన్సర్ పరీక్షలు చేయించుకోరని, ముందుజాగ్రత్త చర్యగా తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటే.. వ్యాధి ముదరక ముందే చికిత్స తీసుకొని ప్రాణాలు కాపాడుకోవచ్చునని వివరించారు. స్వచ్ఛంద సంస్థగా ఏర్పడి 42 ఏళ్లుగా కేన్సర్ విషయంలో విశేష కృషి చేస్తున్న ఐకాన్ సంస్థ ప్రజా చైతన్యం విషయంలో మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. కొన్ని రకాల కేన్సర్లకు అందుబాటులో ఉన్న టీకాల గురించి ప్రజలకు వివరించాలని, స్వీయ పరీక్షలపై కూడా అవగాహన మరింత పెంచాలని కోరారు. మూడ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో కేన్సర్ రోగులకు మెరుగైన చికిత్స అందించడం ఎలా అన్న అంశంపై చర్చలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఐకాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పర్వేశ్ పారీఖ్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి డాక్టర్ సాయిరామ్, సీనియర్ ఆంకాలజిస్ట్ కేవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

గవర్నర్ అధికారిక కార్యక్రమాలు రద్దు..

కరోనా వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో శనివారం నుంచి తన అధికారిక కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుంటున్నట్లు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రకటించారు. ఇప్పటికే కార్యక్రమాలు రద్దు చేసుకోవాలని ప్రభుత్వ అధికారులు తనకు సూచించారని.. ముందుగా నిర్ణయించిన కొన్ని కార్యక్రమాలను రద్దు చేసుకోలేకపోయానని ఆమె అన్నారు.

నిల్వలు పడిపోతున్నాయి... నియంత్రించుకోండి

- శ్రీశైలంలో తగ్గుతున్న నీటి మట్టాలు.. 838 అడుగులకు చేరిన నిల్వలు
- మరో నాలుగు అడుగులు తగ్గితే కనీస మట్టాలకు..
- వినియోగంపై హెచ్చరించిన కృష్ణా బోర్డు



సాక్షి, హైదరాబాద్ : కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు గణనీయంగా తగ్గుతుండటం ఆందోళన కల్గిస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు కింద నీటి అవసరాలు ఎక్కువగా ఉండటం, నిల్వలు పడిపోతుండటంతో తెలుగు రాష్ట్రాలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడుతోంది. ప్రాజెక్టులో నీటి మట్టాలు ఇప్పటికే 838 అడుగులకు చేరగా, మరో నాలుగు అడుగులు తగ్గితే కనీస నీటి మట్టానికి పడిపోయే అవకాశాల నేపథ్యంలో నీటి వినియోగాన్ని తగ్గించాలని కృష్ణాబోర్డు తెలుగు రాష్ట్రాలను హెచ్చరిస్తూ లేఖలు రాసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల కింద ఈ ఏడాది తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు గరిష్టంగా నీటిని వాడుకున్నాయి. ఈ సీజన్‌లో ఇరు రాష్ట్రాలు మొత్తంగా 669.90 టీఎంసీలు వినియోగించుకోగా, ఇందులో ఏపీ 508.85 టీఎంసీలు, తెలంగాణ161.05 టీఎంసీల వినియోగం చేశాయి. మరో 105.64 టీఎంసీల మేర వినియోగం చేయాల్సి ఉండగా, ఇందులో శ్రీశైలం కింద 10.45, సాగర్ కింద 95.19 టీఎంసీలు వినియోగం చేయాల్సి ఉంది. ప్రస్తుతం శ్రీశైలంలో 838 అడుగుల వద్ద 53.85 టీఎంసీల నిల్వ ఉండగా, ఇందులో కనీస నీటి మట్టం 834 అడుగులకు ఎగువన వినియోగార్హమైన లభ్యత జలాలు 6.24 టీఎంసీలు మాత్రమే. ఇక సాగర్‌లో కనీస నీటి మట్టం 510 అడుగులకు పైన లభ్యత జలం 89టీఎంసీలు మాత్రమే ఉంది. మొత్తంగా 95 టీఎంసీల నీరు మాత్రమే లభ్యతగా ఉంది. అవసరాల కన్నా 10 టీఎంసీల మేర తక్కువగా జలాలున్నాయి. దీంతో ఇరు రాష్ట్రాలు శ్రీశైలంలో మళ్లీ కనీస నీటి మట్టాల దిగువకు వెళ్లి నీటిని వినియోగించాల్సి ఉంటుంది. అదీగాక శ్రీశైలంలో రోజుకు 440 క్యూసెక్కుల మేర నీరు ఆవిరవుతోంది. దీంతో మట్టాలు మరింత వేగంగా తగ్గే అవకాశాలున్నాయని కృష్ణా బోర్డు రెండ్రోజుల కిందట రాసిన లేఖలో ఇరు రాష్ట్రాలను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో శ్రీశైలం నుంచి నీటి విడుదలను తగ్గించాలని సూచించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.